RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

19 డిసెంబర్ 2024 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:171

# ఓవర్‌సీస్ స్కాలర్ షిప్పు పథకాన్ని పట్టించుకోండి

పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయండి

అసెంబ్లీలో బీఆర్ ఎస్ డిమాండ్ ,మీ కంటే మెరుగ్గా ఆ పథకాన్ని అమలు చేస్తాం

ఆ స్కీమ్‌ను ఎత్తేసే ఆలోచనే లేదు ,మంత్రి సీతక్క హామీ

డ్రంకన్ అండ్ డ్రైవ్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు, కాంగ్రెస్ సభ్యుడు బీర్ల ఐలయ్య మధ్య వాగ్వాదం

వారిద్దరి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్

వార్తా 2 లో







రాష్ట్రంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ర్యాలీగా అసెంబ్లీకి బయలుదేరిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు

# భూభారతి.. బిల్లులోని ప్రధానాంశాలు

2020 ఆర్వోఆర్ చట్టం (ధరణి) లోని తప్పులను కొత్త చట్టం భూ-భారతి సరిదిద్దుతుంది.

రాష్ట్రంలో భూముల సమస్యలకు కొత్త చట్టం శాశ్వత పరిష్కారం చూపిస్తుంది. భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది.

కొత్త చట్టం రూపకల్పనకు 18 రాష్ట్రాల్లో ఉన్న ఆర్వోఆర్ చట్టాలను అధ్యయనం చేసింది. చట్టం ముసాయిదాను కూడా ప్రకటించి ప్రజల నుంచి సలహాలు, సూచనలను కూడా స్వీకరించింది.

పైలెట్ ప్రాజెక్టుగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో పైలెట్ ప్రాజెక్టును నిర్వహించింది. విస్తృత స్థాయిలో చర్చలు జరిపి మేథోమధనం చేసి ఈ చట్టాన్ని రూపొందించింది.

గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి తో వివాదస్పదమైన 18 లక్షల ఎకరాల భూములను పార్టు (బీ) పేరుతో పరిష్కరించకుండా పెండింగ్ లో పెట్టారు. ఈ భూ భారతి చట్టం వీటికి పరిష్కారం చూపిస్తుంది.

దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని ఆబాదీ/ గ్రామ కంఠం సమస్యలను ఈ చట్టం పరిష్కరిస్తుంది.

భవిష్యత్తులో భూవివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే చేయించి శాశ్వతంగా పరిష్కరించే విధానం.

ధరణిలో రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా మ్యుటేషన్ జరిగేటప్పుడు ఏవైనా తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునే వ్యవస్థ లేదు. ఎవరికి ఫిర్యాదు చేసుకోవాలో తెలియని పరిస్థితి. ఇప్పుడు కొత్త చట్టం అప్పీలేట్ అథారిటీని ఏర్పాటు చేస్తుంది .

వారసత్వం, వంశపారంపర్య భూములు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేసారి చేయటంతో కుటుంబసభ్యుల నుంచి వచ్చే ఫిర్యాదులు పెరిగిపోయాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొత్త చట్టం ప్రకారం మ్యుటేషన్ చేసేటప్పుడు ఆ కుటుంబంలోని ఇతర సభ్యులకు నోటీసులు ఇచ్చి వారి అభిప్రాయాలను తీసుకొని మ్యుటేషన్ చేయటం జరుగుతుంది.

సేల్ డీడ్, వారసత్వం కాకుండా కోర్టు తీర్పుల ద్వారా వచ్చే ఓఆర్సీ, 38-ఈ తదితర 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ పవర్స్ కొత్త చట్టంలో ఆర్డీవోకు అప్పగించారు.

గత ప్రభుత్వం సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించకుండా పెండింగ్ లో పెట్టింది. ధరణి అమలుకు ముందు, తర్వాత కూడా సాదా బైనామా దరఖాస్తులు స్వీకరించింది. కానీ.. దీనికి సంబంధించిన పరిష్కారాన్ని చూపించలేదు. భూభారతి చట్టం 2020 నవంబరు 10 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన సుమారు 9.24 లక్షల సాదా బైనామా దరఖాస్తులకు పరిష్కారం చూపిస్తుంది.

దేశంలో ప్రతీ పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో మన రాష్ట్రంలో భూములకూ భూధార్ నంబర్ కేటాయిస్తారు.

త్వరలోనే ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమిస్తారు. గత ప్రభుత్వం రెవిన్యూ వ్యవస్థను భష్టు పట్టించింది. గ్రామీణ ప్రాంతాల్లో రెవిన్యూ వ్యవహారాలు చూసే వ్యవస్థ లేకుండా చేసింది.

2014కు ముందు రెవెన్యూ రికార్డుల నిర్వహణ, జమాబందీ ఎలా ఉందో.. ఇప్పుడు కూడా అదే విధంగా కొనసాగుతుంది.

భూ వివాదాల గ్రీవెన్స్, అప్పీళ్ళ కోసం లాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తారు. అవసరాన్ని, ప్రాంతాన్ని బట్టి వీటి సంఖ్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే ఆప్షన్ ను ప్రభుత్వం ఈ చట్టంలో పొందుపరిచింది. ప్రభుత్వ ఆస్తుల్ని ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై చర్యలు తీసుకుని శిక్షించేలా ఈ చట్టంలో నిబంధనలున్నాయి. 2014 కి ముందు పాస్ బుక్కులుండీ, అనుభవదారుడిగా పొసిషన్ లో ఉన్న వారు ధరణి తరువాత రోడ్డున పడ్డారు. ఈ భూ భారతిలో పట్టాదారులు, అనుభవదారులు అభద్రతాభావానికి గురి కావాల్సిన అవసరం లేదు. ఈ చట్టంలో వీరికి సముచిత స్థానం కల్పించారు. రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయాలలో భద్రపరుస్తారుభూ-భారతి ప్రత్యేకతలు ధరణిలో ఒక్కో సమస్యకు ఒక్కో మాడ్యుల్ ఉండేది. మొత్తం 33 మాడ్యూళ్లు (ఆప్షన్స్) ఉండేవి. ఏ మాడ్యూల్ ఏ సమస్యకు ఎంచుకోవాలో రైతులకు అర్థమయ్యేది కాదు. ఇప్పుడు దాన్ని సులభతరం చేసి ప్రభుత్వం కేవలం ఆరు మాడ్యూళ్ళకు కుదిస్తుంది. గతంలో మాన్యువల్‌గా పహాణీలో 32 కాలమ్‌లు ఉండేవి. వాటిని ధరణిలో ఒకే కాలమ్‌కు గత ప్రభుత్వం కుదించింది. ఇప్పుడు దాన్ని 11 కాలమ్‌లు చేస్తున్నాం.ధరణిలో భూ యజమానికి తన భూమి రికార్డుల వివరాలన్నీ కనిపించేవి కాదు. కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా అప్పటి ప్రభుత్వ లాకర్లలో బంధించింది. ఇప్పుడు భూ-భారతి ఎవరైనా ఎక్కడి నుంచైనా తమ భూమి వివరాలు చూసుకునేలా డిస్‌ప్లే చేస్తుంది.ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా ఎవరైనా భూ భారతి ద్వారా ప్రభుత్వానికి తెలియ చేయవచ్చు. ఆ భూముల్ని పరిరక్షించేందుకు ఈ చట్టం ప్రాధాన్యమిస్తుంది. భూ-భారతిలో దరఖాస్తు చేసుకున్న భూ యజమానులకు దరఖాస్తు పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా వారి మొబైల్ నెంబర్ కు అప్ డేట్ సమాచారం చేరవేస్తుంది.

# ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కేంద్ర నుంచి చట్ట ప్రకారం రావాల్సిన నిధులు తెస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

కేంద్ర





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా నేను, మా సహచర మంత్రులు ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రులను కలిసి సమాఖ్య స్ఫూర్తిని గౌరవిస్తూ చట్ట ప్రకారం మాకు రావాల్సిన నిధుల వాటా ఇంత ఉంది ఆ మేరకు నిధులు ఇవ్వాలని కోరుతున్నాం ఆ మేరకు నిధులు తీసుకొస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వివిధ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలపై ప్రశ్నించగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం పది ఏళ్లలో సాధించిన దాని కంటే మా ప్రభుత్వం కేంద్రం నుంచి అధికంగా నిధులు సాధించిందని డిప్యూటీ సీఎం వివరించారు. గత పది సంవత్సరాలుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులు, గత ఏడాది కాలంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధుల వివరాలతో తాను సభకు వచ్చానని తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి నేరుగా నిధులు కేటాయించదు, ఆ ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రత్యేక పథకాల ద్వారా నిధులు కేటాయిస్తుందని వివరించారు. మా ప్రభుత్వం ప్రతి విషయంలోనూ పారదర్శకంగా ఉంటుంది, మేము ఏ వివరాలను దాచుకునే వాళ్ళం కాదని అన్నారు. కేంద్రం జీఎస్టీ బిల్లును తీసుకురాగా గత ప్రభుత్వం మద్దతునిచ్చిందని.. ఆ తర్వాత వారు బిజెపితో వైరం పెట్టుకున్నారని అన్నారు.

# విజయ్ మాల్యా ఆస్తులు అమ్మి 14 వేల కోట్లు బ్యాంకులకు జమ

లోక్ సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన

నీరవ్ మోదీ నుంచి వెయ్యి కోట్లు వసూలు చేశామన్న కేంద్ర మంత్రి

మిగతా ఎగవేతదారుల నుంచి మరో 7 వేల కోట్లు రాబట్టామని వెల్లడి

వార్తా 11 లో



Photo Courtesy: PTI

ప్రజాబలం

19 డిసెంబర్ 2024 గురువారం

## బంగ్లా మైనారిటీల భద్రత ఎలా?

బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రత సమస్యను మిస్రి లేవనెత్తినా, ఢాకా బలమైన వాదనలను ముందుంచినట్లు తెలిపారు. ఇది మైనారిటీలపై దాడులు లేదా ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ దాస్ బెయిల్‌పై విడుదల ను అభ్యర్థిస్తున్న న్యాయవాదులను నిర్బంధించడం, చంపడం లేదా కొట్టి చంపడం వంటి అంశాలను 'అంతర్గత' వ్యవహారాలుగా పేర్కొనడం ద్వారా భారత్‌కు సంబంధం లేని విషయం అనే స్పష్టమై న సంకేతాలు ఇచ్చింది. ఒక విధంగా యూనస్ ముందు మిస్రి నిస్సహాయంగా తిరిగి వచ్చిన్నట్టు అర్థం అవుతుంది. పాకిస్తాన్ అణచివేత నుండి దేశాన్ని విముక్తి చేయడంలో ముక్తి బాహినికి సహాయం చేయడంలో భారత దేశం పాత్ర గురించి మిస్రి స్పష్టంగా లేవనెత్తే ప్రయత్నం కూడా చేసినట్టు కనిపించడం లేదు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత హిందువులపై, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులు మొత్తం భారత్ ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు 1947 నుండి జరుగుతూ ఉన్నప్పటికీ మొదటిసారిగా మొత్తం ప్రపంచంలో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈ విషయమై అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రవేశాలు వ్యక్తం చేశారు. యూరోపియన్ యూనియన్ కూడా బంగ్లాదేశ్‌ను దుందుడుకుగా ప్రవర్తించడాన్ని ఖండించింది. చట్ట పాలనను కాపాడాల్సిన అవసరాన్ని, తగిన ప్రక్రియను, ప్రాథమిక హక్కులను గౌరవించాల్సిన అవసరాన్ని యూరోపియన్ యూనియన్ తాత్కాలిక ప్రభుత్వానికి పిలుపునిచ్చింది. డిసెంబర్ 9న ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ ముహమ్మద్ యూనస్‌తో జరిగిన గోష్టిలో బంగ్లాదేశ్‌కు యూరోపియన్ యూనియన్ రాయబారి, ప్రతినిధి బృందం అధిపతి మైఖేల్ మిల్లర్ ఈ పిలుపిచ్చారు. కొద్ది రోజుల క్రితం ఆ దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడులపై యుకె పార్లమెంట్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న క్రూరత్వాన్ని ప్రపంచం ఇప్పుడు తీవ్రంగా ఖండిస్తున్నది. వాస్తవానికి, 1947లో విభజన జరిగినప్పటి నుండి అక్కడ మైనారిటీలు తీవ్ర అణచివేతకు గురవుతున్నారు. వారి ఆస్తులను దోచుకున్నారు, మహిళలను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, బలవంతంగా భారత దేశానికి పారిపోవాల్సిన పరిస్థితులు సృష్టిస్తున్నారు. 75 సంవత్సరాల నిరంతర హింస తర్వాత మొదటిసారి ప్రపంచం ఆందోళన వ్యక్తం చేస్తుంది. అయితే, ఈ విషయంలో భారత ప్రభుత్వం మాత్రం దిక్కుతోచని స్థితిలో కనిపిస్తున్నది. భారత విదేశాంగ విధానం కుప్పకూలిందా? అనే అనుమానం కలుగుతున్నది. విదేశాంగ మంత్రి పార్లమెంట్ ఉభయసభలలో ఓ ప్రకటన చేయడం మినహా ఈ విషయమై మన ఎంపిలు పార్లమెంట్ వేదికగా ఆగ్రవేశాలను వ్యక్తం చేసే ప్రయత్నం కూడా చేయలేదు. 1971లో దాదాపుగా మొత్తం ప్రపంచం భారత్‌కు వ్యతిరేకంగా నిలబడినా కేవలం నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఎంతో సాహసోపేతంగా నాటి తూర్పు పాకిస్తాన్‌లో జరుగుతున్న దారుణమైన అణచివేతలు ఖండించారు. అంతేకాదు ప్రత్యక్ష జోక్యానికి తలపడ్డారు. గత 75 ఏళ్లలో భారత సైనికులు సాంకేతికంగా విజయం సాధించిన ఏకైక యుద్ధం అదే కావడం గమనార్హం. మొత్తం ప్రపంచాన్ని నివ్వెరపరచిన ఆ విజయానికి గుర్తుగా పాక్ సైనికులు భారత సైనికుల ముందు లొంగిపోతున్న చిత్రాన్ని భారత సైన్యం ప్రధాన కార్యాలయం నుండి తొలగించడం ద్వారా నాటి సాహసోపేత నాయకత్వం గురించిన స్మృతులను చెరిపివేసే విచిత్రమైన ప్రయత్నాలను ఇప్పుడు 50 ఏళ్ల తర్వాత చేస్తున్నారు. అయితే, పొరుగు దేశమైన బంగ్లాదేశ్ లో పరిస్థితులు అదుపు తప్పడం మన భద్రతకు సైతం ప్రమాదకారిగా మారుతున్నా భారత్ మౌనం వహిస్తున్నది. షేక్ హసీనా ఆ దేశం విడిచిపెట్టే వరకు అక్కడ జరుగుతున్న పరిణామాల గురించి భారత్ ఏమాత్రం అవగాహన లేకుండా ఉండటం మన దౌత్య, రక్షణ విధానాల ఘోర వైఫల్యాలకు నిదర్శనమే.హసీనా ప్రభుత్వం కూలిన తర్వాత మొదటిసారిగా డిసెంబర్ 9న, భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహిద్ హుస్సేన్, తాత్కాలిక ప్రధాన మంత్రి ముహమ్మద్ యూనస్‌లను కలవడంతో పరిస్థితులపై భారత్ ఆందోళనలను స్పష్టంగా వ్యక్తీకరిస్తారని ఆశించాము. బంగ్లాదేశ్‌తో 'సానుకూల, నిర్మాణాత్మక, పరస్పర ప్రయోజనకరమైన సంబంధం' కోసం భారత్ విధానం పట్ల మిస్రి ఆశావాద స్వరాన్ని వినిపించినప్పటికీ, ఢాకా నుండి తగిన స్పందన కనిపించలేదు. దానితో ఆయన పర్యటన విఫలమిస్తోన్నట్లు స్పష్టం అవుతుంది. భారతదేశంలో హసీనాకు ఆశ్రయం కల్పించడం, తాత్కాలిక ప్రభుత్వం గురించి ఆమె చేసిన విమర్శనాత్మక ప్రకటనలకు సంబంధించిన ఉద్రిక్తతల నీడలో ఆయన జరిపిన చర్చలకు విలువ లేకుండా పోయింది. ఢాకా విమానాశ్రయంలో మాట్లాడుతూ, మిస్రి ఈ చర్చలను నిష్కపటమైన, ఉత్పాదక సంభాషణకు అవకాశంగా అభివర్ణించారు. రెండు దేశాల పరస్పర ప్రయోజనం కోసం ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడానికి భారత్ నిబద్ధతను నొక్కి చెప్పారు. అయితే, ఢాకా మీడియాలో వచ్చిన కథనాలు ఈ పర్యటన పట్ల ఆసక్తికరంగా లేవు. ఒక ప్రముఖ దినపత్రికలో వచ్చిన వ్యాసంలో, ఈ అభివృద్ధి (సామూహిక తిరుగుబాటు) ముందు, ఒకటిన్నర దశాబ్దాలకు పైగా, భారత ప్రయోజనాలకు సేవ చేయడం కోసం న్యూఢిల్లీ ఒకే పార్టీపై, ఆచరణాత్మకంగా ఢాకాలో ఒకే జమీందార్ లాంటి దేశాధినేతపై ఆధారపడటం ద్వారా విదేశాంగ విధాన పజిల్‌ను అందించింది' అంటూ భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని ఆ రచయిత తూర్పారబట్టారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రత సమస్యను మిస్రి లేవనెత్తినా, ఢాకా బలమైన వాదనలను ముందుంచినట్లు తెలిపారు. ఇది మైనారిటీలపై దాడులు లేదా ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ దాస్ బెయిల్‌పై విడుదలను అభ్యర్థిస్తున్న న్యాయవాదులను నిర్బంధించడం, చంపడం లేదా కొట్టి చంపడం వంటి అంశాలను 'అంతర్గత' వ్యవహారాలుగా పేర్కొనడం ద్వారా భారత్‌కు సంబంధం లేని విషయం అనే స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఒక విధంగా యూనస్ ముందు మిస్రి నిస్సహాయంగా తిరిగి వచ్చిన్నట్టు అర్థం అవుతుంది. పాకిస్తాన్ అణచివేత నుండి దేశాన్ని విముక్తి చేయడంలో ముక్తి బాహినికి సహాయం చేయడంలో భారత దేశం పాత్ర గురించి మిస్రి స్పష్టంగా లేవనెత్తే ప్రయత్నం కూడా చేసినట్టు కనిపించడం లేదు. ఇటువంటి ప్రస్తావనలు దౌత్యపరమైన వ్యూహంలో భాగం కాగలవు. యూనస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని హసీనా ప్రకటనలు జారీ చేయడంపై ఢాకా ముఖ్యంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రకటనలపై ఆగ్రహం వ్యక్తం చేయడం ద్వారా పరోక్షంగా భారత్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నది. యూనస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకురాలు బేగం జియాను చూసి మాత్రమే భయపడుతున్నారు. సత్వరం ఎన్నికలు జరపాలని ఆమె చేస్తున్న ఒత్తిడుల కారణంగానే మరో సంవత్సరం వరకు సాధ్యం కాకపోవచ్చని అంటూ సంజాయిషీ ఇచ్చుకునే రీతిలో స్పందించారు. మొదటి నుండి షేక్ హసీనా భారత్‌కు మిత్రురాలు అనే భావనతో భారత ప్రభుత్వాలు బేగం జియాతో నామమాత్రపు సంబంధాలను సైతం ఏర్పర్చుకొనే ప్రయత్నాలు చేయలేదు. హసీనా ఆ దేశం నుండి నిష్క్రమించిన తర్వాత కూడా ఆమెతో సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నం చేయడం లేదు. నేడు బంగ్లాదేశ్‌లో భారత్ పట్ల సానుకూలంగా మాట్లాడేవారు లేని పరిస్థితి నెలకొంది. దౌత్యపరంగా, రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నెలకొనడం రెండు దేశాలకు సైతం అత్యవసరం. అయితే బంగ్లాదేశ్‌లో అటువంటి ఆదుర్దా ఉన్నట్లు కనిపించడం లేదు. వాణిజ్యం, కనెక్టివిటీ, విద్యుత్, నీరు, అభివృద్ధి సహకారం, కాన్సులర్ సహకారం, సాంస్కృతిక సహకారం వంటి అనేక సమస్యలు ఉన్నందున భారతదేశం సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి ఆసక్తి చూపుతున్నట్లు కనిస్తున్నది. భారతదేశం, బంగ్లాదేశ్ బలమైన వాణిజ్య సంబంధాన్ని కలిగి ఉన్నాయి. భారతదేశం ఆసియాలో బంగ్లాదేశ్‌కు రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి కాగా, దక్షిణాసియాలో భారతదేశపు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బంగ్లాదేశ్ ఉంది. బంగ్లాదేశ్‌తో టాటా మోటార్స్, విఐపి, ఇమామి, మారికో, డాబర్, ఆసియన్ పెయింట్స్, పిడిలైట్, అదానీ పవర్, హీరో మోటోకార్ప్ వంటి ముఖ్యమైన సంస్థలు వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్నాయి. బంగ్లాదేశ్‌కు భారతదేశం ఎగుమతులు గత ఐదు సంవత్సరాలలో 7.17 బిలియన్ల డాలర్ల నుండి 2022లో 13.8 బిలియన్ల డాలర్లకు పెరిగాయి.

## ఓవర్‌సీస్ స్కాలర్ షిప్పు పథకాన్ని పట్టించుకోండి

విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థుల కోసం ఉద్దేశించిన ఓవర్‌సీస్ స్కాలర్ షిప్ పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవటం వల్ల ఆయా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శాసనసభలో బీఆర్ ఎస్ సభ్యుడు కేపీ వివేకానంద ఆవేదన వ్యక్తం చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.104 కోట్లు బకాయి ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాల నాలుగో రోజైన బుధవారం ఉదయం 10 గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన సభ ప్రారంభమైంది. ఆ వెంటనే ఆయన ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకానంద ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల అంశంపై పలు ప్రశ్నలు వేశారు. విదేశాల్లోని తెలంగాణ విద్యార్థులకు రెండో వాయిదా, మూడో వాయిదా కింద నిధులను విడుదల చేయకపోవటంతో వారు తాము పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెడుతూ ఇక్కడి ప్రజా ప్రతినిధులకు ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. మరోవైపు 2024-25లో ప్రభుత్వానికి ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలపాలని అడిగారు. ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్పుల పథకంలో అధికార పార్టీకి చెందిన వారు పది శాతం కమిషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు.

వివేకానంద లేవనెత్తిన అంశాలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమాధానమిస్తూ...గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఓవర్సీస్ స్కాలర్ షిప్పు పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ.244 కోట్లలో, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.140 కోట్లను విడుదల చేశామని వెల్లడించారు. వచ్చే మార్చి నాటికి గడువున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న మిగతా బిల్లులన్నింటినీ అప్పటిలోగా క్లియర్ చేస్తామని వివరించారు. అంతేతప్ప ఓవర్సీస్ స్కాలర్ షిప్పు పథకాన్ని తొలగించే, ఆపే ఆలోచనే లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ దశలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఆ పార్టీకి చెందిన సీనియర్ శాసనసభ్యుడు వివేకానంద ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్పుల విషయంలో అధికార పక్షానికి చెందిన వారు పది శాతం కమిషన్లు తీసుకున్నారంటూ ఆయన ఆరోపించారనీ, సంబంధిత వ్యాఖ్యలను వివేకానంద ఉపసంహరించుకోవాలని కోరారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కొద్దిగా ఆలస్యమైనా ప్రతీ ఒక్కటీ అమలు చేసి తీరతామని హామీనిచ్చారు. ఈ సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కలుగుజేసుకుని, ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలంటూ వివేకానందకు సూచించారు. అయినా ఆయన వెనక్కి తగ్గకపోవటంతో సభలో గందరగోళం చోటు చేసుకుంది. అనంతరం స్పీకర్... వివేకానంద చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. సభా సమయాన్ని వృథా చేయొద్దంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులకు ఏం నేర్పిస్తున్నారంటూ ప్రశ్నించారు. ఆయనతో వాగ్వాదానికి దిగిన బీఆర్ ఎస్ సభ్యులపై స్పీకర్ తీవ్ర అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సభ నుంచి సస్పెండ్ చేస్తానంటూ ఆ పార్టీకి చెందిన పాడి కౌశిక్‌రెడ్డిని సభాపతి హెచ్చరించారు.

అనంతరం కాంగ్రెస్ సభ్యుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... వివేకానంద తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ ఎస్ హయాంలో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, బర్రెలు, గొర్రెలు, చేపల పంపిణీ పథకాల్లో విపరీతంగా కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఓవర్ సీస్ స్కాలర్‌షిప్పుల అంశంపైన్నే బీఆర్ ఎస్ సభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డి పలు అంశాలను లేవనెత్తారు. ఇందుకు సంబంధించి నిధుల విడుదలలో విపరీతమైన జాప్యం చోటు చేసుకుంటోందని ఆయన వాపోయారు. ఇదే విషయమై బీఆర్ ఎస్ సభ్యుడు అనిల్ కుమార్ జాదవ్, ఎంఐఎం సభ్యుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల కూడా మాట్లాడారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానాలిస్తూ... బీఆర్ ఎస్ హయాంలో అస్తవ్యస్థమైన ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ ఒక్కో పథకాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పదేండ్ల బీఆర్ ఎస్ పాలనలో ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు ఏం చేశారో చెప్పాలంటూ ప్రశ్నించారు. అంబేద్కర్ ఓవర్‌సీస్ స్కాలర్ షిప్పుల పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ డిసెంబరులోగా పరిశీలించి, పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ పథకాన్ని గతం కంటే మెరుగ్గా అమలు చేస్తామని భరోసానిచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, కరీంనగర్ జాతీయ రఃహదారికి సంబంధించిన పలు అంశాలను కాంగ్రెస్ సభ్యుడు మదన్ మోహన్‌రావు సభ దృష్టికి తెచ్చారు. జియోగ్రాఫికల్ డిజైల్ లేకపోవటం వల్ల అనేక సంవత్సరాలుగా విపరీతమైన రోడ్డు ప్రమాదాలు ఆ రహదారిపై సంభవిస్తున్నాయని తెలిపారు. అనేక మంది మరణించారని చెప్పారు. ఇలాంటి అనేక విషయాలను సభలో చర్చిద్దామంటే ఆ అవకాశమే రాకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ శాసనసభ్యులు సైతం సభా సమయాన్ని వృథా చేయటం సరికాదని అన్నారు. ప్రజల నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు వారి కోసం సభలో మాట్లాడకుండా, సమస్యలపై చర్చించకుండా అరుపులు, కేకలతో సభను గందరగోళపరుస్తున్నారంటూ ఆక్షేపించారు. కరీంనగర్ జాతీయ రహదారి చాలా ప్రమాదకరంగా మారిందంటూ బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా మార్చాలంటూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. బీఆర్ ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... కరీంనగర్ జాతీయ రహదారికి సంబంధించి తమ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపినప్పటికీ, అలైన్‌మెంట్ కేంద్రం ఆమోదముద్ర వేయలేదని గుర్తు చేశారు. అందువల్లే దానికి డీపీఆర్ సమర్పించలేకపోయామని వివరించారు. సభ్యులు లేవనెత్తిన అంశాలకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమాధానమిస్తూ... గత ప్రభుత్వం సకాలంలో స్పందించి, డీపీఆర్ సమర్పించి ఉంటే కరీంనగర్ జాతీయ రహదారి పూర్తై ఉండేదని వ్యాఖ్యానించారు. బీఆర్ ఎస్ హయాంలో ప్రతీ జిల్లాలోనూ రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక ప్రణాళికాబద్దంగా రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి పూనుకుందని అన్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు ఏడు కిలోమీటర్ల వరకూ ఉన్న రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని చెప్పారు. ఓ.ఆర్.ఆర్.ను నిర్మించటం ద్వారా గతంలో తమ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపిందని తెలిపారు. వచ్చే నాలుగేండ్లలో రీజనల్ రింగ్ రోడ్డను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ ఎస్ హయాంలో డబ్బులు, కమిషన్లు వచ్చే కాళేశ్వరంపై దృష్టి పెట్టారు తప్పితే ప్రజలకు అవసరమైన రహదారుల నిర్మాణంపై దృష్టి సారించలేదని ఆ పార్టీ సభ్యుడు హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఇచ్చిన సమాధానంపై బీఆర్ ఎస్ సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ... హైదరాబాద్ నుంచి బీజాపూర్ వరకూ ఉన్న రహదారికి బీఆర్ ఎస్ హయాంలోనే భూ సేకరణ చేశామని గుర్తు చేశారు. ఇందుకు రూ.1,300 క్లో వెచ్చించామని తెలిపారు. మంత్రి తనపై చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ దశలో జోక్యం చేసుకున్న సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు... సభా సంప్రదాయాలను అందరూ పాటించాల్సిందేనని సూచించారు. అనుచిత వ్యాఖ్యలు ఎవరు చేసినా వాటిని రికార్డుల నుంచి తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సమయంలో బీఆర్ ఎస్ సభ్యుడు హరీశ్‌రావు... డ్రంకన్ డ్రైవ్ గురించి చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు, కాంగ్రెస్ సభ్యుడు బీర్ల ఐలయ్య మధ్య వాగ్యుద్ధం నడిచింది. అనంతరం వారిద్దరి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభాపతి సూచనతో శాలరీలు, పెన్షన్లు, భూ భారతికి సంబంధించిన బిల్లులను మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రతిపాదించారు.

## విశిష్ట సేవలకు గుర్తింపుగా రైల్వే మంత్రి అవార్డు పొందిన ఇద్దరు దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది



దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఇద్దరు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్.పి.ఎఫ్) సిబ్బందికి వారి ప్రతిభావంతమైన సేవ మరియు విధి పట్ల అసాధారణమైన అంకితభావానికి గుర్తింపుగా రైల్వేమంత్రి అవార్డు లభించింది. సికింద్రాబాద్‌లోని ఆర్.పి.ఎఫ్ పోస్ట్ లో సబ్-ఇన్‌స్పెక్టర్ గా విధులను నిర్వర్తిస్తున్న శ్రీ టి. నాగార్జున రెడ్డికి , 'రైల్వే మంత్రి మహిళా మరియు బాల్ సురక్షా పదక్' మరియు హైదరాబాద్‌లో ఆర్.పి.ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ గా విధులను నిర్వర్తిస్తున్న శ్రీ దూదేకుల హుసేనయ్యకు 'జీవన్ రక్షా పధక్' లభించాయి.

శ్రీ టి . నాగార్జున రెడ్డి, ఆర్.పి.ఎఫ్ సబ్-ఇన్‌స్పెక్టర్:

సికింద్రాబాద్‌లోని ఆర్‌పిఎఫ్ పోస్ట్ సబ్-ఇన్‌స్పెక్టర్ మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌కి ఇన్‌ఛార్జ్ అయిన శ్రీ టి.నాగార్జున రెడ్డి మానవ అక్రమ రవాణా ముప్పును ఎదుర్కోవడంలో అసాధారణమైన అంకితభావాన్ని ప్రదర్శించారు. అతని నాయకత్వంలో, 67మంది పిల్లలను వెట్టిచాకిరీ మరియు లైంగిక వేధింపుల కోసం బంధించబడిన మానవ అక్రమ రవాణా దారుల నుండి రక్షించబడ్డారు. అదనంగా, అతని బృందం 'ఆపరేషన్ నాన్హే ఫరిష్తే' ద్వారా సంరక్షణ మరియు రక్షణ అవసరమైన 187 మంది మైనర్ పిల్లలను రక్షించింది, సామాజిక బాధ్యత మరియు దుర్బల జీవితాల రక్షణ పట్ల అతని అచంచలమైన నిబద్ధతను ఉదాహరణగా చూపింది. అదనంగా, సామాజిక బాధ్యత మరియు దుర్బల జీవితాల రక్షణ పట్ల అతని అచంచలమైన నిబద్ధతకు నిదర్శనంగా ఆయన బృందంచే 'ఆపరేషన్ నాన్హే ఫరిష్తే' ద్వారా సంరక్షణ మరియు రక్షణ అవసరమైన 187 మంది మైనర్ పిల్లలు రక్షించబడినారు. ఆయన సేవలకు గుర్తింపుగా 'మహిళా మరియు బాల్ సురక్షా పదక్' అవార్డును అందుకున్నారు.

శ్రీ దూదేకుల హుసేనయ్య, ఆర్.పి.ఎఫ్ హెడ్ కానిస్టేబుల్:

ఉమ్దానగర్ రైల్వే స్టేషన్‌లో శ్రీ దూదేకుల హుసేనయ్య, ఆర్.పి.ఎఫ్ హెడ్ కానిస్టేబుల్, హైదరాబాద్, డ్యూటీలో ఉండగా లోకో పైలట్ పదే పదే హెచ్చరించినప్పటికీ రైలు సమీపిస్తున్నట్లు తెలియక, రైలు పట్టాలు దాటుతున్నవ్యక్తిని గమనించి ముంచుకొస్తున్న ప్రమాదాన్ని గుర్తించి సమయస్ఫూర్తితో వ్యక్తి వద్దకు పరుగెత్తి అతన్ని సురక్షితంగా ప్రక్కకు లాగి ప్రాణాలను కాపాడారు. తన వ్యక్తిగత ప్రమాదాన్ని లెక్కచేయకుండా ప్రదర్శించిన అతని సాహసోపేతమైన చర్య విజయవంతంగా ఒక ప్రాణాన్ని కాపాడింది. ఆయన సేవలకు గుర్తింపుగా'జీవన్ రక్షా పదక్' అవార్డును అందుకున్నారు.

## అంబేడ్కర్ ను అవమానించిన అమిత్ షా మనువాద వ్యాఖ్యలను ఖండించండి

### అమిత్ షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి

### 19న అమిత్ షా దిష్టిబొమ్మల దగ్ధం ,కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు

కేంద్ర హెూం శాఖా మంత్రి అమిత్ షా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా అవమానించారని, ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడటాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాధులు ఖండించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్)తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొన్నది ఈ మేరకు కేవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్ వెస్లీ టి స్కైలాబ్ బాబు లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. .వారు మాట్లాడుతూ అమిత్ షా అంబేద్కర్ పట్ల ఆర్ ఎస్ ఎస్ బీజేపీ కి ఉన్న అవగాహణనను వ్యక్తం చేశారని అట్టడుగు వర్గాల పట్ల వారి వైఖరిని చెప్పారని అన్నారు దుర్మార్గమైన దారుణమైన అహంకార చర్యను అందరూ ఖండించాలన్నారు .ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసన తెలపడం హర్షణీయమన్నారు.ఈ మతోన్మాద చర్యను కెవిపియస్ ఖండిస్తుందన్నారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్నిసార్లు అంబేద్కర్ అని పదే పదే అతడిని స్మరించుకుంటారు దానికి బదులుగా ఏదో ఒక హిందూ దేవుడిని స్మరించుకుంటే మీకు 7 జన్మలకు స్వర్గం దక్కుతుందనడం సిగ్గు చేటన్నారు. అలా అనటమే కాకుండా మాటి మాటికీ అంబేద్కర్ పేరు ఎత్తడం వీళ్లకు పెద్ద ఫ్యాషన్ అయిపోయిందని ఏగతాళిగా మాట్లాడటం తగదన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు జపం చేసి అధికారం లోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పటం సిగ్గు చేటన్నారు . నేటి మనువాద మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగం పై, ప్రభుత్వరంగ సంస్థలపై దాడి జరుగుతుందన్నారు . ఈ దాడులను వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవలిసిన అవసరం ఉందన్నారు.డిసెంబర్ 19న రాష్ట్ర వ్యాప్తంగా అమిత్ షా దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని కేవీపీఎస్ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు.

# కృష్ణస్వామి సేవలు అజరామరం

కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్. ఈ పేరు చాలామంది విని ఉండకపోవచ్చు. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయనకు సంబంధించి ఒక రంగం గురించి చెప్పి, మిగిలిన వాటిని చులకన చేస్తే అది ఆత్మ ఆత్మ ద్రోహము అవుతుంది. ఆయన స్పృశించని అంశం లేదు. కాలూనని రంగం లేదు. ఏ అంశంలో లోతుగా అధ్య యనం చేసినా, అది పి. హెచ్. డి. సంపాదించి పెడుతుంది. రాజకీయ నాయకునిగా, హైదరాబాద్ మేయర్ గా, సిటీ మాస్టర్ ప్లానర్ గా, బి.సి. సంఘాల స్థాపకునిగా, జర్నలిస్టుగా, సంపాదకునిగా, ముదిరాజ్ కుల బాంధవునిగా, పాఠశాలల స్థాపకునిగా, హిందీ భాష ప్రోత్సాహకునిగా, యాదగిరి దేవస్థాన ధర్మకర్తగా, నిజాం రాష్ట్ర విద్యా సహాదారు బోర్డు సభ్యునిగా, ఇలా ఒక్కటేమిటి అడుగిడిన ప్రతి చోటా తనదయిన ముద్ర వేసి, ఆయన అందించిన బహుముఖ సేవలు చిరస్మరణీయమైనవి. ఆయనే కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ (ఆగష్టు 25, 1893 – డిసెంబర్ 19, 1967).స్వాతంత్ర్య సమర యోధుడిగా, రచయితగా, విద్యావేత్తగా, ప్రభుత్వోద్యోగిగా హైదారాబాద్ మేయర్‌గా, ఆంధ్ర మహాసభ నిర్వాహకులుగా, ముదిరాజ్ మహాసభ నిర్మాతగా, బహుజన వైతాళికులుగా, పరిపాలనా దక్షులుగా ప్రజల మన్నన లందు కున్న బహుముఖ ప్రజ్ఞాశాలి కృష్ణస్వామి. తెలంగాణ ఖ్యాతిని ముఖ్యంగా హైదరాబాద్ ఉన్నతిని, ప్రాము ఖ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన కృష్ణస్వామి ముదిరాజ్ హైదరాబాద్‌లో సామాజిక, రాజకీయ ఉద్యమాలకు ఒకనాడు కేంద్ర బిందువుగా ఉన్నారు. దేశ 'స్వాతంత్ర్యోద్యమ చరిత్ర' రాసే ప్యానెల్‌లో కృష్ణస్వామి కూడా సభ్యుడిగా ఉన్నారు. 25 ఏళ్ళకు పైగా కౌన్సిలర్‌గా, మేయర్‌గా హైదరాబాద్ రాజకీయాలలో రాణించారు. 1955లో డిప్యుటి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈ హెూదాలో అనేక కమిటీకు సహాదారుగా పని చేశారు. 1957లో మేయర్‌గా ఎన్నికై, స్వాతంత్ర్యానంతర హైద్రాబాద్‌కు మొదటి మేయర్ గా పని చేశారు. 1957లో హైదరాబాద్ నాలుగో మేయర్‌గా ఎన్నికైన తర్వాత రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నగరాభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేసిన దీర్ఘ దృష్టి ఆయనది.1950లో కొత్తగా హై దరాబాద్ మున్సిపల్ చట్టాన్ని రూపొందించడంలో కృష్ణస్వామి కీలక పాత్ర పోషించారు. 1957లో ఉస్మానియా యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా కూడా ఆయన పనిచేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొంది, స్వయంగా 'చంద్రకాంత ప్రెస్'ను నెలకొల్పి, 'దక్కన్ స్టార్' అనే ఆంగ్ల వార పత్రికను స్థాపిం చడమే గాకుండా సమర్థ స్వీయ సంపాదకత్వంలలో నడిపించారు. కొద్ది కాంలోనే దక్షిణ భారత ప్రెస్ లల్లో ప్రముఖ ప్రెస్‌గా పేరు సంపా దించింది. అయన 'సంపాద కత్వంలో వెలువడిన 'దక్కన్ స్టార్', ఆర్య సమాజ్ పత్రిక 'మసావత్', 'న్యూ ఎరా' పత్రికు కూడా చంద్ర కాంత ప్రెస్‌లోనే ముద్రించే బాధ్యత తీసుకున్నారు. 1939లో 'మసా వత్' అనే ఉర్దూ వార పత్రికకు కూడా సంపాదకులుగా ఉన్నారు. హైద్రాబాద్‌లో మత సామరస్యం కాపాడడానికి ఆయన చేసిన కృషి కి, నాటి ముస్లిం నేతలు కృష్ణ స్వామిని 'ఎంబడిమెంట్ ఆఫ్ సెక్యురిజం' అని కొనియాడే వారు. కె.కృష్ణస్వామి, ఆర్.కేశమ్ సంయుక్త కృషితో 30.9.1922న 'ముదిరాజ్ (ముక్తరాజ) మహా సంఘము, దక్షిణ హైద్రాబాద్' అనే పేరుతో ముదిరాజ్ సంఘం స్థాపించ బడగా, 1941లో తుల్జా భవన్‌లో జరిగిన ముదిరాజ్ మహా సమ్మేళనంలో కె.కృష్ణస్వామి ముది రాజ్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకో బడ్డారు. అప్పటి నుండి 1961 వరకు నిర్విరామంగా ఈ సంఘానికి అధ్యక్షులుగా పని చేశారు. 1954లో కృష్ణస్వామి అఖిల భారత ముది రాజ్ మహాసభకు అధ్యక్షునిగా ఎన్నుకో బడ్డారు. దీని తర్వాతనే ముదిరాజ్ సంఘం 'ముదిరాజ్ మహాసభ'గా మార్చ బడినట్లు చెపుతారు. సంపాదనపై ఆశలేక ప్రజాసేవే పరమార్థంగా, ఉన్న ఇల్లును కూడా అమ్ముకొని, ప్రజాజీవితంలో మచ్చ లేని జీవితం గడిపారు. హైద్రాబాద్ నగర నిర్మాణ చరిత్ర, గోవా రాష్ట్ర స్వాతంత్ర్య ఉద్యమం, ముది రాజు జాతి చరిత్ర, హైద్రాబాద్ రాష్ట్ర 30 సంవత్సరా రాజకీయ పోరాటం, హైద్రాబాద్ మున్సిపల్ పరిపాన వ్యవస్థ చరిత్ర (1280 ఫసలి / క్రీ.శ. 1871 నుండి), నవాబ్ దీన్ దయాల్ జంగ్ బహదూర్ జీవిత చరిత్ర, పిక్టోరి యల్ హైద్రాబాద్ (హైద్రాబాద్ రాజవంశ, నవాబు, జాగిర్దారు చరిత్ర) తదితరాలను వివిధ భాషల్లో రాశారు. ఆయన రాసిన చరిత్ర గ్రంథాల్లో ఒక్కొక్కటి ఒక్కో పిహెచ్.డి.పట్టా పొందే అర్హత కలిగి ఉన్నాయి. ఆయన పట్టా లేని పరిశోధకునిగా మిగిలి పోయారు.

# భారతీయ గ్రంథాలు కీర్తిసంకేతాలు

'అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనాతరంగాలు ఇతరులు స్పష్టంగా చదువగలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథరూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వ హించే ఆచారం కొనసాగుతున్నది. గ్రంథం పొరపాటున కాలికితగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంధానికి వయసు అనేది లేదు. అపౌరుషే యాలని భావించే వేదాలు మొదలుకుని, 2300ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి', పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్య శాస్త్రం', హాలుని 'గాధా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. గ్రంథానికి మృతి లేదు. అక్షర రూపం దిద్దుకున్న ఆలోచన, రాసిన వసువును బట్టి ఎంతకాలం మన గలుగుతుందో నిర్ణయ మవుతుంది. తాళపత్ర, బూర్జపత్ర, తామ్రపత్ర, చర్మపత్ర రూపాలలో ఉన్నవి శిథిలా లైతే, తిరిగి ప్రతి లేఖనాలవుతాయి. మనిషి అజ్ఞానంతోనో , తెలియకో, విలువ స్వార్థపరుడై విధ్వంసం చేస్తే తప్ప, తామ్ర, శిలా రూపాలకు చావే లేదు కదా. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన ఆరిస్టాటిల్, మన దేశ తత్వ సాహిత్యన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులైనాయి, చైనా, టిబెట్, ఆఫ్ఘనిస్టాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శ్రౌతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరి ణామ క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం, గ్రంథ రూపం సంతరించుకున్నాక, ప్రపం చంలో ఏ జాతీ, ఏ దేశం, భారత దేశానికి సాటి రావని, సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృ తిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాల యాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహుకష్టంతో కూడుకునేది. గురువుకు ప్రాధాన్యత ఉండడం వల్లే గురు: బ్రహ్మ, గురుర్విష్ణు అన్న సూక్తి పుట్టుకొచ్చింది. దానిని ప్రసుతం గ్రంథానికి వర్తింప చేయవచ్చు. గ్రంథాలయం అందుబాటు వల్ల దూరవిద్యా విధానం కూడా అమలు లోనికి వచ్చింది. ముద్రణా యంత్రాల ఆధునీకరణ జరిగింది. మరీ ముఖ్యంగా డిజిటలైజేషన్ వల్ల ముద్రణ నాణ్యమైన, అందమైన ముద్రణలతో పాటుగా నేడు "ఈ గ్రంథాలు" ఉపయోగ పడుతున్నాయి.

అయినా ముద్రిత గ్రంథ ఉపయోగం ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మి కాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథం లోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు.

ముద్రణ వల్ల గ్రంథానికి విలువ ఏర్పడింది కనుక, డిమాండును బట్టి, వ్యాపారాత్మకత కారణంగా అధిక ధరల ప్రపంచం ఏర్పడుతున్నది.తొలి హైదరాబాద్ బుక్ ఫెయిర్ 1985లో హైదరాబాద్ లోని అశోక్ నగర్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. అనంతరం నిజాం కాలేజీ గ్రౌండ్స్, పబ్లిక్ గార్డెన్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కేశవ్ మెమోరియల్ హైస్కూల్ గ్రౌండ్స్ తదితర ప్రాంతాల్లో బుక్ ఫెయిర్లు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ కళా భారతి (ఎన్టీఆర్ గ్రౌండ్స్)లో పుస్తక ప్రదర్శన నిరంతరం కొనసాగుతోంది.

ప్రతి ఏటా హైదరాబాద్? వాసులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే హైదరాబాద్ బుక్?ఫెయిర్ ఈ నెల 19 నుంచి అట్టహసంగా ప్రారంభం కానుంది. ఇందిరాపార్క్? సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 29 వరకు 37వ జాతీయ పుస్తక ప్రదర్శన జరగుతున్నది. పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలు, రచయితలకూ, వారు అక్కడే ఉండి పుస్తకాలు అమ్ముకునే సదుపాయం గల ప్రత్యేక స్టాల్, రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు.

ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8:30 గంటల వరకు, శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు బుక్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. బహుభాషలు, రచయితలు, గ్రంథాలు, ముద్రాపకులు, ఒక్కచోట చేరితే అదొక విజ్ఞాన విశ్వమే కదా. అందుకే చాలామందికి ప్రీతిపాత్రం గ్రంథాల జాతరా.

దేవున్ని జారతలో కొలిచినట్లే, గ్రంథాలను పరమ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయులది. కొనే వారు, చదివే వారు, సంరంభాన్ని కన్నుల పండువగా తిలకించే వారు, కౌటుంబిక, స్నేహ, ప్రేమికుల, విద్యార్థుల, రచయితల, కవుల, సాహితీ కారుల బృందాలు ఒక్క చోట కలిసి పండుగ చేసుకునే భాగ్యనగర పుస్తక మేళాకు వెళ్ళిన వారికి మరచిపోలేని అనుభూ తులను మిగులు స్తుంది అనేది నూటికి నూరుపాళ్ళ నిజం.

# నాటక కళోద్ధారకుడు గోవిందరావు

తెలుగు నాటకరంగ ఘనత ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పే దిశగా అనేకమంది నటులు నాటకాలను ప్రదర్శించారు, నాటక సంస్థలను పోషించారు. అయితే పలు నాటక సంస్థలను స్థాపించి, కుటుంబాల సహితంగా ప్రదర్శనలు ఇచ్చి, నటులను ప్రోత్సహించి, ఇప్పటికీ నాటకాలకు ఆదరణ కొనసాగడానికి కారణభూతులై, నాటకాలే జీవిత పరమార్థంగా భావించి, అందుకు కృషిసల్పిన వనారస గోవిందరావుకు అకుంఠిత దీక్ష, అంకిత భావం కారణం. మనోవినోదిని, సురభి, ఆంధ్ర నాటక పరిషత్తు సంస్థలను స్థాపించి, ఆంధ్ర నాటక కళోద్దారక బిరుదు నొంది, నాటక రంగ పితామహునిగా చరిత్రలో చిర స్థాయిగా నిలిచి పోయారు గోవింద రావు. గోవిందరావు 1867లో గంపరామన్న, పకీరమ్మ దంపతులకు జన్మించారు. అయన పెంపుడు తలిదండ్రులు సుంకమ్మ, వెంకోజీరావులు. గోవిందరావు అసలు పేరు పకీరప్ప. పెంపుడు తలిదండ్రులు పెట్టిన పేరు గోవిందప్ప. అదే గోవిందరావుగా మారింది. వెంకప్ప, గోవిందప్పకు, సంగీత, గాత్ర, పాట ఫిడేలు వాయించుట నేర్పుతు, చెన్నపురి, బొంబాయి, హైదరాబాదు మొదలగు పట్టణములకు తీసుకొనిపోయి నాటకములను చూపించే వాడు. చెన్న పురిలో అరవ నాటకములు, సారంగధర, వస్త్రాప హరణం, భువనేంద్ర సభ చూశారు. ఒక రోజున ఎవరికి చెప్పక నంద్యాల పారిపోయి, తాను తల్లిదండ్రులు లేని వాడననియు బీడవాడనియు జెప్పి అక్కడ జ్యోతి సుబ్బయ్యగారి నాటక సంఘములో పనిచేయుటకు చేరాడు. వారి దగ్గిర పాటలు తదితరాలు చాటుగా నేర్చుకొని, హరిశ్చంద్రలో విశ్వామిత్రుని పాత్ర నేర్చుకొని వేశాడు. సురభి గ్రామంలో కీచక వధ ప్రదర్శిస్తే, అందులో గోవిందరావు నకులుడి పాత్ర ధరించారు. 1895 లో సురభి గ్రామంలో రామి రెడ్డి చెన్నా రెడ్డి యింట్లో వివాహములు సంధర్భంగా, వీధి నాటకం ఆడేందుకు, తన వారికి నేర్పించి తాను సేకరించిన పాటలు నేర్పి తెచ్చిన పరికరముల నుపయోగించి, చెన్నా రెడ్డి ఇంట్లోని చీరలు, దుస్తులు నగల సహా యముతో కీచక వధ ప్రదర్శించారు. తరువాత 'శ్రీ శారదా మనో వినోదినీ సభ' అనే నాటక సమాజాన్ని స్థాపించి, స్టేజి నాటకాలు వేయడం ప్రారంభించారు. ఆ సభే సురభి కంపెనీలకు మాతృసంస్థ.

ఈ సమాజ వ్యవస్థా పకుడు వనారస గోవిందరావు. కాగా వనారస సోదరులు వనారస గోవిందరావు, వనారస చిన్నరామయ్య కలిసి కడప జిల్లా చక్రాయపేట మండలములోని సురభిరెడ్డివారి పల్లెలో శ్రీ శారదా వినోదిని నాటక సభను ప్రారంభించారు. సురభిలో ప్రారంభమైన ఈ నాటక సభ కాలక్రమేణా సురభి నాటక సంఘంగా ప్రసిద్ధి చెందినది. రంగస్థలముపై స్త్రీ పాత్రలను స్త్రీలచే ధరింపచేసిన తొలి నాటక బృందం ఏదంటే అది కేవలం సురభి నాటక సమాజమే. స్త్రీలు నాటకాలలో నటించ కూడదని అంటున్న కాలంలో తన భార్యా బిడ్డలను నాటకాలలో నటింపజేసి, సురభి నాటక సమాజాన్ని నాట్యశాస్త్ర విహిత సమాజంగా తీర్చిదిద్దారు. నాటకంలోని పాత్రధారులందరూ ఒకే కుటుంబములోని సభ్యులవడం చేత స్త్రీలకు చెడ్డపేరు వస్తుందనే భయము ఉండేది కాదు. నాటక కళనే వృత్తిగా పెట్టుకొని జీవింప వాంఛగల ఇతర కుటుంబముల, తమలో చేర్చుకొన్నారు. బృందములోని సభ్యులకు రంగస్థలమే జీవితముగా సాగేది. ఊరూరూ తిరుగుతూ...పల్లె పల్లెనా నాటకాలతో జనాలను రంజింప జేసేవారు.విశ్వామిత్రుడు, నకులుడు, ఆంజనేయుడు, దొంగ, అర్జునుడు (సుభద్ర), రాజరాజ నరేంద్రుడు, హరిశ్చంద్రుడు, అనిరుద్ధుడు, రావణుడు, శ్రీరాముడు (సంపూర్ణ రామాయణం), విక్రమార్కుడు, బిల్వ మంగళుడు, జగన్మోహనుడు, హిరణ్యకశిపుడు, రుక్మాంగదుడు తదితర విభిన్న పాత్రలు పోషించారు. ఇలా 6సంపత్సరములు ఆంధ్ర దేశము, నైజాం, బర్మా తదితర ప్రాంతాల్లో సంచార మొసర్చి, కుటుంబములు ఎక్కువ అయినందున, సదరు కుటుంబాల అన్నదమ్ములు వేరు వేరు సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. 1908 వ సంవత్సరమునుండి 16 సంవత్సరములు గోవింద రావు ఇతరుల సహాయము లేక తన భార్య పిల్లలతోకనే స్వయముగా సంఘమును అభివృద్ధికి తెచ్చారు. తరువాత కంపెనీని సంచాల నాటక రంగంగా రూపొందించి, సంచారానికి పనికివచ్చే రేకులు, విద్యుత్ దీపాలు, వైర్ వర్క్ సామాగ్రి సంపాదించి పెద్దఎత్తున్న వివిధ ప్రాంతాలలో నాటక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.రంగూన్‌లో కూడా ప్రదర్శనలు ఇచ్చారు. 1917లో భీమవరంలో అంకాదహనం నాటకంలో ఆంజనేయ పాత్రలో నటిస్తుండగా గోవిందరావు ధరించిన దుస్తులకు నిప్పంటుకొని శరీరం కాలింది. నాటకాలలో నటించడానికి పనికిరాని పరిస్థితి ఏర్పడింది. అయినా కానీ నాటక సమాజాన్ని అయన వదిలి పెట్టలేదు. కాంతామణి నాటకంలో దొంగవేషం వేసి అద్భుతంగా నటించేవారు. అందుకే నాటక ప్రదర్శన కరపత్రాలలో 'కంపెనీ ప్రొప్రైయిటర్ చే దొంగవేషం ధరింపబడును' అని అచ్చు వేసేవారంటే అయన నటన ఎంత గొప్ప పేరు పొందిందో అర్థం అవుతుంది. 1929నాటికే ఆంధ్రదేశంలో నాటక కళ క్షీణదశ ప్రారంభమైందని గ్రహించి దానిని సరైన మార్గంలో పెట్టడానికి పెద్దలతో కలిసి ఆంధ్ర నాటక కళా పరిషత్తు స్థాపించారు. ఆ సమయంలోనే ఆ పరిషత్తు ఆయనకు 'ఆంధ్రనాటక కళోద్ధారక' బిరుదుతో సన్మానించింది. సురభి' నాటక కంపెనీ పితామహుడుగా అప్పటికే పేరొందిన వనారస గోవిందరావు ఆరు నెలల పాటు కష్టపడి, రాష్ట్రంలోని ప్రముఖులను కూడగట్టి, ఎంతోవ్యయానికి ఓర్చి, 'ఆంధ్ర నాటక కళా పరిషత్' ఆవిర్భావానికి దోహదపడ్డారు. సంస్థ ఆవిర్భావ సభలు 1929 జూన్ 19, 20, 21 తేదీల్లో తెనాలిలో వైభవంగా నిర్వహించారు. జీవితచరమాంకంలో ఏలూరు దగ్గర పొలసనపల్లిలో స్థిరనివాసం ఏర్పరుచుకొని దానధర్మాలు చేశారు. ఆయన శిలా విగ్రహాన్ని కళాకారులు ఏలారులో ప్రతిష్ఠించారు. జీవితాన్ని నాటకరంగానికి, నాటకోద్ధరణ కోసం ధారపోసిన వనారస 1953, డిసెంబర్ 19న మరణించారు.

## ఏపీలో రేషన్ వార్...

విజయవాడ, డిసెంబర్ 18, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం మెడకు రేషన్ బియ్యం వివాదం చుట్టుకుంది. మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో నాని సతీమణి పేరుతో ఉన్న గోడౌన్‌లో బియ్యం మిస్సింగ్ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. పేర్ని నాని కుటుంబానికి చెందిన గోడౌన్‌లో 187 టన్నుల రేషన్ బియ్యం మాయమయ్యాయి. అయితే, తమ గౌడౌన్‌లో మాయమైన బియ్యం ధర ఎంతో చెప్తామని కృష్ణాజిల్లా జేసీకి లేఖ రాయడం సంచలనంగా మారింది.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో గత నెల 28, 29 30 తేదీల్లో పౌర సరఫరాల శాఖ అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు చేపట్టగా 187 టన్నుల తేడా ఉన్నట్లుగా గుర్తించారు. కోటి డెబ్బై లక్షల రూపాయలు చెల్లించాలంటూ నోటీసులు పంపారు . దీంతో మాజీ మంత్రి పేర్ని నాని కోటి రూపాయల డీడీలు తీయించి ఈ నెల 14న జేసీ కార్యాలయంలో అందజేశారు. మరో 70 లక్షల రూపాయలను సోమవారం చెల్లించారు. మొత్తంగా రెండు విడతల్లో కలిపి రూ.1.7 కోట్ల డీడీలను అధికారులకు అందజేశారు.ఈ వ్యవహారంలో గోడౌన్ ఓనర్ గా ఉన్న జయసుధ పై క్రిమినల్ కేసు నమోదు చేశారు పోలీసులు దీంతో పేర్ని సతీమణి జయసుధ, తనయుడు కృష్ణమూర్తి అజ్ఞాతంలోకి వెళ్లారు. మచిలీపట్నం జిల్లా కోర్టులో జయసుధ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణను ధర్మాసనం తిరిగి 19కు వాయిదా వేసింది.రెండు రోజులు తర్వాత పేర్నినాని అజ్ఞాతం వీడారు. తన ఇంటికి చేరుకోవడంతో వైసీపీ నేతలు ఆయనను పరామర్శించారు . బియ్యం లెక్కల్లో తేడాలు ఎందుకు వచ్చాయో తనకు తెలియదన్నారు పేర్ని నాని.. తాము తప్పు చేయలేదు కాబట్టే బియ్యం మాయంపై లేఖరాశామని పేర్నినాని చెప్పారు.మరోవైపు పేర్ని జయసుధ పేరుతో రేషన్ నిల్వలు ఉన్న గోడౌన్ ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని మార్కెటింగ్ గోడౌన్లకు తరలించారు. తర్వాత లెక్కలు చూసి తేడాలుంటే కేసులు పెడతామన్నారు అధికారులు.పేర్నినాని కేసులో కక్ష సాధింపులేమీ లేదన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్.. 4వేలకు పైగా బ్యాగులు మిస్ అయినట్టు గుర్తించామన్నారు.

## అనైతిక కార్యక్రమాలకు అడ్డాగా మూసీ రివర్ బెడ్ కూల్చివేత శిధిలాలు

### స్లాబ్ లు కూల్చి, గోడలు అసంపూర్తిగా వదిలిన అధికారులు

### రాత్రిపూట గాంజా, మద్యం వంటి ఇల్లీగల్ కార్యక్రమాలకు ఆవాసాలు

హైదరాబాద్ చాదర్ ఘాట్ మూసా నగర్, శంకర్ నగర్ మూసీ రివర్ బెడ్ లో కూల్చి వేసిన ఇండ్ల శిధిలాలు అనైతిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని,రాత్రిపూట గాంజా, మద్యం వంటి ఇల్లీగల్ కార్యక్రమాలకు వీటిని ఆవాసాలుగా చేసుకున్నరని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రుళ్ళు ఈ ప్రాంతాల్లో మద్యం,గాంజా సేవించి కొందరు పోకిరీలు స్థానికులను బయకంపితులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఈ ప్రాంతంలో మూసీ రివర్ బెడ్ ఇండ్ల కూల్చివేత ప్రక్రియను పూర్తి చేయకుండా కేవలం స్లాబ్ వరకు కూల్చి, అసంపూర్తిగా గోడలు వదిలేయడమే ఇందుకు కారణం గా మారాయని, ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి గోడలతో సహా పూర్తిగా నేలమట్టం చేసి శిథిలాలను తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.కూల్చివేత ప్రక్రియ జరిగినప్పటినుంచి స్థానికంగా మున్సిపల్ అధికారులు,శానిటేషన్ సిబ్బంది ఇటు వైపు చూసిన పాపానపోలేదని ఆరోపిస్తున్నారు. శిథిలాల వద్ద డ్రైనేజీ, చెత్త చదారం పోగయ్యి మురికి కూపాలుగా మారి మరింత దుర్గంధం వెదజల్లుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.దీనంతటికీ కారణమవుతున్న అసంపూర్తి కూల్చివేతలు పూర్తి చేసి ఈ దుర్గంధం, దుర్మార్గాల నుంచి విముక్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# జనవరి నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు

విజయవాడ, డిసెంబర్ 18,మూలిగే నక్క మీద తాటికాయలా అసలే అంతంత మాత్రంగా ఉంటోన్న ఏపీ రియల్ ఎస్టేట్ లావాదేవీలపై మరో భారం పడనుంది. 1నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. వైసీపీ హయంలో 2022లో రిజిస్ట్రేషన్ విలువలను భారీగా పెంచేశారు. మార్కెట్ విలువకు, బహిరంగ మార్కెట్ ధరలకు పెద్దగా వ్యత్యాసం లేనంతగా ఈ ధరలు చేరుకున్నాయి.దీంతో గత రెండున్నరేళ్లుగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు తగ్గిపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయాన్ని ఆర్జించే శాఖల విషయంలో గత ప్రభుత్వ బాటలోనే సాగుతోంది. రిజిస్ట్రేషన్ విలువల సవరణ కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లా శాఖల నుంచి ప్రతిపాదనలు సేకరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ విలువ పెంచాలని శాఖాపరమైన సమావేశాల్లో ప్రకటించారు. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాజా నిర్ణయంతో ఈ ఏడాది డిసెంబర్‌లోగా రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో జనవరి 1వ తేదీ నుంచి ఏపీలో కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమ ల్లోకి రాబోతున్నాయి.ఈ దఫా పట్టణాలు, గ్రామాల్లో ఒకేసారి కొత్త విలువలు అమల్లోకి తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా ప్రాంతాల అభివృద్ధి, ఇతర అంశాల ప్రాతిపదికగా ప్రస్తుతం ఉన్న దానిపై 10% నుంచి 15% వరకు విలువలు పెరిగే అవకాశం ఉంది.సాధారణంగా ప్రభుత్వ లెక్కల్లో ఉండే భూమి విలువకు బహిరంగ మార్కెట్‌లో ఉండే విలువకు వ్యత్యాసం ఉంటుంది. ఈ విధానంలో భూమి కొనుగోలు చేసే వారికి తక్కువ ధరకు నివాస భూమి లభించడంతో పాటు అమ్మే వారికి లాభసాటిగా ఉండేది. ఈ విధానంలో ఆదాయాన్ని కోల్పోతున్నామని గుర్తించిన ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువలను పెంచుకుంటూ పోతోంది. రాష్ట్ర విభజన తర్వాత 2014 నుంచి బహిరంగ మార్కెట్ విలువలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ విలువను ప్రభుత్వాలు పెంచుకుంటూ వచ్చాయి. దీని వల్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య మాటెలా ఉన్నా ప్రభుత్వానికి మాత్రం భారీగా ఆదాయం సమకూరింది.అపార్ట్‌మెంట్‌లకైతే భూమి విలువతో పాటు చదరపు అడుగుల్లో నిర్మాణ విలువను కూడా లెక్కిస్తారు. ఈ విధానంలో ఫ్లాట్ల ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. అన్‌డివైడెడ్ షేర్‌లో కొనుగోలు దారుడికి లభించే వాటాతో పాటు నిర్మాణం జరిగిన భూమికి కూడా రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాలి. ఉదాహరణకు విజయవాడలో 2వేల చదరపు అడుగుల ఫ్లాట్‌కు ప్రభుత్వ లెక్కల్లో రూ.75లక్షల నుంచి కోటి రుపాయల ఖరీదు చేస్తే అందులో దాదాపు రూ.6 నుంచి రూ.10 లక్షల స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో సదరు ఫ్లాట్ విలువ కోటి నుంచి కోటిన్నర వరకు ఉండొచ్చు.మౌలిక సదుపాయాలు, అభివృద్ధితో సంబంధం లేకుండా ఎడాపెడా ధరలను ఖరారు చేసే విధానాలు రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. దీని వల్ల ఏపీలో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లు డీలా పడుతున్నాయి. జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో భూముల ధరల్ని ఖరారు చేసేలా మార్గదర్శకాలు జారీ చేశారు.విలువల సవరణ ప్రతిపాదనలకు జిల్లా కమిటీల ఆమోదం తెలిపిన తర్వాత ఈ నెల 20న సబ్-రిజి స్ట్రార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో కొత్త ధరల ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. ఈ నెల 24వ వరకు అభ్యంతరాలు/సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. అభ్యంతరాల పరిశీలన ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతుంది.2025 జనవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్లను ఆదేశిస్తూ రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఐజీ శేషగిరిబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకా లకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. తాజా నిర్ణయంతో ప్రస్తుత ధరలపై 10 నుంచి 15శాతం వరకు ధరలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

# స్టెల్లా షిప్ లో 1320 టన్నుల పీజీఎస్ బియ్యం

కాకినాడ, డిసెంబర్ 18, కాకినాడ పోర్టులోని స్టెల్లా నౌకలో 1320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు నిర్ధారించామని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. పోర్టులో ఇంకా 12 వేల టన్నుల బియ్యం లోడ్ చేయాల్సిన ఉందన్నారు. వీటిలో పీడీఎస్ బియ్యం లేవని నిర్ధారించాకే లోడింగ్‌కు అనుమతిస్తామన్నారు.కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కీలక ప్రకటన చేశారు. స్టెల్లా నౌకలో 1320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. గత 29న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టును పరిశీలించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అధికారులతో పీడీఎస్ బియ్యం ఉన్న స్టెల్లా నౌక పరిశీలించారు. ఈ వ్యవహారం సంచలనం అవ్వడంతో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో అధికారులు రంగంలోకి దిగారు.కాకినాడ పోర్టు రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. గత నెలలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్టెల్లా నౌకను పరిశీలించిన అనంతరం 5 విభాగాల అధికారులు బృందం ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందం 12 గంటల పాటు స్టెల్లా షిప్‌లోని 5 కంపార్ట్‌మెంట్లలో తనిఖీలు నిర్వహించింది. మొత్తం 12శాంపిల్స్ సేకరించారు. ఈ షిప్‌లో దాదాపు 4 వేల టన్నుల బియ్యం రవాణా అవుతున్నాయన్నారు. వీటిలో 1,320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్టు నిర్ధరించామన్నారు. సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ బియ్యం ఎగుమతి చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. వాళ్లు ఎక్కడి నుంచి బియ్యం తీసుకొచ్చారు, ఎక్కడ నిల్వ చేశారు అనే దానిపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందన్నారు.కాకినాడ పోర్టులోని స్టెల్లా నౌకలో 1,320 టన్నుల రేషన్ బియ్యాన్ని అన్‌లోడ్ చేయించి సీజ్ చేస్తామని కలెక్టర్ షాన్ మోహన్ ప్రకటించారు. పోర్టులో ఇంకా 12 వేల టన్నుల బియ్యం లోడ్ చేయాల్సిన ఉందన్నారు. వీటిలో పీడీఎస్ బియ్యం లేవని నిర్ధారించాకే లోడింగ్‌కు అనుమతిస్తామన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్ సీ వాటర్ పోర్టులో కూడా మరో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా నిఘా పెట్టామన్నారు. ఒక్క గ్రాము పీడీఎస్ బియ్యం కూడా దేశం దాటకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. స్టెల్లా షిప్‌ను ఎప్పుడు విడుదల చేయాలనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తీవ్రంగా పయత్నాలు చేస్తున్న జిల్లా యంత్రాంగం.. క్రమంగా అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగా తొలుత స్టెల్లా నౌకలోని బియ్యం పైనే దృష్టి సారించింది. ఇక్కడ అధికారుల తనిఖీలు, వెల్లడైన అంశాలపై.. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జేసీ రాహుల్ మీనా, ఎస్పీ ఎస్పీ విక్రంత్ పాటిల్ మీడియాకు వివరాలు అందజేశారు.ప్రజలకు చెందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లు ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక బృందం ఏర్పాటు చేయగా.. అనుమానాస్పద ప్రాంతాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం తనిఖీల సమయంలో స్టెల్లా నౌకలో 640 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. దాంతో.. పూర్తిగా నౌకను పరిశీలించి, తనిఖీలు నిర్వహించేందుకు ఐదు ప్రభుత్వ శాఖలకు చెందిన బృందాలు స్టెల్లా షిప్ లో 12 గంటల పాటు తనిఖీలు నిర్వహించాయి. అందులో.. 4,000 టన్నుల బియ్యాన్ని గుర్తించగా.. వాటి నుంచి శాంపిల్స్ సేకరించి ప్రభుత్వ ల్యాబ్ లకు పంపించారు. అందులో ముందుగా గుర్తించిన 640 టన్నుల రేషన్ బియ్యంతో పాటు అదనంగా మరో 680 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు.నిజాయితీగా రైస్ బిజినెస్ చేసే వారికి ప్రభుత్వం నుంచి మద్దతు ఉంటుందన్నారు. వ్యాపారులు, కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు.నవంబర్ 27న కాకినాడ పోర్టులో స్టెల్లా షిప్‌లో 640 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ పోర్టులోకి వెళ్లి పరిశీలించారు. ఆయన అధికారికంగానే 640 టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నవంబర్ 29న కాకినాడ వచ్చారు. ఆయనతో పాటు సివిల్ సప్లై మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కూడా తీసుకొచ్చారు. సౌత్ ఆఫ్రికాకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న స్టెల్లా ఎల్ పనమా షిప్‌ను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

# మళ్లీ పాత బాబు...

గుంటూరు, డిసెంబర్ 18, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను చెప్పినట్లే చేస్తున్నారు. 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారన్నారు. అదే ఇప్పుడు చేసి చూపిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలంటూ లేవు కానీ, నిరంతరం సమీక్షలు,కాన్ఫరెన్స్ లతో కాలక్షేపం చేస్తూ తాను అనుకున్న పనులను మాత్రమే ముందుకు తీసుకెళుతున్నారు. గతంలో మాదిరిగానే ముఖ్యమంత్రి కార్యాలయానిదే ఇప్పుడు మళ్లీ పైచేయి అయింది. గత వైసీపీ ప్రభుత్వంలో సీఎంవో వల్లనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక రకాలైన విమర్శలను ఎదుర్కొనాల్సి వచ్చింది. ఎవరినీ కలవకుండా సీఎంవో పిలిస్తేనే వెళ్లేందుకు అనుమతివ్వడం, నియోజకవర్గాల రాజకీయాల్లోనూ సీఎంవో జోక్యం చేసుకోవడంతోనే అక్కడ నేతల మధ్యవిభేదాలు ఎక్కువయ్యాయి. మళ్లీ ఇప్పుడు కూడా చంద్రబాబు అదే సీన్ ను రిపీట్ చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు పూర్తిగా టర్న్ అవుతారు. అధికారంలో లేనప్పుడు కార్యకర్తలే తన బలం అంటూ ప్రశంసిస్తారు. జగన్ కూడా అంతే. అధికారంలో ఉన్నప్పుడు కనపడని క్యాడర్ దానిని కోల్పోయిన వెంటనే గుర్తుకువస్తారు. చంద్రబాబు కూడా అలాగే ఆలోచిస్తుంటారు. సహజంగా ముఖ్యమంత్రి అయిన తర్వాత పాలనను గాడిలో పెట్టడానికి ఎక్కువ సమయం కేటాయించడంలో తప్పు లేదు. కానీ అదే సమయంలో పార్టీని, కార్యకర్తల భవిష్యత్ ను కూడా అంతే దృష్టిలో పెట్టుకుని చేయాలన్నది ఇద్దరూ మర్చిపోయే అంశం. అందుకే ఇప్పుడు తెలుగు తమ్ముళ్లలో కూడా ఒకింత అసహనం ఆరు నెలల్లోనే బయలుదేరిందంటున్నారు.నిజానికి చంద్రబాబు నాయుడు ప్రతి శనివారం పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళు తుండటం కొంత పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపుతున్నప్పటికీ వారికి అవసరమైన విషయాలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిజానికి పార్టీ పట్ల, పాలన పట్ల ప్రజలు ఏమనుకుంటున్నాన్నది వాస్తవాలు తెలియాలంటే కార్యకర్తలే ముఖ్యం. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటే ఏదైనా కరెక్ట్ విషయాలు తెలుస్తాయి. మద్యం కావచ్చు. ఉచిత ఇసుక విధానం కావచ్చు. సూపర్ సిక్స్ హామీల అమలు కావచ్చు. వాటిపై ప్రజలు ఏమనుకుంటున్నారో నిజంగా తెలియాలంటే కార్యకర్తల నుంచే తీసుకోవాలి. నేతలు అస్సలు నోరు విప్పరు. అధికారులు పెదవి విప్పరు. కానీ చంద్రబాబు మాత్రం ఇప్పుడు మళ్లీ మరోసారి ప్రజా స్పందనపై అధికారులపై ఆధారపడుతున్నట్లే కనిపిస్తుంది. ప్రధానంగా జిల్లా యంత్రాంగం నుంచి ఆయన ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో తప్పుడు సమాచారం అందే అవకాశం ఉందని నేతలే చెబుతున్నారు. ముఖ్యంగా కలెక్టర్ల పై ఆధారపడి ఆయన సమాచారాన్ని సేకరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న వాస్తవ విషయాలను మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో చంద్రబాబు నాయుడు తాను చెప్పినట్లు 1995లో సీఈవో మాదిరిగానే వ్యవహరిస్తున్నారని, మూడు దశాబ్దాలయినా అందులో ఎలాంటి మార్పు రావడం లేదని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చంద్రబాబు ఈ విషయం ఆలోచించుకుని గ్రౌండ్ లెవెల్ రియాలిటీని తెలుసుకునేందుకు వేరే మార్గాలను ఎంచుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

# డిసెంబర్ 23 నుంచి జనవరి 29 వరకు శబరి పోలమాంబ జాతర

విజయనగరం డిసెంబర్ 18, ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ జాతర తేదీలు ఖరారయ్యాయి. డిసెంబర్ 23 నుంచి జనవరి 29 వరకు జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో కొలువైన శంబర పోలమాంబ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరపనున్నారు.ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, ప్రజల ఆర్యాధ్య దేవత శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి జాతర తేదీలు రాష్ట్ర దేవదాయశాఖ అధికారులు ఖరారు చేశారు. డిసెంబర్ 23 నుంచి జనవరి 29 వరకు జాతర నిర్వహిస్తారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో కొలువైన శంబర పోలమాంబ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరపనున్నారు. పక్క రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఒరిస్సా నుంచి కూడా లక్షలాది మంది భక్తులు ఈ జాతర సమయంలో శంబర పోలమ్మవారిని దర్శించుకుంటారు. ప్రభుత్వం తరపున మంత్రి గుమ్మడి సంధ్యారాణి అమ్మవారికి అధికారిక పూజలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

కార్యక్రమాల నిర్వహణ ఇలా?

డిసెంబర్ 23న పెద్ద అమ్మవారి సనప చాటింపు

డిసెంబర్ 30న పెద్దమ్మవారిని గ్రామంలోకి తెచ్చేందుకు ముహూర్తం

జనవరి 6న పెద్దమ్మవారి తొలేళ్ల ఉత్సవం.

జనవరి 7న ప్రధాన ఉత్సవం.

జనవరి 8న అనుపోత్సవం, అదే రోజు శంబర పోలమాంబ అమ్మవారు (చిన్నమ్మ వారు) పండగ తెచ్చేందుకు చాటింపు.

జనవరి 13న పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తెస్తారు.

జనవరి 14న అమ్మవారు గ్రామానికి చేరుకుని,చదురుగుడిలో విశ్రాంతి తీసుకుంటారు.

జనవరి 14 నుంచి నుంచి 13 రోజుల పాటు పోలమాంబ అమ్మవారు గ్రామంలో తిరువీధి చేస్తూ, భక్తులకు దర్శనం ఇస్తారు.

జనవరి 27న తొలేళ్ల ఉత్సవం.

జనవరి 28న సిరిమానోత్సవం.

జనవరి 29న అనుపోత్సవం

756 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు

శంబర పోలమాంబ జాతరకు 756 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. అందులో ముగ్గురు డీఎస్పీలు, 14 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 42 మంది ఎస్ఐలు, మిగిలిన వారు కానిస్టేబుల్స్, హోం గార్డులు బందోబస్తు నిర్వహించనున్నారు. జాతరకు సంబంధించిన సమాచారం మైకేల ద్వారా ప్రకటించేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టం, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే వందలాది ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకురానుంది. ప్రత్యేక వైద్య శిబిరాలు, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన మందులు శిబిరాల్లో అందుబాటులో ఉంచనున్నారు. ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేస్తారు. నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు.కళింగ ఆంధ్రుల ఆరాధ్య దైవం, ఉత్తరాంధ్రుల కల్పవల్లిగా విరజిల్లుతున్న శ్రీ శంబర పోలమాంబ జీవిత చరిత్ర ఆశ్చర్యకరంతో పాటు ఆసక్తిని కూడా కలిగిస్తుంది. మహిమ స్వరూపిణిగా, శక్తి స్వరూపిణిగా ఘనతకెక్కిన శంబర గ్రామ దేవత ఘట్టాలపై భిన్నమైన కథలు ప్రాచుర్యంలో ఉన్నట్లు చరిత్రకారులు చెబుతుంటారు. అమ్మల గన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, ఆదిశక్తి స్వరూపిణి, పార్వతీదేవి అవతారమే పోలేశ్వరి అని ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకుని ముక్తి పొందుతారు.తెలంగాణ ప్రాంతంలోని సమ్మక్క-సారక్క, అనకాపల్లిలోని నూకాలంబ, విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల మాదిరిగా శంబర పోలమ్మ సంబరాలు ఘనంగా జరుగుతాయి. పార్వతీపురం జిల్లా మక్కువ మండలం శంబర ప్రాంతం పూర్వం దండకారణ్య ప్రాంతంగా ఉండేది. శంబాసురుడనే రాక్షసుడు ఈ ప్రాంతాన్ని పరిపాలించేవాడు. ఇతడు మహా పరాక్రమవంతుడు. శంబాసుర రాక్షసరాజు పరిపాలనలో ఈ ప్రాంతం ఉండటంతో ఈ ప్రాంతానికి శంబర అని పేరు వచ్చింది. ఈయన పరిపాలనలో ప్రజలు, మునులు ఘోరమైన చిత్రహింసలు అనుభవించేవారు. రాక్షస రాజు బారి నుంచి రక్షించమని అప్పటి ప్రజలు, మునులు శక్తిస్వరూపిణిని వేడుకోవడంతో ఆమె పోలేశ్వరిగా అవతారమెత్తి శంబాసుర రాక్షసుడిని సంహరించి సుఖం శాంతులను ఇచ్చింది. అప్పటి నుండి పోలేశ్వరి పోలమాంబగా ప్రాచుర్యం పొందింది. ఈ ప్రాంతపు ఆరాధ్య దైవంగా పూజలందుకొంటుంది.పార్వతీపురం జిల్లా సాలూరు పట్టణానికి 16 కిలో మీటర్ల, మక్కువ మండల కేంద్రానికి 6 కిలో మీటర్లు దూరంలో గోముఖి నదీ పరీవాహక ప్రాంతంలోని శంబర గ్రామం ఉంటుంది. కొండ దొరల కుటుంబంలో శక్తి స్వరూపిణిగా పోలమాంబ అవతరించింది. సుమారు నాలుగు వందల ఏళ్ల క్రితం స్వర్గీయ పుకాపు అప్పన్న దొర దంపతులకు పోలేశ్వరి జన్మించింది. అవతారమూర్తి అగుటచే ఆమె మెరుపుతీగ వలే దేవతా స్త్రీవలే గ్రామస్తుల మధ్య బాల్యం నుంచి ప్రత్యేక జీవన విధానాన్ని కలబరిచింది. ఇంట్లో పని ఎప్పుడు ముగించేదో ఎవరికీ అంతుబట్టేది కాదు. తల్లిదండ్రులకు, చిన్ననాటి నుంచి తనతో పెరిగిన మేనత్తకు తప్ప ఆమె ఎవ్వరికంట కనిపించేదుకు నిరాకరించేది. స్పష్టంగా ఆమెను ఎవరూ చూడలేకపోయేవారు. యుక్త వయసు వచ్చేవరకు ఇదే మాదిరిగా వైవిధ్యమైన జీవన విధానంత ఉన్న ఆమెను పలు ప్రాంతాల ప్రజలు భక్తిభావాలతో కీర్తించడం ప్రారంభించారు.పోలేశ్వరికి యుక్త వయస్సు రావడంతో ఆమెకు వివాహం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉంది. అయితే కుమార్తె జీవన విధానంలో ఆమె మానవ స్త్రీ కాదని వారు తెలుసుకున్నారు. అందువల్ల ఆమె వివాహం ఎలా జరుగుతుందోనని ఆదిశక్తి స్వరూపిణిపైనే భారం వేశారు. ఆ రోజుల్లో శంబర గ్రామ మునసబుగా గిరడ చిన్నంనాయుడు ఉన్నారు. ఒకనాడు నీలాటిరేవున ఆయన పళ్లు తోముకుంటున్నారు. ఆ సమయంలో మోభాసా మామిడిపల్లికి చెందిన కొండదొర కులస్తులు ఆ గ్రామ పెద్దలతో కలిసి పెళ్లి సంబంధం విషయమై మరొక పట్టణానికి ప్రయాణం చేస్తున్నారు. నీలాట రేవున శంబర మునసబు వారికి ఎదురవ్వడంతో కుశలప్రశ్నలు సంభాషణలో పోలేశ్వరీ గుణగణాలను తెలుసుకున్నారు. అంతటితో వారి ప్రయాణాన్ని విరమించుకొని పేకాపు అప్పన్నదొర ఇంటికి వెళ్లి లాంచన ప్రాయంగా పోలేశ్వరిని తమ కోడలుగా చేసుకునేందుకు సంబంధం ఖాయం చేసుకున్నారు.పోలేశ్వరి వివాహ లగ్నం సమీపిస్తున్న కొలది ఆ గ్రామ మునసబు చిన్నంనాయుడుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ సారైనా ఆమెను చూడొచ్చని ఎంతో ఆనందించారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. వివాహ లాంఛనాలకు ఆమె ఒప్పుకోలేదు. గృహ జీవనానికి తాను పెళ్లిచేసుకోవడం లేదని, ముత్తైదువగా తాను నిర్వహించాల్సిన మహాకార్యం ఒకటి ఉందని తల్లిదండ్రులకు ఆమె తెలిపింది. ఎప్పుడూ వేదాంత ధోరణిగా మాట్లాడే కుమార్తె మాటల్లోని మర్మాన్ని తల్లిదండ్రులు గ్రహించలేకపోయారు. వివాహ మూహూర్త సమయంలో పెళ్లి పీటలపై ఆమె కూర్చొనక పెళ్లి కుమారుడి ముట్టిన మంగళసూత్రాలు, పూలదండను ఒక పుణ్యస్త్రీతో తెప్పించుకొని ధరించింది. అలా ఆమె ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అయింది.నా

## మారని అధికారులు

## సీఎం ఆదేశించిన ఆగని మొండి వైఖరి

విజయవాడ, డిసెంబర్ 18, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా అధికారుల తీరులో ఏ మాత్రం కూడా మార్పు కనిపించట్లేదు.. ఇంకా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు వివిధ స్థాయిలో కొనసాగుతూనే ఉన్నారంటున్నారు.. అప్పుడు చేసిన తప్పులు మళ్ళీ ఇప్పుడు కూడా చేస్తూ వైసీపీ నేతలకు వీరవిధేయుల్లా వ్యవహరిస్తున్నారంట. పేర్ని నాని గోడౌన్‌లో పీడీఎస్ బియ్యం మాయమైన కేసులో అధికారులు అవలంభిస్తున్న వైఖరే అందుకు నిదర్శనంగా కనిపిస్తోందంటున్నారుపౌరసరఫరాల సంస్థ ఫిర్యాదు మేరకు ఈ నెల 10న మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన వారిపై కేసు నమోదైంది. ఏకంగా 3,708 బస్తాల బియ్యం మాయమైన ఘటనలో వెంటనే సంబంధిత సంస్థకు చెందిన వారిని అరెస్టు చేయాలి. కానీ అధికారుల మీనమేషాలు లెక్కిస్తూ.. నిందితులు పారిపోయేందుకు అవకాశం ఇచ్చారు. ఇంత జరుగుతున్నా జిల్లా ఎస్పీ గంగాధర్ చేశారనేదే అసలు ప్రశ్న. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేసిన గంగాధర్.. అంగళ్లు ఘటనలో అప్పట్లో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై కేసు నమోదు చేయించి ప్రెస్‌మీట్లు పెట్టి రాజకీయ నాయకుడిలా విమర్శలు గుప్పించారు..అయినా ఆయనను కూటమి ప్రభుత్వం ఉదారంగా కృష్ణా జిల్లా ఎస్పీగా నియమించింది. అప్పట్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడిలా గంగాధర్ పని చేశారన్న ఆరోపణలున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారినా గంగాధర్ వైసీపీ పట్ల తన స్వామి భక్తి వదులుకోవడం లేదంట.. అన్నమయ్య జిల్లాలో చూపిన వేగం ఇప్పుడు ఇక్కడ చూపడంలేదని, ఆయన ఇప్పటికీ వైసీపీ విధేయులుగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.భారీ ఎత్తున రేషన్ బియ్యం మాయంపై పేర్ని నాని కుటుంబానికి చెందిన వారిపై క్రిమినల్ కేసు నమోదైనా.. ఉమ్మడి కృష్ణా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల్లోనూ ఒక్కరంటే ఒక్కరూ స్పందించకపోవడం గమనార్హం. ఎవరికి వారే తమ సొంత పనుల్లో బిజీగా ఉన్నట్లున్నారు. కృష్ణా జిల్లాలో వైసీపీ తరపున అంతా తానై వ్యవహరించే పేర్ని నాని.. ప్రతిపక్ష నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతుంటారు. ఇంత భారీ స్థాయిలో ఆయన అక్రమాలు బట్టబయలైనా.. కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడేందుకు కూడా ముందుకు రాకపోవడానికి కారణమేంటన్న దానిపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయిమచిలీపట్నం సమీపంలోని పొట్లపాలెంలో పేర్ని నాని భార్య జయసుధ పేరున ఉన్న గోడౌన్‌లను పౌరసరఫరాలశాఖకు అద్దెకు ఇచ్చారు. లెక్క ప్రకారం ఈ గోడౌన్‌లో 7,719 బస్తాల బియ్యం ఉండాలి.

వేబ్రిడ్జి తూకంలో సాంకేతిక సమస్య కారణంగా తూకంలో తేడా వచ్చిందని, 3,200 బస్తాలు తగ్గాయని.. వాటి సొమ్ము చెల్లిస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మకు గతనెల 26న పేర్ని నాని భార్య లేఖ రాశారు. అంతకుముందే గోడౌన్‌లను తనిఖీ చేసి.. బియ్యం నిల్వల వివరాలను ఆన్‌లైన్ చేయాలని పౌరసరఫరాల సంస్థ అక్కడి అధికారులను ఆదేశించింది. అయితే పేర్ని నాని గోడౌన్‌ను తనిఖీ చేయలేదు. ఉద్దేశపూర్వకంగానే ఇలా వ్యవహరించినట్లు తెలుస్తోంది.కొత్త డీఎం నవంబరు 27న విధుల్లో చేరారు. అంతకు ఒకరోజు ముందు బియ్యం తగ్గాయని పేర్ని నాని కుటుంబం జేసీకి లేఖ రాసింది. అంటే డీఎం తనిఖీ చేస్తే అక్రమాలు బయటకొస్తాయనే ఉద్దేశంతో ముందే జాగ్రత్తపడి లేఖ రాశారని తెలుస్తోంది. వారం తర్వాత జేసీ గోడౌన్‌కు వెళ్లి తనిఖీ చేసి 3,708 బస్తాలు తగ్గాయని తేల్చారు. బియ్యం మాయంపై క్రిమినల్ కేసు పెట్టాలని, గోడౌన్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టడంతోపాటు.. మాయమైన బియ్యానికి రెట్టింపు మొత్తంలో జరిమానా వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆ తర్వాత కూడా కృష్ణా జిల్లా అధికారులు అంతా రహస్యం అన్నట్లుగా వ్యవహరించారు. మాజీమంత్రికి సంబంధించిన వ్యవహారంలో చర్యలకు సంకోచించారు.రేషన్ బియ్యం మాయంపై గత నెల 26న గోడౌన్ నిర్వాహకుల నుంచే సమాచారం వచ్చింది. సాధారణంగా అయితే తక్షణమే సరకు మొత్తం తూకం వేసి.. ఎంత తేడా వచ్చిందో తేల్చాలి. సమగ్ర నివేదిక తయారు చేయాలి. కానీ ఇప్పటి వరకు ఎంతమేర బియ్యం తగ్గాయనే లెక్కలు లేవు. 3,708 బస్తాలు తగ్గాయని మాత్రమే తేల్చారు. బస్తాకు 50 కిలోల లెక్కన.. మొత్తం 1,85,400 కిలోలు తగ్గాయని అంచనా వేశారు. అంటే అధికారుల నిర్లక్ష్యం ఏ పాటిదో అర్థమవుతోంది. పౌరసరఫరాలశాఖ లెక్కల ప్రకారం మాయమైన బియ్యం విలువ సుమారు రూ. 86 లక్షలు. రెట్టింపు జరిమానా వసూలు చేయాలని ఆ శాఖ ఎండీ ఆదేశించారు. అంటే రూ. 1.72 కోట్లు వారి నుంచి రాబట్టాలి. దీనికి సంబంధించి పేర్ని నాని కుటుంబానికి నోటీసు ఇవ్వగా.. వారు జేసీ కార్యాలయంలో రూ.కోటికి చెక్కు ఇచ్చారు.పేర్ని నాని కుటుంబంపై చర్యల విషయంలో అధికార యంత్రాంగం అడుగడుగునా ప్రేమ ఒలకబోసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బియ్యం పరిమాణం తగ్గిందని ఆయన కుటుంబం నుంచి జేసీకి లేఖ అందింది. మరెవరైనా అయితే నెలనెలా తనిఖీలు చేసి ప్రతి బియ్యం బస్తాను తూకం వేసి లెక్క తేల్చేవారు. కానీ ఇక్కడ మాజీమంత్రి కుటుంబానికి చెందిన గోడౌన్ కావడంతో.. వాళ్లే స్వయంగా లేఖ రాసినా అధికారుల్లో కదలికలు లేవు. వారం తర్వాత తనిఖీలు చేశారు. ఆ తర్వాతా ఆ సంస్థపై చర్యలకు వెనకాడారు. తీరిగ్గా ఆ కేసు నమోదు చేశారు. మరెలాంటి అధికారులను ప్రభుత్వ పెద్దలు ఎలా ఉపక్షిస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది.

# 1941లో 129 కోట్లు
# 2021 నాటికి 55,548 కోట్లు

ఏలూరు, డిసెంబర్ 18,ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు. ఏలూరు జిల్లా పోలవరం సమీపంలో నిర్మిస్తున్న బహుళార్థ సాధక నీటిపారుదల పథకం. విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలలోని మెట్టప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా గుర్తించింది. మొదట్లో రామపాద సాగర్ గా పిలిచిన ప్రాజెక్టును ప్రస్తుతం పోలవరం సాగునీటి ప్రాజెక్టు అని పిలుస్తున్నారు.1941లో అప్పటి నీటిపారుదల ఇంజినీర్ ఎల్.వెంకటకృష్ణ అయ్యర్, పోలవరం సమీపంలో గోదావరిపై రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదనలపై ఓ నివేదికను రూపొందించారు. మొదట్లో దీని వ్యయం రూ.129 కోట్లు. 2021 తాజా అంచనాల ప్రకారం నిర్మాణ వ్యయం రూ.55,548.87.పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యంగా మూడు భాగాలున్నాయి. రిజర్వాయర్, స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం. ప్రధాన రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు స్పిల్‌వే ఉపయోగపడుతుంది. పోలవరం వద్ద రెండు కొండల మధ్య 48 గేట్లుతో స్పిల్ వే నిర్మిస్తున్నారు. ఈ రిజర్వాయల్ రెండు కాలువలు(కుడి, ఎడమ) ఉంటాయి. ఈ ప్రాజెక్టులో మరో ముఖ్యమైన కట్టడం డయాఫ్రం వాల్. దీనిని గోదావరి నది మధ్యలో దాదాపు 300 అడుగుల లోతులో నిర్మిస్తున్న కాంక్రీటు గోడ. సుమారు 2.454 కిలోమీటర్లు పొడవులో దీనిని నిర్మిస్తున్నారు. డయా ఫ్రమ్ వాల్ కు ఇరువైపులా ఎర్త్ కమ్ రాక్ డ్యామ్ నిర్మిస్తున్నారు.పోలవరం ప్రధాన డ్యామ్ నిర్మాణంలో నీరు అడ్డుతగలకుండా తాత్కాలికంగా నిర్మించే కట్టడమే కాఫర్ డ్యాం అంటారు. పోలవరం ప్రాజెక్టులో రెండు కాఫర్ డ్యామ్ లను ప్రతిపాదించారు. ప్రాజెక్టు ఎగువన ఒకటి, ధవళేశ్వరం బ్యారేజీ బ్యాక్ వాటర్ రాకుండా దిగువున మరో కాఫర్ డ్యాం నిర్మించాలని నిర్ణయించారు. 2014 రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. 2013-14 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ బడ్జెట్ రూ.58,319 కోట్లు. 2017 పోలవరం అంచనాలను ఏపీ సర్కార్ సీడబ్ల్యూసీకి సమర్పించింది.2004లో ప్రారంభమైన పోలవరం ప్రాజెక్టును...2014లో జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. 2017 జూన్ నాటికి రిజర్వాయర్ లో మట్టిపని 68%, కరకట్ట 9%, కుడికాలవ పనిలో మట్టిపని 100%, లైనింగ్ 81%, ఎడమకాలవ పనిలో మట్టిపని 87%, లైనింగ్ 62% పూర్తి అయ్యాయి. 2021 మే నెల నాటికి 42.5 మీటర్ల ఎత్తులో కాపర్ డ్యాం నిర్మాణం పూర్తి చేశారు. స్పిల్‌వే లో 14 గేట్ల ద్వారా నీటి తరలింపునకు ఏర్పాట్లు చేశారు. పెరిగిన వ్యయాలతో పోలవరం వ్యయ అంచనాలు పెంచి, కొత్త ప్రతిపాదనలు ఆమోదం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతుంది.2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం...కాంట్రాక్టర్ ను మార్చింది. ఈ ప్రాజెక్టు పూర్తిపై మంత్రులు పలు సందర్భాల్లో భిన్న ప్రకటనలు చేశారు. అయితే 2024లో అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం...2027 నాటికల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించింది. ప్రతి నెలా ఓ సోమవారం సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తూ...పనులు పురోగతిపై సమీక్షిస్తున్నారు. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తుంది. దయాఫ్రంవాల్ నిర్మాణంతోపాటు ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం పనులను వేగంగా పూర్తి చేయడాన్ని మొదటి ప్రాధాన్యంగా పెట్టుకుంది. వరదలతో కుంగిన గైడ్‌బండ్‌ను తిరిగి నిర్మించడానికి ప్రణాళిక చేస్తుంది. స్పిల్ ఛానల్, ఐకానిక్ వంతెన పనులు త్వరలో చేపట్టనున్నారు. గత టీడీపీ పాలనలో 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేసినట్లు నేతలు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 17, ఇతర జిల్లాల్లోని 54 మండలాల్లో 7.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.పోలవరం నిర్వాసితులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 13 ప్రాంతాల్లో కాలనీలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే పోలవరం మండలంలోని 19 గ్రామాల ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేశారు. వీరికోసం ఒక్క ప్రాంతంలో కూడా పూర్తి సౌకర్యాలతో కాలనీలు ఏర్పాటు కాలేదు. డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, రోడ్లు, ఆసుపత్రి, పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు, ఇతర సౌకర్యాలు లేక నిర్వాసితులు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పునరావాస కాలనీలు ప్రారంభించిన రూ.210 కోట్ల మేర బిల్లులను బకాయి పడ్డాయి. కూటమి ప్రభుత్వం తాజాగా పాత బకాయిలతో పాటు పునరావాసానికి మరో రూ.502 కోట్లు ప్రకటించింది. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 12 వేల ఎకరాల భూసేకరణ చేశారు. మరో 25 వేల కుటుంబాలను నిర్వాసితులుగా ప్రకటించారు. ఇందులో 41.15 కాంటూరు పరిధిలో 44 గ్రామాలు 10 వేల కుటుంబాలు ఉన్నాయి. పునరావాసం, పరిహారం విషయంలో నేటికీ 10-20 శాతం వరకే పూర్తైందనేది వాస్తవం.దశాబ్దాలుగా పోలవరం ప్రాజెక్టు రెండడుగులు ముందుకి, మూడడుగులు వెనక్కి అన్నట్లు ఉంది. పోలవరం నిర్మాణానికి వైఎస్ఆర్ ప్రభుత్వ హయంలో జలయజ్ఞం పేరిట కొంత కదలిక వచ్చింది. డ్యామ్ పనులతో పాటు కాలువల పనులు కొంతమేర జరిగాయి. టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పూర్తి చేసేందుకు ప్రయత్నించినా ఆర్థిక వనరులు ప్రధాన అడ్డంకిగా మారాయి. 2016లో ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యతను తీసుకుంది. దీంతో కేంద్రం మెలికపెట్టింది. 2013 అంచనాల మేరకు మాత్రమే నిధులు సమకూరుస్తామని చెప్పింది. 2013 నాటి అంచనాల మేరకు రూ. 20,338 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంటుంది. 2017-18 ధరల సూచీ ప్రకారం పోలవరం అంచనా వ్యయాన్ని రూ. 55,657 కోట్లుగా ఇటీవల నిర్ణయించారు. దీనికి కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు ఆర్థిక వనరుల సమస్య అడ్డురావడంతో ప్రాజెక్టు ముందుకు సాగడంలేదు. నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్, ప్రాజెక్టు వ్యయం భారీగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం కోసం కేంద్రం వైపు చూస్తుంది.

# అసెంబ్లీ ఎన్నికల్లో ఏం జరుగుతోంది...

భారతీయ జనతా పార్టీ కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం మూడు దశాబ్దాలుగా అధికారం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మిగిలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కలిసి పోటీ చేసినా సరే క్లీన్ స్వీప్ చేసిన కమలదళం అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి చతికిలపడుతోంది. చివరిసారిగా 1993లో గెలుపొందిన ఆ పార్టీ, మళ్లీ ఇప్పటి వరకు అధికారం చేజిక్కించుకోలేకపోయింది.మరో రెండు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుదలతో కమలదళం ఉంది. బీజేపీకి సైద్ధాంతిక మాతృసంస్థ 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూడా రంగంలోకి దిగి బీజేపీ గెలుపు కోసం వ్యూహాలు అమలు చేస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు గెలిచి అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ను ఈ సారి ఎలాగైనా నిలువరించాలి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో పార్టీ ఓటుబ్యాంకును కాపాడుకోవడంతో పాటు సామాజిక సమీకరణాలు, భావోద్వేగ అంశాలను తెరపైకి తెస్తోంది.మరోవైపు బీజేపీ, దాని అనుబంధ సంఘాలు, సంఘ్ పరివార్ ఢిల్లీలోని ప్రతి ఇంటినీ చుట్టేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. తాజాగా జరిగిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానా, మహారాష్ట్రలో అనూహ్య విజయం సాధించిన కమలదళం ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపొంది దశాబ్దాలుగా అందకుండా పోతున్న అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తోంది. ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించక ముందే అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు ఇప్పటికే పూర్తిచేసింది. త్వరలోనే మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది.ఏ పార్టీకైనా తమ సొంత బలానికి తోడు అభ్యర్థుల బలం కూడా తోడైతేనే విజయం వరిస్తుంది. అందుకే అన్ని రాజకీయ పార్టీలు బలమైన అభ్యర్థుల కోసం గాలం వేస్తుంటాయి. ఈ క్రమంలోనే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేసింది. క్షేత్రస్థాయిలో బలమైన ముద్ర, ఓటర్లలో ఆదరణ కలిగిన నేతలకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే వరుసగా 2 పర్యాయాలు ఓడిపోయిన నేతలకు ఈసారి టికెట్ ఇవ్వడం లేదు. మరోవైపు మీనాక్షి లేఖి, పర్వేశ్ వర్మ, రమేశ్ బిధూరి వంటి నగరవ్యాప్త ప్రభావం కలిగిన సీనియర్ నేతలను ఆమ్ ఆద్మీ పార్టీ (ంంఖ)కి వ్యతిరేకంగా ఎన్నికల వాతావరణాన్ని తయారుచేయగలరని అధినాయకత్వం భావిస్తోంది. ఎన్నికల ప్రచారంలో వారికి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. వారితో పాటు ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరిన రాష్ట్ర మాజీ మంత్రి కైలాష్ గెహ్లోట్‌కు జాట్ సామాజికవర్గంలో గట్టి పట్టుంది. ఆయనను నజఫ్‌గఢ్ నుంచి బరిలోకి దించే అవకాశాలున్నాయి. మాజీ ముఖ్యమంత్రి మదన్‌లాల్ ఖురానా కుమారుడు హరీష్ ఖురానాను మోతీనగర్ నుంచి పోటీ చేయించవచ్చు.మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు కొత్త ముఖాలను పరిచయం చేయడం కోసం సగం స్థానాలను కొత్తవారికి కేటాయించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంటే కనీసం 35 స్థానాల్లో కొత్త అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశాలున్నాయి. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో "చావో రేవో" అన్నట్టుగా శ్రమించిన కమలదళం.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను అంతకంటే సీరియస్‌గా తీసుకుని పోరాడాలని చూస్తోంది.ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతాన్ని మించిన ఓటుబ్యాంకు ప్రతిసారీ ఉంటోంది. నగరంలోని వ్యాపారవర్గాలు బీజేపీకి ఎల్లవేళలా మద్ధతుగా నిలుస్తున్నారు. వారితో పాటు విద్యాధిక వర్గాలు, కొన్ని సామాజికవర్గాలు బీజేపీకి బలమైన ఓటుబ్యాంకుగా నిలిచాయి. అయితే ప్రత్యర్థి ఆమ్ ఆద్మీ పార్టీ ఏకంగా 50 శాతాన్ని మించి ఓటుబ్యాంకు కైవసం చేసుకుంటున్నప్పుడు ఈ బలం సరిపోదు. అందుకే ఈసారి ఓటుబ్యాంకును విస్తరించుకోవడంపై కమలనాథులు దృష్టి పెట్టారు. తమ ఓటుబ్యాంకు చేజారకుండా కాపాడుకోవడం ఒకెత్తయితే.. కొత్త ఓటుబ్యాంకును సృష్టించుకోవడం మరో ఎత్తు. కొత్త ఓటుబ్యాంకు తయారు చేసుకోవాలి అంటే ప్రత్యర్థి ఓటుబ్యాంకును చెదరగొట్టి తమవైపు ఆకట్టుకోవాలి.ఢిల్లీలోని మురికివాడల్లో నివసించే పేద, నిరుపేద ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీ (కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని 1,194 బస్తీలు, మురికివాడల్లో రాత్రి పూట పార్టీ నేతలు గడిపేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇప్పటికే పలువురు నేతలు బస్తీ నిద్రలు చేస్తున్నారు. తద్వారా బస్తీ ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి భరోసా కల్పించవచ్చని భావిస్తున్నారు. ఉచిత పథకాలకు ఆకర్షితులై ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటేస్తున్నవారిలో ఇలాంటి బస్తీ ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని పార్టీ నాయకత్వం గ్రహించింది. అందుకే బస్తీ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల ప్రచార కార్యక్రమాలను రూపొందించుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించి చెప్పడంతో పాటు వారి అవసరాలకు తగ్గ హామీలను మేనిఫెస్టోలో చేర్చేందుకు ప్రయత్నిస్తోంది.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హర్యానా, మహారాష్ట్రలో మాదిరిగా తెరవెనుక అనేక వ్యూహాలను అమలు చేస్తోంది. ఆరెస్సెస్ జాయింట్ జనరల్ సెక్రటరీ అరుణ్ కుమార్ ఢిల్లీలోనే మకాం పెట్టి అనేక సమావేశాలు నిర్వహించారు. బీజేపీ ? ఆరెస్సెస్ మధ్య మెరుగైన సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్థాయికి తగ్గ నేత ప్రస్తుతం ఢిల్లీ బీజేపీలో లేరని ఆరెస్సెస్‌కు కూడా తెలుసు. అయితే వరుసగా పదేళ్లు అధికారంలో ఉన్న ఆప్ సర్కారుపై ప్రజల్లో ఏర్పడ్డ వ్యతిరేకతను కేజ్రీవాల్‌పై అస్త్రంగా మలచుకోవాలని చూస్తోంది.ప్రజలకు పరిమిత యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఉచిత నల్లా నీరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రజాకర్షక ఉచిత పథకాలతో ఓటర్లను ఆకట్టుకుంటూ రెండు పర్యాయాలు అధికారం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ, రోడ్లు, మురుగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా విషయంలో విమర్శలు ఎదుర్కొంటోంది. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసు ద్వారా కేజ్రీవాల్‌పై ఇంతకాలం ఉన్న 'నీతి-నిజాయితీ' ముద్ర కూడా చెరిగిపోయింది.కాంగ్రెస్ పార్టీ సైతం పునర్ వైభవం కోసం శ్రమిస్తోంది. ఢిల్లీలో ఆప్ ఎదుగుదల కాంగ్రెస్ పార్టీనే తీవ్రంగా దెబ్బతీసింది. ఆ పార్టీ ఓటుబ్యాంకు పూర్తిగా చెల్లాచెదురైపోయింది. ఈ సారి కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో కలిసి పోటీ చేయడం లేదు. తద్వారా మైనారిటీలు, మరికొన్ని వర్గాల ఓట్లను కాంగ్రెస్ చీల్చడం కూడా బీజేపీకి కలిసొచ్చే అవకాశం ఉంది. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుంటే అధికారం చేజిక్కించుకోవడం కష్టమేమమీ కాదని కమలదళం అంచనా వేస్తోంది.

## నిలదీస్తున్న తమ్ముళ్లు...

విజయవాడ, డిసెంబర్ 18, తెలుగుదేశం పార్టీ ఇప్పుడు గతంలో మాదిరిగా లేదు. అవసరమైతే ప్రభుత్వనిర్ణయాలను, పార్టీ తీసుకునే ఏ విషయాన్నైనా కార్యకర్తలు ఇట్టే నిలదీస్తున్నారు. నేతలను వదిలిపెట్టకుండా సోషల్ మీడియాలో వెంటాడుతున్నారు. వేటాడుతున్నారు. దీంతో పార్టీ అధినేత నుంచి ముఖ్యమైన నేతలు ఇప్పుడు క్యాడర్ ను తొలుత సంతృప్తి పర్చిన తర్వాతనే ఏ నిర్ణయమైనా తీసుకోవాల్సి వస్తుంది. గతంలో టీడీపీలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. 1995 నుంచి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్ననాటి నుంచి అధికారంలో ఉన్నప్పుడు క్యాడర్ పెద్దగా ఆయన నిర్ణయాలపై ఎటువంటి అభ్యంతరాలను వ్యక్తం చేయలేదు. ఆయన తీసుకునే నిర్ణయమే ఫైనల్ గా మారింది. కాలం మారింది. తరం మారింది. నేతలను నిలదీసే రోజులొచ్చేశాయి. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ పాలనతో తాము అనుభవించిన విషయాన్ని వారు గుర్తు చేసుకుని మరీ నేతలను, అధినాయకత్వాన్ని ట్రోల్ చేస్తున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలయినా వైసీపీ నేతలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునే నిలదీస్తున్నారు. రెడ్ బుక్ ఏమయిందంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన మాటలు ఏమయ్యాయని సూటి ప్రశ్నలు వేస్తున్నారు. దీంతో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అనేక సభల్లోనూ ఆయన పదే పదే చెప్పుకోవాల్సి వచ్చింది. తాను ఏదైనాచట్టపరంగానే చర్యలు తీసుకుంటానని, తప్పు చేసిన వారిని వదిలిపెట్టనంటూ ఆయన హెచ్చరికలు జారీ చేశారు. తర్వాత ఏలూరు నియోజకవర్గం నేత, మాజీ మంత్రి ఆళ్ల నానిని టీడీపీలో చేర్చుకోవడంపై కూడా తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసింది క్యాడర్. నియోజకవర్గంలో నేతల నుంచి కార్యకర్తల వరకూ ఆళ్లనాని తమను ఎలా ఇబ్బంది పెట్టింది వారు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో చంద్రబాబు ఆళ్ల నానికి కండువా కప్పాల్సిన సమయంలో చేరికను హోల్డ్ లో పెట్టారు. ఆళ్ల నానిని పార్టీలో చేర్చుకుంటే కార్యకర్తల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో నాని చేరిక వాయిదా పడిందా? లేక డోర్లు పూర్తిగా క్లోజ్ అయ్యాయా? అన్నది తెలియకున్నా క్యాడర్ వత్తిడితోనే చంద్రబాబుతో పాటు పార్టీ అగ్రనాయకత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది.తాజాగా నూజివీడులో జరిగిన ఘటన కూడా ఇదే అద్దం పడుతుంది. చంద్రబాబు నాయుడు ఇంటి మీద దాడికి ప్రయత్నించిన మాజీ మంత్రి జోగి రమేష్ తో టీడీపీ నేతలు కలసి గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం వివాదంగా మారింది. వెంటనే టీడీపీ సోషల్ మీడియాలో గౌతు శిరీషను, మంత్రి పార్థసారథిని ట్రోల్ చేశారు. దీంతో నారా లోకేష్ వారిద్దరి నుంచి వివరణ కోరారు. ఇద్దరూ అధినాయకత్వంతో పాటు పార్టీ కార్యకర్తలకు కూడా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. మరోసారి ఇలాంటి తప్పు జరగదంటూ గౌతు శిరీష, మంత్రి పార్థసారథి కార్యకర్తలను వేడుకోవాల్సి వచ్చింది. దీంతో పార్టీ అధినాయకత్వంతో పాటు నేతలకు కూడా ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలన్నాక్యాడర్ అనుమతి తప్పనిసరిఅయింది. గతంలో మాదిరిగా రాజకీయాలు చేస్తామంటే కుదరదని తమ్ముళ్లు తెగేసిచెబుతున్నారు. అందుకే నేతల నిర్ణయాలను ఒళ్లు దగ్గరపెట్టుకుని చేసుకోవాల్సిందే.

## ఇక కేసీఆర్ వంతేనా

హైదరాబాద్, డిసెంబర్ 18,గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తప్పిదాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అధికారం అడ్డం పెట్టుకుని.. కేసీఆర్ ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయాలే.. ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకుంటున్నాయి. కేసీఆర్ హయాంలో పదేళ్లపాటు చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలు, ప్లాంట్ల నిర్మాణంలో తప్పిదాలు బయటపడ్డాయి. వీటిపై జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ విచారణ జరిపి నివేదికను రెడీ చేసింది. రీసెంట్‌గా ఈ నివేదికను తెలంగాణ మంత్రివర్గం ఆమోదించింది. ఈ నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు.. ఇతర పాత్రధారులపైన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది.ఇక విద్యుత్ ఒప్పందాలతో పాటు.. ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన తప్పిదాలపై.. జస్టిస్ మదన్ కమిషన్ రెడీ చేసిన నివేదికను.. ప్రస్తుతం కొనసాగుతున్నఅసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కేబినెట్ తీర్మానించింది. నివేదికపై సభలో విస్తృతంగా చర్చించిన తర్వాత.. మాజీ సీఎం కేసీఆర్‌పై తీసుకునే చర్యలకు సంబంధించి.. అసెంబ్లీ సాక్షిగానే ప్రకటన చేయనుంది ప్రభుత్వం. దీని ఆధారంగా కేసీఆర్ సహా పలువురిపై కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు కూడా అధికార వర్గాలు తెలిపాయి. నిన్న జరిగిన కేబినెట్ మీట్‌లో ప్రధానంగా విద్యుత్తు కమిషన్ నివేదికపైనే సుదీర్ఘంగా చర్చ జరిగింది. పదేళ్ల కాలంలో కేసీఆర్ డిస్కమ్‌లను ఆర్థికంగా కుప్ప కూల్చారని, ఆయన మెప్పు కోసం విద్యుత్తు సంస్థలు మునుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని కమిషన్ తేల్చింది. విద్యుత్తు కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలతో.. రానున్న 25 ఏళ్లపాటు తెలంగాణ సమాజం మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కమిషన్ అభిప్రాయ పడింది. కాలం చెల్లిన టెక్నాలజీతో కట్టిన భద్రాద్రి పవర్ ప్లాంట్ కారణంగా? రానున్న 25 ఏళ్లలో 9వేల కోట్ల దాకా ప్రజలపై భారం పడనుందని అభిప్రాయపడింది.సూపర్ క్రిటికల్‌తో పోల్చుకుంటే సబ్ క్రిటికల్‌లో ప్లాంట్ ఆక్సిలరీ కన్జంప్షన్, హీట్ రేట్, మెయింటినెన్స్ తదితర ఖర్చులు ఏటా 350 కోట్ల వరకూ అదనంగా పడతాయని, ప్లాంటు జీవిత కాలం 25 ఏళ్లకు దాదాపు 9వేల కోట్ల వరకూ అదనపు భారం పడుతుందని క్యాబినెట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక, ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందంతో.. కూడా 3వేల 642 కోట్ల నష్టం జరిగిందని నివేదిక తేల్చింది. ఒక యూనిట్ విద్యుత్‌ను తొలుత మూడు రూపాయల అరవై పైసలకే కొన్న ప్రభుత్వం.. ఆ తర్వాత ఇంధన సర్దుబాటు పేరిట ఏడు రూపాయలకు కొనడాన్ని కేబినెట్ తప్పుబట్టింది.వెయ్యి మెగావాట్ల కరెంట్‌ను తీసుకోవడానికి ఛత్తీసగఢ్‌తో ఒప్పందం చేసుకున్నా.. దానికి తగినట్టుగా ఆ రాష్ట్రం కరెంట్ ఇవ్వలేదని కమిషన్ తేల్చింది. దాంతో ఓపెన్ యాక్సె?సలో కొనుగోలు చేయాల్సి వచ్చిందని.. ఫలితంగా 2వేల కోట్ల అదనపు భారం తెలంగాణపై పడిందని కమిషన్ రిపోర్ట్ ఇచ్చించి ప్రభుత్వానికి.

# పిల్లలు పుట్టకుండా మావోయిస్టుల ఆపరేషన్లు

రాయ్ పూర్, డిసెంబర్ 18,మావోయిస్టులను పూర్తిగా ఏరివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారిని జనజీవన స్రవంతిలోకి ఆహ్వానిస్తున్నాయి. వారికి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాయి. ఆయుధాలను వదిలి అజ్ఞాతం వీడిలాని విజ్ఞప్తి చేస్తున్నాయి. అయినా అడవుల్లోనే ఉండి ఉద్యమం చేసేవారికి వార్నింగ్ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా ఓ అంశం ఆసక్తికరంగా మారింది.కేంద్ర హోంమంత్రి అమిత్ షా జగదల్‌పుర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అస్సాం రాష్ట్రాలకు చెందిన మాజీ మావోయిస్టులతో కాసేపు మాట్లాడారు. ఈ సమయంలో.. తెలంగాణకు చెందిన ఓ మాజీ మావోయిస్టు అమిత్ షాకు ఆసక్తికరమైన విషయం చెప్పారు.'సీనియర్ మావోయిస్టు నేతల ఆదేశాల మేరకు పెళ్లికి ముందు తాను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. జనజీవన స్రవంతిలో కలిశాక తిరిగి దానికి విరుగుడు శస్త్రచికిత్స చేయించుకున్నా. ప్రస్తుతం ఓ బాబు ఉన్నాడు. పిల్లలు పుడితే ఉద్యమంపై అంతగా దృష్టిపెట్టరన్న ఉద్దేశంతో.. మావోయిస్టు నేతలు తమ దళ సభ్యులకు అలా ఆపరేషన్లు చేయిస్తుంటారు' అని మాజీ మావోయిస్టు అమిత్ షాకు చెప్పారు.మాజీ మావోయిస్టులతో మాట్లాడటం తనకు చాలా సంతోషంగా ఉందని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఉద్యమాన్ని వీడి లొంగిపోయేలా మాజీ సహచరులకు సందేశం పంపించాలని వారికి సూచించారు. లేనిపక్షంలో భద్రతా బలగాల చేతుల్లో వారికి చావుదెబ్బ తప్పదని హెచ్చరించారు. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టురహితంగా మారుతుందని.. అమిత్ షా స్పష్టం చేశారు.సామ్రాజ్యవాదులు, దేశ, విదేశీ కార్పొరేట్లు, దోపిడీ పాలకుల సొంత లాభాల కోసమే.. భారతదేశంలో మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో ఈ నరమేధం కొనసాగుతుందని.. ఆ పార్టీ దళ సభ్యులు ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉండి దేశ సంపదను, శ్రమను కారు చౌకగా అమ్మడానికి, దోపిడీ అనుకూల విధానాలు సరళం చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు.దేశ వనరులను, శ్రమను కాపాడే లక్ష్యంతో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో పీడిత ప్రజల వైపు పోరాడుతున్నామని మావోయిస్టు దళ సభ్యులు చెబుతున్నారు. ఈ ప్రజా పోరాటాలు వారి సొంత లాభాలకు అడ్డుగా మారడంతో.. మావోయిస్టు పార్టీని, పీడిత ప్రజలను నిర్మూలించాలని పథకం పన్నారని ఆరోపిస్తున్నారు. దోపిడీ వర్గాలు తమ ఆర్థిక సంక్షోభాలను, తమ మార్కెట్ విస్తరణను యుద్ధం ద్వారా పరిష్కరించుకోవాలనుకుంటారని ఫైర్ అవుతున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తున్నాయని మావోయిస్టు పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు, కార్పొరేట్లకు దోచిపెట్టడంలో, మావోయిస్టు పార్టీని నిర్మూలించడంలో బీజేపీ, కాంగ్రెస్‌లు వేర్వేరు కాదంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి సాయుధ బలగాల మద్దతుతో పాటు ఆర్థిక బలం కావాలన్నారని.. ఆనాటి నుంచి కాంగ్రెస్ మావోయిస్టు పార్టీపై నిర్బంధాన్ని పెంచిందని అంటున్నారు.

## సామాన్యులకు ఎంట్రీ... 103 ఎకరాల్లో అసెంబ్లీ భవనం

విజయవాడ, డిసెంబర్ 18, ఏపీ ప్రభుత్వం దూకుడుగా ఉంది. కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. పాలనను పరుగులెత్తిస్తోంది. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టింది. అదే సమయంలో అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులను ప్రారంభించాలని చూస్తోంది. ఇప్పటికే కేంద్రం కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. కేంద్ర బడ్జెట్లో ఏకంగా 15 వేల కోట్ల రూపాయల సాయాన్ని ప్రకటించింది. ఇందుకు సంబంధించి ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు మంజూరు చేయనుంది. జనవరి నుంచి పనులు ప్రారంభించాలని భావిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. నిపుణుల సూచనతో నిర్మాణ పనులు ప్రారంభించవచ్చని.. గతంలో ఎక్కడైతే నిలిచిపోయాయో.. అక్కడ నుంచి ప్రారంభించేందుకు నిపుణులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ప్రభుత్వం సైతం రెట్టింపు ఉత్సాహంతో పనులు ప్రారంభించేందుకు సిద్ధపడుతోంది.గత అనుభవాల దృష్ట్యా వీలైనంత త్వరగా అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే అమరావతిలో చేపట్టాల్సిన అనేక పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ. 24276 కోట్ల పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు అమరావతిలో రూ.45,249 కోట్లకు సిఆర్డిఏ ఆమోదం లభించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అయితే అమరావతికి అనుసంధానంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులతో పాటు రైల్వే లైన్ల నిర్మాణ ప్రాజెక్టులను మంజూరు చేసింది.ఒకవైపు రాజధాని నిర్మాణాలు, ఇంకోవైపు వివిధ సంస్థలకు కేటాయించిన భూముల్లో నిర్మాణాలు ప్రారంభించే వీలుగా ఆయా యాజమాన్యాలతో ఏపీ ప్రభుత్వం చర్చలు జరిపింది. ఒక్కో సంస్థ ముందుకు వచ్చి తమ కార్యకలాపాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తోంది.ఏపీ అసెంబ్లీ భవనాన్ని భారీగా నిర్మించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. మొత్తం 103 ఎకరాల్లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకుగాను రూ.768 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. నగరం మొత్తం కనిపించేలా అసెంబ్లీపై టవర్ ఏర్పాటు చేయనున్నారు. అసెంబ్లీ సమావేశాల రోజుల్లో మినహా.. మిగతా రోజుల్లో అసెంబ్లీ టవర్ చూసేందుకు సందర్శకులను అనుమతించనున్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాయణ వెల్లడించారు. అలాగే నాలుగు జోన్లలో రోడ్ల టెండర్లకు రూ.9,699 కోట్లు, ట్రంక్ రోడ్లకు రూ.7794 కోట్లు ఖర్చు చేసేందుకు సిఆర్డిఏ ఆమోదం లభించినట్లు మంత్రి వివరించారు. మొత్తానికి అయితే ఏపీ అసెంబ్లీ దేశంలోనే ఆదర్శంగా, ఆకర్షణీయంగా నిలవనుందన్నమాట.

# ఈ కాలంలో ఆధ్యాత్మికం ఎందుకని ప్రశ్న

## చాగంటికి వ్యతిరేకంగా 30 మంది లేఖ

విజయవాడ, డిసెంబర్ 18, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు కూటమి ప్రభుత్వం కీలక పదవి కట్టబెట్టిన సంగతి తెలిసిందే.పాఠశాల విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు సలహాదారుగా నియమించింది. ఏకంగా క్యాబినెట్ హోదా కట్టబెట్టింది.అయితే ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందన్న హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. అయితే గతంలో ప్రభుత్వ పదవులు తీసుకునేందుకు చాగంటి ఇష్టపడేవారు కాదు.వచ్చిన అవకాశాలను సైతం తిరస్కరించిన సందర్భాలు ఉన్నాయి.అయితే ఈసారి మాత్రం ఆయన సమ్మతించారు. విద్యార్థులకు అవసరమైన సలహాలు సూచనలు అందిస్తానని చెప్పుకొచ్చారు. అయితే చాగంటి కి సలహాదారుడుగా నియమించడం నిరాశ కలిగించిందంటూ ఓ 30 మంది ప్రముఖులు సీఎం చంద్రబాబుకు లేఖ రాయడం విశేషం. ఈ నియామకం విషయంలో మరోసారి పునరాలోచించాలని కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయనను రాష్ట్ర నైతిక విలువల సలహాదారుగా నియమించడంపై కొత్త చర్చ మొదలైంది. ఆధ్యాత్మిక ప్రవచనకర్తను విద్యా విలువల సలహాదారుగా నియమించడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ అధ్యక్షతన ఆన్ లైన్ సమావేశం నిర్వహించారు. చాగంటి నియామకం పై చర్చలు జరిపారు. ఈ నియామకం పై పునరాలోచన చేయాలని కోరుతూ సమావేశంలో పాల్గొన్నవారు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.జగన్ ప్రభుత్వ హయాంలో టీటీడీ ఆగమ సలహాదారుగా చాగంటి నియమించారు. అప్పట్లో ఆ పదవిని సున్నితంగా తిరస్కరించారు చాగంటి. జగన్ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించి చాగంటి నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ప్రచారం నడిచింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సలహాదారుడుగా నియమించింది. దీంతో ఆ పదవి చేపట్టేందుకు చాగంటి కోటేశ్వరరావు అంగీకరించారు. అయితే చంద్రబాబు సర్కార్ మంచి విధానాలతోనే చాగంటి ఈ పదవి తీసుకునేందుకు ఒప్పుకున్నారు అన్న ప్రచారం ఉంది. సరిగ్గా ఈ సమయంలోనే 30 మంది ప్రముఖులు లేఖ రాయడం విశేషం. సినీ దర్శకుడు ఉమామహేశ్వరరావు, న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులుదీనిపై పెద్ద ఎత్తున చర్చ జరిపారు. ఏకంగా సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. అందులో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు.కూటమి ప్రభుత్వం ఆధునిక ఆంధ్రప్రదేశ్ ను నిర్మిస్తుందని ఆశిస్తున్నతమకు చాగంటి నియామకం ఆశ్చర్యపరిచిందన్నారు.నైతిక విలువల కోసం ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటిని సలహాదారుడుగా నియమించడం ఏంటని ప్రశ్నించారు. విద్యా వైజ్ఞానిక సామాజిక రంగాల్లో చిరకాలంగా పనిచేస్తున్న తాము ఈ లేఖ ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నట్లు పేర్కొన్నారు. మానవుడు ప్రకృతి రహస్యాలను ఒక్కో దాన్ని గుప్పెట్లోకి తెచ్చుకొని.. అంతరిక్షపు అంచులకు చేరుకుంటున్న కాలంలో మనం ఉన్నామని వివరించారు. ఇటువంటి సమయంలో పురాణ యుగంలోకి తీసుకెళ్లే చాగంటి లాంటి వ్యక్తులు ఎలా నైతిక విలువలు పెంపొందించగలరని ప్రశ్నించారు. అయితే ఈ ప్రముఖుల లేఖను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందా? చాగంటి విషయంలో పునరాలోచన చేస్తుందా? అన్నది తెలియాల్సి ఉంది.

# కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తారా...

హైదరాబాద్, డిసెంబర్ 18, వంత్ సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారుకు ఏడాది నిండింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో చాలా వరకు సంతృప్తి వ్యక్తమవుతోంది. కానీ.. కొందరు చేసే పొలిటికల్ కామెంట్స్ రచ్చ చేస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాంగ్రెస్ నేతలు కేసీఆర్ ఆనవాళ్ల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.కేసీఆర్.. తెలంగాణ మలిదశ పోరాటంలో కీలకంగా వ్యవహరించిన నేత. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్ర ఎంతో కీలకం. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన కృషి ఎన్నో మంచి ఫలితాలను ఇచ్చిందనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే.. కేసీఆర్ తీసుకున్న రాజకీయ నిర్ణయాలు, ఇతర కారణాల వల్ల ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారు. కానీ ఇప్పటికీ కేసీఆర్ అంటే తెలంగాణ, తెలంగాణ అంటే కేసీఆర్ అనే భావన చాలామందిలో ఉంది.ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. ఐదేళ్లు పాలించమని, ఇచ్చిన హామీలు నేరవేర్చమని ఎన్నికల్లో గెలిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. అటు హామీల అమలు, ప్రభుత్వ పనితీరుపై చాలావరకు ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. కొన్ని హామీలు అమలు ఆలస్యం అయినా.. మున్ముందు చేస్తారులే అనే భావన ప్రజల్లో ఉంది.ఇక్కడిదాకా బాగానే ఉన్నా.. అసలు సమస్య ఈమధ్యనే మొదలైంది. తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మారిపోయాయి. దీన్ని బీఆర్ఎస్ గట్టిగా వ్యతిరేకించింది. అంతే స్థాయిలో కాంగ్రెస్ తిప్పికొట్టింది. కానీ.. కాంగ్రెస్ నేతలు మరో అడుగు ముందుకేసి ఓ కీలకమైన కామెంట్ చేశారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని.. కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉండే నేతలు వ్యాఖ్యానించారు.ఈ కామెంట్స్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి కష్టాలను తీసుకొస్తున్నాయని.. రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ లీడర్లు ఇష్యూపై మాట్లాడి.. విమర్శలు చేస్తే బాగుండేదని.. అనవసరంగా కేసీఆర్ ఆనవాళ్ల అంశాన్ని నెత్తిన వేసుకున్నారని.. అదే పార్టీకి చెందిన నేతలు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదే అయ్యింది. ఈ ఏడాదిలో మహిళలకు ఫ్రీ బస్సు మినహా.. కాంగ్రెస్ పేరు చెబితే ఇంకేం గుర్తుకురావు అనే అభిప్రాయాలు ఉన్నాయి.కానీ.. కేసీఆర్ పేరు చెబితే.. ఇప్పుడున్న సచివాలయం, అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం, హైదరాబాద్‌లో రోడ్ల అభివృద్ధి, జిల్లాల్లో కలెక్టరేట్లు, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి ఉచిత కరెంట్.. ఇలా ఎన్నో పథకాలు గుర్తోస్తాయి. అన్నింటికి మించి.. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాడనే పేరుందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.కేసీఆర్ హయాంలో ఉన్న పథకాల్లో అక్రమాలు జరిగాయా లేదా అనే విషయంపై విమర్శలు చేస్తే బాగుండేది. కానీ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని మాట్లాడటం సరికాదు. గతంలో కేసీఆర్ ఇలానే హేళనగా మాట్లాడి, ఇతర పార్టీల నాయకులను చులకనగా మాట్లాడి నష్టపోయారు. ఇప్పుడు మా కాంగ్రెస్ పార్టీ వాళ్లు అదే చేస్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు లాంటి వారిని విమర్శించినా పెద్దగా నష్టం ఉండదు. కానీ.. కేసీఆర్ గురించి మాట్లాడేటప్పుడు కాస్త ఆలోచించుకొని విమర్శలు, ఆరోపణలు చేస్తే బాగుంటుంది' కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు.కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోయినా.. తెలంగాణలో ఆయనకున్న గుర్తింపు, పేరు తగ్గదు. పక్క రాష్ట్రాల్లో కొందరు నాయకులు చేసిన వ్యాఖ్యల వల్ల ప్రజాగ్రహానికి గురయ్యారు. అలాంటి ఉదాహరణలు మన కళ్ల ముందే ఉన్నాయి. కాబట్టి కేసీఆర్‌పై మాట్లాడేటప్పుడు కాస్త ఓపికతో మాట్లాడాలి. నేరుగా కేసీఆర్ ఏదైనా కామెంట్ చేస్తే.. దానికి సమాధానం చెప్పడం, కౌంటర్ ఇవ్వడం వరకు బాగానే ఉంటుంది. కానీ.. ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు బదులుగా.. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామనడం కరెక్ట్ కాదు అనేది నా అభిప్రాయం' ఆ సీనియర్ నేత చెప్పారు.

# యువకుడి దారుణ హత్య

## అక్రమ సంబంధమే కారణమని అనుమానం

వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ సమీపంలో యువకుడు రషీద్ దారుణ హత్యకు గురయ్యాడు. కత్తులతో పొడిచి నరికి చంపారు. అక్రమ సంబంధమే హత్య కు కారణమనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వేములవాడ మండలం కోనాయిపల్లి కి చెందిన రషీద్ గత కొంత కాలంగా వేములవాడ లో ఉంటూ గంగాధరలో డాక్యుమెంట్ రైటర్ గా పనిచేస్తున్నాడు. నివాసం ఉంటున్న కాలనీ చెందిన మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ మహిళ భర్త దుబాయిలో ఉంటుండగా, వారం రోజుల క్రితమే వేములవాడకు వచ్చాడు. ఈ నేపథ్యంలో గత రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులతో వేములవాడ శివార్ లోని నిర్మానుష ప్రాంతంలో రషీద్ హత్యకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు బోరున విలపిస్తు ఎవరు చంపారో తెలియదు అంటున్నారు. హత్య సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ఫుట్ పాత్ ఆక్రమణల కూల్చివేత

రాజేంద్రనగర్ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఫుట్ పాత్ లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై జీహెచ్ ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. లక్ష్మీగూడ నుంచి వాంబే కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ లను ఆక్రమించి వేసిన డబ్బాలు , షెడ్లను రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది జేసీబీ ల సాయంతో కూల్చివేశారు.లక్ష్మీగూడ నుంచి వాంబే కాలనీ వరకు పోలీస్ బందోబస్తు నడుమ ఈ కూల్చివేతలు కొనసాగాయి.అయితే ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఫుట్ పాత్ కు సంబంధం లేని వాటిని కూడా కూల్చివేశరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆసుపత్రిలో రాత్రి గడిపిన జంట

నిర్మల్ భైంసా పట్టంలోని ఏరియా ఆసుపత్రి గది లో ఒక జంట రాత్రి గడిపింది. అందులో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికురాలు రాత్రి ఓ వ్యక్తిని ఆసుపత్రి గదికి పిలిపించుకుంది. విషయం అతని భార్య కు తెలియడంతో ఆసుపత్రికి చేరుకుని ఆమెను(పరిశుధ్య కార్మికురాలు ) బయటకు పంపించి భర్తను గదిలోనే ఉంచి తాళం వేసింది. అక్కడే బైఠాయించి ఆందోళన చేసింది. అనంతరం ఆసుపత్రి సిబ్బంది తాళం తీయగా భర్త పరారయ్యాడు. గతంలో ఇదే ఆసుపత్రిలో ఇలాంటి తరహా ఘటనలు జరగగా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నరని బాధితురాలు ఆరోపించింది.

## స్కూల్ బస్సు కింద పడి రెండేళ్ల చిన్నారి మృతి

నెల్లూరు కందుకూరు మండలంలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. అనంతసాగరం గ్రామానికి చెందిన గోగినేని శ్రీకాంత్-నాగమణి దంపతులకు భార్గవ్, మోక్షజ్ఞ (2) ఇద్దరు కుమారులు. భార్గవ్ కందుకూరులోని ఓ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. రోజులాగే భార్గవ్‌ను స్కూల్ బస్సు ఎక్కించేందుకు తల్లితో పాటే వెళ్లిన మోక్షజ్ఞ వాహనం టైరు కింద పడి నలిగిపోయాడు. కొడుకు మృతదేహాన్ని పట్టుకుని తల్లిదండ్రులు విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది...

# మద్యం ఆదాయం 20 వేల కోట్లు దాటేసింది

హైదరాబాద్, డిసెంబర్ 18, తెలంగాణలో మద్యం విక్రయాలతో ప్రభుత్వ ఖజానాకు 8 నెలల్లో రూ.20,903.13 కోట్ల ఆదాయం సమకూరినట్లు అబ్కారీ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు ఎక్సైజ్ శాఖకు మద్యం అమ్మకాలపై రెవెన్యూ రూపేణా రూ.10,285.58 కోట్లు విలువ ఆధారిత పన్ను రూపంలో రూ.10,607.55 కోట్లు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అసెంబ్లీలో ప్రకటించింది.తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు కేపీ వివేకానంద, హరీశ్ రావు, కౌశిక్ రెడ్డి, అనిల్ జాదవ్‌లు అడిగిన ప్రశ్నలకు అబ్కారీ శాఖ సమాధానం ఇచ్చింది. బెల్టు షాపులు ఎన్ని ఉన్నాయని సభ్యులు అడిగిన ప్రశ్నకు.. రాష్ట్రంలో బెల్ట్ షాపులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేదని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది.అక్రమ మద్యం విక్రయాలను కట్టడి చేస్తున్నామని, ఎక్సైజ్ చట్టాల ప్రకారం ఎప్పటికప్పుడు అనధికారిక మద్యం విక్రయా లపై కేసులు నమోదు చేస్తున్నామని సభలో ప్రకటించింది. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు నాటికి అనధికారిక విక్రయాలపై 6,915 కేసులు నమోదు చేశామని వివరించారు. ఈ కేసుల్లో 6,728 మందిని అరెస్టు చేయడంతో పాటు 74,425 లీటర్ల మద్యం 353 వాహనాలను జప్తు చేసినట్లు వెల్లడించారు. మద్యపాన దుష్ప్రభావాలు, మత్తు పదార్థాల దుర్వినియోగంపై తెలంగాణలో 735 అవగాహన సదస్సులు నిర్వహించారు.2023-24 ఆర్థిక సంవత్సరంలో మద్యం విక్రయాలతో ఏపీలో ఎక్సైజ్ శాఖకు దాదాపు 36వేల కోట్ల రుపాయల ఆదాయం సమకూరింది. అన్ని రకాల ఖర్చులు మినహాయించగా దాదాపు రూ.30వేల కోట్లకు పైగా ఆదాయం ప్రభుత్వానికి లభించింది. 2019-24 మధ్య ఏపీలో మద్యం ధరల్ని గణనీయంగా పెంచడంతో పాటు ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలను నిర్వహించడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం లభించింది.అక్టోబర్ 16 నుంచి ఏపీలో ప్రైవేట్ మద్యం దుకాణాలు ప్రారంభం అయ్యాయి. అక్టోబర్ 16 నుంచి డిసెంబర్ 9 వరకు రూ.4,677 కోట్ల వ్యాపారం జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. 55 రోజుల వ్యవధిలో 61.63 లక్షల కేసుల లిక్కర్, 19.33 లక్షల కేసుల బీర్లు విక్రయించినట్టు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. వైసీపీ హయాంలో ప్రభుత్వమే స్వయంగా మద్యం షాపులు నిర్వహించింది. అయితే కూటమి సర్కార్ ఆ విధానానికి స్వస్తి పలికింది. రెండేళ్ల పాటు అమల్లో ఉండే కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం...ప్రైవేట్ లిక్కర్ షాపులకు టెండర్లు పిలిచి 3,300 లిక్కర్ షాపులు ఏర్పాటు చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా 3,300 లిక్కర్ దుకాణాల టెండర్ల రూపంలో ప్రభుత్వానికి దాదాపు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూరింది. అక్టోబర్ 16వ తేదీ నుంచి నూతన మద్యం షాపులు ప్రారంభం అయ్యాయి. అయితే నిబంధనల ప్రకారం షాపులు పాడుకున్న యజమానులకు 20 శాతం కమిషన్ ఇవ్వాలి. అయితే ఇంకా పాత మద్యమే విక్రయిస్తున్నట్లు చెబుతున్న ఎక్సైజ్ శాఖ...కమిషన్ తక్కువగా ఇస్తుంది. ఇప్పటికైనా 20 శాతం కమిషన్ ఇవ్వాలని మద్యం షాపుల యజమానుల నుంచి ఒత్తిడి వస్తుంది.20 శాతం కమిషన్ ఇవ్వకుంటే నష్టాలు వస్తాయని మద్యం దుకాణాలు యజమానులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, బార్లలో కలిపి అక్టోబర్ 16వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు రూ.4,677 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. రానున్న రోజుల్లో లిక్కర్ సేల్స్ మరింత పెరిగే అవకాశం ఉంది. క్రిస్టమస్, సంక్రాంతి సీజన్ కావడంతో లిక్కర్ సేల్స్ మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

# ఆటో కార్మికుల పై బీఆర్ఎస్ రాజకీయ డ్రామా

## మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఆటో కార్మికుల పైన మొసలి కన్నీరు కారుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆటో కార్మికుల పై మీకు చిత్తశుద్ధి ఉంటే మీ ప్రభుత్వం ఉన్న 10 సంవత్సరాల్లో వారి సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు ఏంటి...? చెప్పాలి. మెట్రో వస్తే ఇతర వాటిపై ప్రభావం పడిందని మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తే ఆటో ల పై ప్రభావం పడిందని ఆరోపణ తప్పు. బస్సు ప్రయాణికుల ఇంటికి వెళ్లడం లేదు. గతంలో లాగానే బస్సు స్టాండ్ నుండి పోతుందని అన్నారు.

ప్రజలు ఇంటి దగ్గర నుండి బస్సు స్టాండ్ కి వెళ్ళడానికి ఆటో లను వాడుతున్నారు . ఎన్నికలలో ఆటో కార్మికులకు 12 వేలు సంవత్సరానికి ఇస్తామని అన్నాం. మీ నిర్వాకం వల్ల ఆర్థిక సంక్షోభం వల్ల ఈ సంవత్సరం ఇవ్వలేకపోయామ్. భవిష్యత్ లో ఆటో కార్మికులను ఆదుకునే బాధ్యత మా ప్రభుత్వానికి ఉంది. ఆటో కార్మికులు వేసుకునే డ్రెస్ లు వేసుకోవడం నిన్న బేడీలు వేసుకొని వేషాలు వేయడం రాజకీయ డ్రామా అని అన్నారు. అటువంటివి చేయకండి. మీకు ఏమైనా చిత్తశుద్ధి ఉంటే ఏనాడయినా రవాణా శాఖ మంత్రి కి ఆటో కార్మికుల సమస్యల పై రిప్రెజెంటేషన్ చేసారా. రాజకీయాల కోసం నిరసనలు చెప్పడం కోసం ప్రజాస్వామికంగా ఆటో కార్మికుల ను తీసుకుని రండి ఆటో కార్మికుల సమస్యల పై చర్చిద్దామని అన్నారు.

## ఆదిలాబాద్ కవ్వాల్ అభయారణ్యంలో విదేశీ పక్షుల సందడి,

అదిలాబాద్, డిసెంబర్ 18,ఉమ్మడి ఆదిలాబాద్ లోని కవ్వాల్ అటవీ ప్రాంతంలో ప్రకృతి అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల బర్డ్, బటర్ ఫ్లై వాక్ నిర్వహించారు. కాగా అడవిలో పలు అరుదైన పక్షులు పర్యటకులను కనువిందు చేశాయి.కవ్వాల్ టైగర్ జోన్లోని జన్నారం అటవీ డివిజన్లో పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పక్షి ప్రేమికులు వాటిని తిలకించేందుకు అటవీశాఖ అధికారులు బర్డ్ వాక్ పేరిట అవకాశం కల్పిస్తున్నారు. రెండేళ్లుగా ఫిబ్రవరిలో బర్డ్వాక్ నిర్వహించగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి అనేక మంది పక్షి ప్రేమికులు వచ్చి పక్షులను తమ కెమె రాల్లో బంధించు కుంటున్నారు.జన్నారం అటవీ డివిజన్ లోని కల్పకుంట, బైసన్ కుంట, మైసమ్మకుంట, తదితర ప్రాంతాల్లోని అడవుల్లో వివిధ రకాల పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి.

విదే శాల నుంచి వచ్చిన పక్షులు కూడా ఇక్కడ కనిపి స్తాయి. ఎప్పుడూ చూడని అరుదైన పక్షులకు ఆవాసంగా జన్నారం అటవీ డివిజన్ ఉంది. అధి కారులు, సిబ్బంది పక్షుల రకాలు, వాటి శాస్త్రీయ నామాలు, వివరాలు తెలుసుకునేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి కవ్వాల్ టైగర్ జోన్లోని జన్నారం అటవీ డివిజన్ ను పక్షు లకు కూడా ఆవాసంగా గుర్తించారు.రెడ్ రీసెల్డ్ ల్యాప్ విగ్, వైట్ ఐ బెజార్డ్, ఫైడ్ కింగ్ ఫిషర్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్ వంటి పక్షులు కనిపించాయని అధికారులు అటవీ శాఖ అధికారులు తెలిపారు.కావ్వాల్ లో పక్షులను చూసేందుకు తమ కెమెరాల్లో బంధించేందుకు ఫోటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో వస్తున్నందున అటవీ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. పక్షులని తమ కెమెరా లో బందించేందుకు తదితర ప్రాంతాల నుండి మహారాష్ట్ర, కాకినాడ, హైదరాబాద్, వరం గల్, కరీంనగర్, తదితర ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు, ఫొటోగ్రాఫర్లు వచ్చి తమ కెమెరా లో బందిస్తున్నారు.రాత్రి అక్కడే ఉండి ఉదయం పక్షులను తిలకించే వీలు కల్పిస్తు న్నారు. ఉదయం బర్డ్వాక్ చేసు కునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసి వారి అనుభవాలను తెలుసుకుంటున్నారు.

ఈ సందర్భంగా అడవుల్లో రెడ్ రీసెల్డ్ ల్యాప్ విగ్, వైట్ ఐ బెజార్డ్, ఫైడ్ కింగ్ ఫిషర్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్ వంటి పక్షులు కనిపించాయని కవ్వాల్ పర్యాటకులను ఆకర్షిస్తోందని అధికారులు తెలిపారు.

బర్డ్వాకా ఫెస్టివల్ కు వచ్చే ప్రకృతి ప్రేమికులకు అటవీశాఖ అధికారులు మంచి ఆతిథ్యం ఇస్తున్నారు. నేచర్ ఎంజాయ్ చేసే విధంగా వచ్చిన వారికి జన్నారం అటవీ డివిజన్ లోని బైనన్ కుంట, ఇండన్ పల్లి రేంజ్ లోని బర్డ్నేట్ బేస్ క్యాంపులో డేరాలు ఏర్పాటు చేసి అందులో బస చేసే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు

## సిరిసిల్ల కార్మికులకు పొంగల్ సందడి

కరీంనగర్, డిసెంబర్ 18, వస్త్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి దొరికింది. సాంచల్ బంద్ అయి ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న నేతన్నకు తమిళనాడు బాసటగా నిలిచింది. పొంగల్ చీరల ఆర్డర్ ఇచ్చి నేతన్నకు చేతినిండా పని కల్పించింది. వస్త్ర పరిశ్రమ నిలయమైన సిరిసిల్ల సాంచల చప్పుడుతో సందడిగా మారింది.ఏడాది కాలం ఉపాధి లేమితో సిరిసిల్ల నేత కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారు. వారికి కాస్త ఊరటనిచ్చేలా తమిళనాడు ప్రభుత్వం భారీ ఆర్డర్ ఇచ్చింది. వచ్చే నెల జనవరి లో జరిగే పొంగల్ పండుగను తమిళ ప్రజలు వైభవంగా జరుపుకుంటారు. అక్కడి ప్రభుత్వం మహిళలకు పొంగల్ కానుకగా చీరలను అందజేయనుంది. అందుకు కావాల్సిన చీరల ఆర్డర్ ను తమిళ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు ఇచ్చింది. దీంతో నేతన్నలకు చేతినిండా పని దొరికింది. తమిళనాడు చీరల ఆర్డర్ తో సిరిసిల్ల నేతన్నల ఇంటా ముందస్తు సంక్రాంతి శోభ సంతరించుకుంది.తమిళనాడు ప్రభుత్వం ప్రతి సంవత్సరం సంక్రాంతి (పొంగల్) పండుగకు పేదలకు చీరలను పంపిణీ చేస్తుంది. ఈసారి 3.12 కోట్ల చీరలు, పంచెల ఉత్పత్తికి రూ.485.25 కోట్లు కేటాయించింది. అందులో1.56 కోట్ల చీరలు ఉన్నాయి. ఇవి తమిళనాడు లోని తిరుపూర్, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్ ప్రాంతాల్లోని మరమగ్గాలకు ఆర్డర్లు ఇవ్వగా.. సమయం తక్కువగా ఉండడంతో పండుగకు సకాలంలో చీరలు కావాలని టెండర్ల ద్వారా సిరిసిల్ల కు ఆర్డర్లు ఇచ్చారు.11 లక్షల మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి అర్డర్లు (సుమారు 2 లక్షల చీరలు) రావడంతో నేత కార్మికులకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు చీరలు ఉత్పత్తి చేయడం ద్వారా నెల రోజులపాటు కార్మికులకు ఉపాధి లభిస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు తరహాలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నేతన్నలను ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా కోటి 30 లక్షల చీరెలు ఆర్డర్లు ఇచ్చి ఆదుకోవాలని పాలిస్టర్ బట్ట తయారు చేస్తే కనీస గిట్టు బాటు కావడం లేదని ప్రభుత్వమే కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నారు.తమిళనాడు ప్రభుత్వానికి అవసరమైన చీరల ఉత్పత్తితో సిరిసిల్లతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో చీరల సందడి నెలకొంది. సిరిసిల్లతోపాటు చంద్రంపేట, తంగళ్ళపల్లి, రాజీవ్ నగర్, గంగాధర మండలం గర్షకుర్తి ప్రాంతాల్లో తమిళనాడు చీరల ఉత్పత్తి చేస్తూ నేతన్నలు ఉపాధి పొందుతున్నారు. ఒక్క మీటరు బట్ట నేసి ఇస్తే రూ.6 ఇస్తున్నారు. అదే లేబర్ కు ప్రతీ మీటరుకు రూ.2.50 చెలిస్తారు. సాంచాలపై ఉత్పత్తి చేసిన బట్ట ఆధారంగా ఆసామికి, కార్మికుడికి కూలి లభిస్తుంది.సిరిసిల్లలో గతంలో తెల్లని పాలిస్టర్ బట్టను మాత్రమే ఉత్పత్తి చేసే నేత కార్మికులు పవర్ లూమ్స్ పై టెక్నాలజీ జోడించి వివిధ డిజైన్ లో బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగారు. మగ్గాలకు జకార్డ్, దాబీలను అమర్చుకొని కొంగు, చీరల బార్డర్, అంచుల్లో రకరకాల పలు రంగులను కలిపి అందమైన చీరలు నేశారు.

# కేటీఆర్ మెడపై వేళాడుతున్న కత్తి



హైదరాబాద్, డిసెంబర్ 18, ఎముకలు కొరికే చలిలో.. తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. తెలంగాణ రాజకీయం అతి త్వరలో ఊహించని మలుపు తిరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందుకు కారణం.. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారం. ఈ కేసులో కేటీఆర్‌ను విచారించి, అరెస్టు చేస్తారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్టు చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో కేటీఆర్‌ను తెలంగాణ ఏసీబీ ప్రశ్నించి అరెస్టు చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ కీలక నేతలు పదేపదే వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా.. కేటీఆర్‌పై కేసు నమోదు చేయడానికి గవర్నర్ అనుమతి ఇచ్చారని.. అతి త్వరలోనే దీనిపై సీఎస్ నుంచి అధికారిక ఆదేశాలు ఏసీబీకి వెళ్తాయని అంటున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ వ్యవహారానికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

1.ఫార్ములా ఈ కార్ రేసు కేసులో కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు. గవర్నర్ అనుమతిని ఏసీబీకి పంపాలని కేబినెట్ నిర్ణయించింది. దీంతో కేసు నమోదు, విచారణ వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

2.ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి.. అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ ఒప్పందం చేసుకోవడం, ఆర్‌బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించడంతో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఏసీబీ కేసు నమోదు చేసింది.

3.డబ్బుల చెల్లింపు, కార్ రేసు వ్యవహారంలో కేటీఆర్, అప్పటి పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, చీఫ్ ఇంజినీర్ పైన ఆరోపణలు ఉన్నాయి.

4.కేటీఆర్ మినహా.. మిగతా అధికారులపై విచారణకు ప్రభుత్వం గతంలోనే అనుమతి ఇచ్చింది. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ నుంచి అనుమతి కోరగా.. తాజాగా అనుమతి లభించింది.

5.కేటీఆర్‌పై కేసు నమోదుకు సంబంధించి అటార్నీ జనరల్ అభిప్రాయం తీసుకుని గవర్నర్ అనుమతి ఇచ్చారని సమాచారం. ఇదే విషయాన్ని మంత్రులకు రేవంత్ రెడ్డి చెప్పినట్టు తెలిసింది.

6.కేటీఆర్‌పై కేసు నమోదు అంశంపై చర్చ సందర్భంగా.. కీలక విషయాలు తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా కేటీఆర్‌ను అరెస్టు చేస్తే.. రాజకీయంగా నష్టమా.. లాభమా అనే చర్చ జరిగినట్టు సమాచారం.

7.కేటీఆర్‌పై కేసు, అరెస్టు వార్తల నేపథ్యంలో.. బీఆర్ఎస్ అలర్ట్ అయ్యింది. ఒకవేళ కాంగ్రెస్ నేతలు చెప్పేదే జరిగితే.. ఎలా ముందుకెళ్లాలని కారు పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

8.కేసు, అరెస్టు కామెంట్స్‌పై కేటీఆర్ ఇటీవల స్పందించారు. తాను దేనికైనా సిద్ధంగా ఉన్నానని, కేసులకు భయపడబోనని స్పష్టం చేశారు. కార్ రేసుకు సంబంధించి పూర్తి బాధ్యత తనదేనని, అధికారుల పాత్ర లేదని చెప్పారు.

9.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కేటీఆర్‌ను టార్గెట్ చేశారని, రాజకీయంగా ఎదుర్కోలేక కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కేటీఆర్‌ను జైలుకు పంపడమే రేవంత్ లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపిస్తోంది.

10.కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు కేటీఆర్‌పై కేసు నమోదు, అరెస్టు వంటి పరిణామాలను వ్యతిరేకిస్తున్న తెలిసింది. ఇష్యూ ఏదైనా.. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే.. సింపతి మైలేజ్ బీఆర్ఎస్ పార్టీకి వెళ్తుందని, కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు తప్పవని.. హస్తం పార్టీ ఎమ్మెల్యే ఒకరు చెప్పారు.

# కరీంనగర్ జిల్లా నుంచి కవిత పోటీ



కరీంనగర్, డిసెంబర్ 18, వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే బీఆర్ఎస్ పార్టీ రెడీ అవుతోందా? నియోజకవర్గాల ఎంపికలో పెద్దాయన నిమగ్నమయ్యారా? పార్టీని నమ్ముకున్న నేతలకు ఇప్పటికే నియోజకవర్గాలు కేటాయించే పనిలో పడ్డారా? ఈసారి లోక్‌సభకు బదులు అసెంబ్లీ నుంచి కవిత బరిలోకి దిగుతున్నారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.ముందస్తు ఎన్నికలు సూచనతో బీఆర్ఎస్ అలర్ట్ అయ్యింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు-2014 ప్రకారం.. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. ఇంతకీ సీట్లు ఈసారి ఎక్కడ పెరుగుతున్నాయి? జీహెచ్ఎంసీ పరిధిలో పెరుగుతున్నాయా? లేక మిగతా నియోజకవర్గాల్లో పెరుగుతున్నాయా? ఇదే చర్చ బీఆర్ఎస్ నేతల్లో మొదలైంది. అసెంబ్లీ లాబీల్లో మాట్లాడిన మంత్రులు ఈసారి తెలంగాణలో 34 అసెంబ్లీ సీట్లు పెరుగుతున్నాయని మీడియా చిట్‌చాట్‌లో చెప్పుకొచ్చారు. ఏయే ప్రాంతాల్లో సీట్లు పెరుగుతున్నాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సీట్లు పెరుగుతున్నట్లు ఓ అంచనా.ఎందుకంటే తెలంగాణలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు హైదరాబాద్ నగరానికి తరలివస్తున్నారు. దీంతో సిటీ జనాభా పెరుగుతోంది. దీనికితోడు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చినవారు ఇక్కడే ఉండడంతో జీహెచ్ఎంసీ పరిధిలో సీట్లు పెరుగుతున్నట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు ఎంపిక కేసీఆర్ మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. మరి కవిత ఎక్కడి నుంచి పోటీ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. లోక్‌సభ బరిలో దిగుతున్నారా? లేక అసెంబ్లీ నుంచి తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారా? అన్న చర్చ బీఆర్ఎస్‌లో మొదలైపోయింది.ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి బరిలోకి దిగాలని ప్లాన్ చేస్తున్నారట కవిత. అందుకు సంబంధించి తెర వెనుక చకచకా పనులు చేస్తూ వెళ్లిపోతున్నారు. జగిత్యాల నుంచి గతంలో గెలిచిన సంజయ్.. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో అక్కడి నుంచే అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు.జగిత్యాల నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలుపొందారు డాక్టర్ సంజయ్. ఆయనను రాజకీయాల్లోకి తీసుకురావడం, గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారట కవిత. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ జోరు కొనసాగినా, జగిత్యాలలో మాత్రం కారు పట్టు నిలుపుకోవడం వెనుక కవిత ఉందని ఆ పార్టీ లోకల్ కేడర్ బలంగా నమ్ముతోంది.సంజయ్ వెళ్లిన తర్వాత అక్కడ ఆ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జ్ ఎవరినీ నిలబెట్టలేదు బీఆర్ఎస్. దీంతో కవిత ఆ నియోజకవర్గంపై ఫోకస్ చేసినట్టు కేడర్ మాట. ఆ నియోజకవర్గంలో వరుసగా కార్యక్రమాలు చేపట్టడం ఇదే కారణమని అంటున్నారు.రాజకీయాల్లో కవిత యాక్టివ్ అయిన తర్వాత ర్యాలీ, మీటింగ్ అక్కడే తొలుత పెట్టారు. నాటి తెలంగాణ తల్లి విగ్రహానికి అక్కడే శంకుస్థాపన చేశారామె. మండలిలో ఆ నియోజకవర్గం నుంచే ప్రధానంగా మాట్లాడుతున్నారట. మొత్తానికి అన్నీ పనులు అక్కడి నుంచే మొదలుపెడుతున్నారట కవిత.

# 2 నెలల అమెరికా టూర్ కు కేసీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 18, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఏడాది నుంచి ఫామ్‌హౌస్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. పార్టీ మీటింగ్‌లు ఉన్నా.. ముఖ్యనేతలతో మాట్లాడాల్సిన అవసరమొచ్చినా.. తన ఫామ్‌హౌస్‌కే పిలిపించుకుంటున్నారు తప్పా.. ఫామ్‌హౌస్ గేట్ కూడా దాటడం లేదు. కానీ ఇప్పుడు ఉన్నట్టుండి కేసీఆర్ విదేశీ టూర్‌కు వెళు న్నట్లు ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ తన లైఫ్‌లో ఫస్ట్ టైమ్ అమెరికాకు వెళ్లనున్నారని తెలుస్తోంది.నిజానికి రాజకీయ నాయకులు తరచూ విదేశాల్లో పర్యటిస్తుంటారు. అందులోనూ అధికారంలో ఉంటే.. ఇక ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ సదస్సు, ఆ సదస్సు అనో.. లేక అక్కడి అభివృద్ధిని అధ్యయనం చేసేందుకనో చెప్పి విమానాలెక్కి విదేశాల్లో వాలిపోతారు. కానీ.. కేసీఆర్ మాత్రం అందుకు పూర్తి భిన్నమనే చెప్పాలి.సుదీర్ఘ కాలం ఉద్యమకారుడిగా ఉన్నా.. సుమారు 35 ఏళ్లకు పైగా రాజకీయాల్లో కొనసాగుతున్నా.. కేసీఆర్ కేవలం రెండు సార్లు మాత్రమే ఫారిన్ టూర్‌కి వెళ్లారు. సీఎం హోదాలో ఓసారి సింగపూర్, మరోసారి చైనాకు వెళ్లారంతే.. అంతకుమించి కేసీఆర్ దేశం దాటింది లేదు. దేశంలోనే అత్యంత తక్కువ విదేశీ పర్యటనలు చేసిన ముఖ్యమంత్రిగా, పొలిటికల్ లీడర్‌గా కేసీఆర్ నిలిచారు.ఏడాది కాలంగా ఫామ్ హౌజ్ దాటని కేసీఆర్.. ఇప్పుడు ఉన్నట్లుండి అమెరికాకు ఎందుకు వెళ్తున్నారని రాజకీయవర్గాల్లో సామాన్యుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటు బీఆర్ఎస్ నేతలు సైతం తమ అధినేత అమెరికాకు ఎందుకు వెళ్తున్నారని ఆరా తీస్తున్నారట. అవసరమైతే ఆయనతో పాటు తాము కూడా వెళ్లేందుకు కొందరు ముఖ్యనేతలు ప్రయత్నిస్తున్నారని సమాచారం.కేసీఆర్ కుమారుడు కేటీఆర్, కుమార్తె కవిత.. అమెరికాలోనే ఉన్నత విద్యలు చదివారు. కేటీఆర్ కొన్నాళ్లు అక్కడే ఉద్యోగం కూడా చేశారు. అయినా సరే.. కేసీఆర్ మాత్రం ఒక్కసారి కూడా అమెరికా ఫ్లైట్ ఎక్కింది లేదు. ప్రస్తుతం కేటీఆర్ కుమారుడు హిమాన్షు అమెరికాలో చదువుకుంటున్నాడు. ఐనా కేసీఆర్ ఎన్నడూ అమెరికా వైపు చూడలేదు.అలాంటి ఇప్పుడు సడన్‌గా ఈ ట్రిప్ ఏంటని అందరి డౌట్.. ఐతే ఇటీవల హిమాన్షు ఇండియా వచ్చినప్పుడు తాత కేసీఆర్‌ను అమెరికా రమ్మని కోరారట.. ఇంకా కొన్నాళ్లపాటు రెస్ట్ తీసుకోవాలని అనుకుంటున్న కేసీఆర్ తన మనవడి కోరికకు ఓకే చెప్పారని ఇన్‌సైడ్ టాక్.. తాత కేసీఆర్ వస్తే అక్కడ ఏయే ప్రదేశాలను చూడాలి, ఎక్కడెక్కడ పర్యటించాలనే టూర్ షెడ్యూల్ కూడా హిమాన్షు రెడీ చేశాడనేది టాక్..మరోవైపు అమెరికా తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సైతం కేసీఆర్‌ను అమెరికాకు అహ్వానించింది. ఈ మధ్యే ఫోరం చైర్మన్ లక్ష్మణ్‌తో కూడిన 15 మంది సభ్యుల బృందం ఎర్రవెల్లిలో కేసీఆర్‌ను కలిసి అమెరికాకు రావాలని కోరింది. దీంతో అమెరికాలోని తెలంగాణ ఎన్నారైలను కూడా కలవాలని కేసీఆర్ చాలా కాలంగా అనుకుంటున్నారట.అందుకే మనవడితో కొన్ని రోజులు ఉండటంతో పాటు అమెరికాలోని ఎన్నారైలతోనూ సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతంపై చర్చించాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఇందుకు తగ్గట్టుగా అక్కడున్న ఎన్నారైలతో పార్టీ వ్యవహారాలు, సమావేశాలు నిర్వహించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.మొత్తం రెండు నెలల పాటు కేసీఆర్ అమెరికా పర్యటన ఉండేలా షెడ్యూల్ ఫిక్స్ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఐతే ఏడాది కాలంగా కేవలం ఫామ్‌హౌస్ కే పరిమితమైన కేసీఆర్.. ఇప్పుడు అమెరికా పర్యటనకు వెళ్తే అధికార కాంగ్రెస్ సహా బీజేపీలు ఎలా రియాక్ట్ అవుతాయో చూడాలి మరి.

# నేడు గోవా విముక్తి దినం

## పోర్చుగీసు పాలన నుండి గోవా ను విముక్తి చేసిన భారత సాయుధ దళాలు




భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 19న గోవా విమోచన దినోత్సవాన్ని జరుపుకుంటారు. 450 సంవత్సరాల పోర్చుగీసు పాలన తరువాత 1961లో గోవాను భారత సాయుధ దళాలు విముక్తి చేసిన రోజును ఇది గుర్తు చేస్తుంది.1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు గోవా ఇంకా పోర్చుగీసు పాలనలో నే ఉంది. పోర్చుగీసు వారు గోవా, ఇతర భారత భూభాగాలపై తమ పట్టును వదులుకోవడానికి నిరాకరించారు. పోర్చుగీసుతో అనేక విఫల చర్చలు మరియు దౌత్య ప్రయత్నాలు తరువాత, భారత మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, సైనిక జోక్యం ఒక్కటే మార్గంగా నిర్ణయించారు.భారత నౌకాదళ సమాచారం ప్రకారం, భారత దళాలు స్వల్ప ప్రతిఘటనతో డిసెంబర్ 19న గోవా భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాయి మరియు పదవీచ్యుత గవర్నర్-జనరల్ మాన్యుయేల్ ఆంటోనియో వాసాలో ఇ సిల్వా ఈ ప్రాంతంలో పోర్చుగీసు పాలనను అంతమొందించడానికి లొంగుబాటు సర్టిఫికేట్ పై సంతకం చేశారు. దీంతో భారత్ పూర్తిగా పరాయి పాలన నుంచి విముక్తి పొందాడు. “గోవా, డామన్ మరియు డయ్యూ ప్రాంతాల విముక్తి కోసం భారత నౌకాదళం చేపట్టిన “ఆపరేషన్ విజయ్” లో 1961 డిసెంబర్ 19న తమ ప్రాణాలను త్యాగం చేసిన ఏడుగురు యువ నావికులు మరియు ఇతర సిబ్బంది జ్ఞాపకార్థం గోమంతక్ వద్ద భారత నౌకా నౌక గోమంతక్ వద్ద యుద్ధ స్మారకం నిర్మించబడింది”.గోవా విమోచన దినోత్సవం సందర్భంగా గోవాలో ఘనంగా ఉత్సవాలు, ఉత్సవాలు గోవాలో ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాల నుంచి టార్చ్ లైట్ ఊరేగింపు ను వెలిగించారు, చివరికి ఆజాద్ మైదాన్ లో అందరూ సమావేశం అయ్యారు. గోవా ను స్వాధీనం చేసుకోవడంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పిస్తారు.

# సంక్రాంతి నుంచి మరో రెండు హామీలు

నిజామాబాద్, డిసెంబర్ 18,సంక్రాంతి వస్తోంది. సంబరాలు తెస్తోంది. ఎటు చూసినా గ్రామాలు సందడి సందడిగా కనిపిస్తాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందమయ క్షణాల్లో ఉంటారు. అటువంటి సంక్రాంతి సంబరాలకు తెలంగాణ సర్కార్ సరికొత్త పథకాలతో సందడి చేయనుంది. సంక్రాంతి అంటేనే సందడి.. సంబరం.. అందుకే సీఎం రేవంత్ రెడ్డి, పేదల కుటుంబాల్లో కూడా ఆ సంబరాన్ని తెచ్చేందుకు పెద్ద ప్లాన్ వేశారు.తెలంగాణ సర్కార్ ఏడాది పాలనలో ఏం చేసిందంటే.. చాలానే చేసిందంటున్నారు ప్రజలు. అందుకు ఉదాహరణే మొన్న జరిగిన ప్రజా విజయోత్సవాలు. ఏడాది కాలంలో మహిళలకు ఫ్రీ బస్, సుమారు 55 వేల ఉద్యోగాలు, రుణమాఫీ, గృహ జ్యోతి, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, గురుకులం విద్యార్థులకు మెనూ మార్పు, మూసీ ప్రక్షాళన, ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, సింగరేణి కార్మికులకు బోనస్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారు.సంక్రాంతికి తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా వినూత్న పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అందులో ప్రధానంగా భూమి లేని పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు సీఎం రేవంత్ సర్కార్, దేశంలో ఎక్కడా లేని విధంగా సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. భూమి ఉంటే సాగుతో ఆదాయం అందుతుంది. అదే లేని వారి పరిస్థితి ఎట్లా అంటూ ఆలోచించిన ప్రభుత్వం, వారికి ఏడాదికి రూ. 12 వేలు అందించేందుకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 28న ఈ పథకానికి తొలి ఆడగు పడనుంది.అలాగే ఏ పథకం వర్తించాలన్నా రేషన్ కార్డు అవసరం. అర్హత ఉండి రేషన్ కార్డు లేని ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా ఇటువంటి వారికి మాత్రం రేషన్ కార్డు లేదన్నది వాస్తవం. అందుకే సంక్రాంతి పండుగ తర్వాత సుమారు 30 లక్షలకు పైగానే రేషన్ కార్డులను ప్రభుత్వం అందించనుంది. దీనితో ఎన్నో పేద కుటుంబాలకు మేలు జరగనుంది. ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వే ద్వారా, రేషన్ కార్డు లేకుండా ఇబ్బందులకు గురవుతున్న వారి పరిస్థితి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.అంతేకాదు సంక్రాంతి అంటేనే పాడిపంటల పండుగని కూడా చెబుతారు. అటువంటి పండుగకు రైతన్నలలో చిరునవ్వులు చిందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఏడాదిలో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, రైతు బంధు కూడా విడుదల చేయడం రైతన్నలకు అసలు సంక్రాంతి అంటే ఇదే అనే తరహాలో పథకం వరంగా మారనుంది.ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మాటలు కాదు పాలన చేతల్లో చూపిస్తామంటూ ప్రకటించారు. గత పాలకులు దోచుకున్నారు.. దాచుకున్నారు. కానీ ఇందిరమ్మ రాజ్యంలో వాటికి చోటు లేదు. ప్రజా సంక్షేమమే మా ధ్యేయమంటూ సీఎం చెప్పారు. సేమ్ టు సేమ్ అలాగే సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా పాలనకు కట్టుబడి సంక్రాంతికి వరాల జల్లు కురిపిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సంకష్టహర చతుర్థి పూజలందుకున్న మహాగణపతి

## -అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు




మంథని సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. సంకష్ట చతుర్థి నాడు వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విఘ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయం లోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా మంథని మండలం తోటగోపయ్య పల్లి గ్రామానికి చెందిన ఎక్కేటి జానకి-రవీందర్ రెడ్డి దంపతులు దేవాలయాన్ని పూలతో, ఆదియోగి విగ్రహంతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయానికి వచ్చిన వారు తప్పనిసరిగా ఆదియోగి విగ్రహం ముందు ఫోటోలు దిగారు.

# సినిమా



## చిరంజీవితో అనిల్ రావిపూడి సినిమా




సీనియర్ నటుడు చిరంజీవితో హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి ఓ సినిమా తెరకెక్కించబోతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే అనిల్ రావిపూడి ప్రకటించారు. ఇప్పటివరకూ ఆయన దర్శకత్వంలో వచ్చిన పటాస్, రాజా ది గ్రేట్, ఎఫ్ 2, సరిలేరు నీకెవ్వరు, భగవంత్ కేసరి వంటి సినిమాలు ప్రేక్షకులను బాగా అలరించాయి. ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర' సినిమాలో చిరంజీవి నటిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయ్యింది. విడుదల తేదీని మాత్రమే ప్రకటించాల్సివుంది. ఈ సినిమా తర్వాత చిరంజీవితో కొత్త ప్రాజెక్టు చేయబోతున్నారు. ఈ భారీ ప్రాజెక్టును షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహూ గారపాటి నిర్మించనున్నారు. అనిల్ రావిపూడి ప్రస్తుతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. జనవరి 14న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'నేను చిన్నతనం నుంచి చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ చిత్రాలను చూస్తూ పెరిగాను. ఇప్పటికే బాలకృష్ణ, వెంకటేష్‌తో కలిసి సినిమా చేశా. ఇప్పుడు చిరంజీవితో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని పేర్కొన్నారు. చిరంజీవితో అనిల్ రావిపూడి కొత్త సినిమా ఏప్రిల్‌లో సెట్స్‌పైకి రానుందని చర్చ జరుగుతోంది.

## అందరూ అనుకున్నట్టే జరిగింది

రష్మిక మందన్నా.. గురించి అందరూ అనుకున్నట్టే జరిగింది. చాలామంది రష్మిక లైఫ్ లో ఇది జరగబోతుంది అంటూ అంతా గెస్ చేశారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అదే నిజమనిపిస్తుంది. నేషనల్ క్రష్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అందాల ముద్దుగుమ్మ రష్మిక మందన్నా.. తాజాగానే పుష్ప2 సినిమాతో హ్యూజ్ బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది . ఎంతలా అంటే ఇప్పటివరకు రష్మిక మందన్నా.. తన కెరియర్ లో నటించిన అన్ని సినిమాలలోకి ఇదే ది బెస్ట్ గా నిలిచింది. కేవలం నటన పరంగానే కాదు ..చక్కగా అందంగా కూడా ఆకట్టుకునింది . అందరికీ శ్రీవల్లి లాంటి భార్య రావాలి అని కోరుకుంటున్నారు అంటే దానికి కారణం రష్మిక మందన్నా అనే చెప్పాలి . కాగా రీసెంట్గా రష్మిక మందన్నాకు సంబంధించిన ఒక వార్త ఇండస్ట్రీలో బాగా ట్రెండ్ అయింది. శ్రీవల్లి పాత్ర చూసిన తర్వాత చాలా మంది ఆమెకు ట్రెడిషనల్ పాత్రలే ఆఫర్ చేస్తారు అంటూ జనాలు ముందుగానే ఊహించారు. అయితే ప్రస్తుత పరిస్థితులు ఆమెకు అలానే కలిసి వచ్చేలా ఉన్నాయి. తాజాగా రెండు బడా సినిమాలలో అవకాశాలన్ని మిస్ చేసుకుందట రష్మిక మందన్నా. దానికి కారణం కూడా పుష్ప2 సినిమానే అంటున్నారు జనాలు. శ్రీవల్లి పాత్రలో చాలా చక్కగా మెరిసిన రష్మిక మందన్నాకు అలాంటి పాత్రలే ఇస్తున్నారట. అయితే ఎప్పుడు అలాంటి పాత్రలే చేస్తే బోర్ కొట్టేస్తుంది అంటూ రష్మిక మందన్నా.. రెండు సినిమాలను రిజెక్ట్ చేసిందట. ఆశ్చర్యం ఏంటంటే ఆ రెండు కూడా పాన్ ఇండియా సినిమాలే. దీంతో సోషల్ మీడియాలో రష్మిక మందన్నాకు సంబంధించిన వార్తలు బాగా ట్రెండ్ అవుతూ వైరల్ గా మారాయి . ఊహించిన చిక్కుల్లో ఇరుక్కున్న రష్మిక అంటూ జనాలు ట్రోల్ చేస్తున్నారు. పాపం పుష్ప 2 సినిమా హిట్ అయినా ఆ ఆనందమే లేకుండా పోయింది..!?



## ప్రియుడి కోసం పూజలు చేస్తున్న త్రిష!



త్రిష ఈ మధ్యకాలంలో ఏ పని చేసినా సోషల్ మీడియాలో చాలా వైరల్‌గా మారుతుంది.దానికి కారణం ఆమె వైఖరి కాస్త వేరుగా ఉండడమే. ఎందుకంటే లియో సినిమాలో నటించినప్పటినుండి విజయ్ తో మళ్ళీ ప్యాచప్ అయింది అన్నట్లు ఆమె విజయ్ తో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతుంది.ఒకప్పుడు విజయ్ త్రిష మధ్య ప్రేమ ఉండేదని, కానీ ఆ తర్వాత వీరి మధ్య బంధం తెగిపోయిందని వార్తలు వినిపించాయి.కానీ ఎప్పుడైతే లియో సినిమాలో త్రిష చేసిందో అప్పటినుండి మళ్ళీ వీరి మధ్య ప్రేమ చిగురించిందట.ఇక త్రిష తన ఇన్నేళ్ల వయసులో ఎప్పుడూ కూడా ఎవరికోసం ఐటమ్ సాంగ్ చేయలేదు. కానీ మొదటిసారి విజయ్ చేసిన ది గోట్ మూవీ కోసం ఐటెం సాంగ్ చేసింది.అయితే అలాంటి బ్యూటీ విజయ్ తో సీక్రెట్ గా డేటింగ్ చేస్తోంది. విజయ్‌తో సీక్రెట్గా వెకేషన్స్‌కి వెళ్తూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యే పోస్టుల ద్వారా నెట్టింట్లో హాట్ టాపిక్ గా మారుతుంది.అయితే కోలీవుడ్ మీడియ మొత్తం ప్రస్తుతం వీరి గురించే మాట్లాడుకుంటున్నారు. ఎందుకంటే రీసెంట్గా కీర్తి సురేష్ పెళ్లికి విజయ్, త్రిష ఇద్దరూ సీక్రెట్ గా ఒకే ఫ్లైట్లో వెళ్లారు.అయితే వీరిద్దరూ ఒకే ఫ్లైట్లో వెళ్లిన వీడియో కూడా నెట్టింట బయటపడింది. దాంతో జస్టిస్ ఫర్ సంగీత అంటూ సోషల్ మీడియాలో ఒక యాష్ ట్యాగ్ ట్రెండ్ అవుతుంది. త్రిష విజయ్ ని ఎగరేసుకుపోతుందని సంగీతకి న్యాయం జరగాలంటూ విజయ్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా కోయంబత్తూర్ లోని ఓ ఆలయంలో త్రిష పూజలు చేసింది. అయితే ఈ ఆలయానికి త్రిష వచ్చిందనే సంగతి తెలియడంతో చాలామంది అభిమానులు గుడి దగ్గరికి ఎగబడ్డారు. ఆమెతో ఫోటోలు దిగడం కోసం తెగ ఆసక్తి చూపించారు.అయితే కొంతమందికి సెల్ఫీ ఇచ్చిన త్రిష ఆ తర్వాత వారితో కాసేపు మాట్లాడి అక్కడి నుండి వెళ్ళింది. అయితే త్రిష కోయంబత్తూర్ లోని టెంపుల్లో పూజలు చేయడం వెనుక అనేక అనుమానాలు తెరమీదకి తీసుకువస్తున్నారు. విజయ్ తో పెళ్లికి రెడీ అయిందా.. అందుకే గగుళ్ళు గోపురాలు అంటూ తిరుగుతుందా.. లేక మరేదైనా కారణం ఉందా అంటూ కామెంట్స్ పెడుతున్నారు

## పుష్ప2 అరుదైన రికార్డ్..!



ఐకా కెన్ స్టార్ అల్లు అర్జున్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నటించిన పుష్ప 2 సినిమా డిసెంబర్ 5న ప్రేక్షకులు ముందుకు వచ్చి పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద రికార్డులు మోత మోగుస్తుంది. ఇప్పటికే ఈ సినిమా 1100 కోట్ల కు పైగా కలెక్షన్ రాబట్టింది.. త్రిబుల్ ఆర్,కేజి ఎఫ్ రికార్డ్ లను పుష్ప 2 బ్రేక్ చేయడానికి రెడీగా ఉంది .. ఇదే క్రమంలో ఈ సినిమా ఇదే కలెక్షన సునామీ సృష్టిస్తే బాహుబలి 2 రికార్డ్ బ్రేక్ అయిన సందేహం లేదు..ఇలా పుష్ప 2 సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనాలు క్రియేట్ చేస్తున్న సమయంలోనే.. అల్లు అర్జున్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ సినిమా పై పాన్ ఇండియా లెవెల్ లో మరింత ఇంట్రెస్ట్ పెరిగింది.. ఈ సినిమా రిలీజ్ అయి 11 రోజులు దాటుతున్న బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్లు వస్తున్నాయి .. ఇక సినిమా రిలీజ్ అయి నిన్నటితో 11 రోజుల్లో పూర్తి చేసుకుంది.. నిన్న కూడా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద 104 కోట్లు కలెక్ట్ చేసిన సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసింది. దీంతో ఇండియన్ సినిమా దగ్గర రిలీజ్ అయిన 11వ రోజు కూడా 100 కోట్లకు పైగా కలెక్షన్ రాబెట్టిన తొలి భారతీయ సినిమాగా పుష్ప 2 మూవీ రికార్డులు క్రియేట్ చేసినట్టు సిని వర్గాలు చెబుతున్నాయి .. ఇక ప్రస్తుతం పుష్ప 2 అత్యధిక వసూలు రాబట్టిన మూడో సినిమాగా ఇండియన్ బాక్స్ ఆఫీస్ దగ్గర రికార్డులు సృష్టించింది .. దంగల్ సినిమా మొదటి స్థానంలో ఉండగా బాహుబలి 2 రెండో ప్లేస్ లో ఉంది.. ఇప్పుడు త్రిబుల్ ఆర్ , కేజిఎఫ్ రికార్డ్‌ను కూడా బన్నీ తిరగరాసి మూడో ప్లేస్ లో నిలిచాడు.. ఇదే రకంగా మరో వారం రోజులు కలెక్షన్లు వస్తే బాహుబలి 2 రికార్డు కూడా బ్రేక్ అవ్వటం ఖాయం .

## 'రాబిన్‌హుడ్' రాక వాయిదా

క్రిస్మస్ రేసు నుంచి 'రాబిన్‌హుడ్' సినిమా తప్పుకుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. 'భీష్మ' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత నటుడు నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఈనెల 25న విడుదల చేస్తామని మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించారు. అయితే తాజాగా ఆ సంస్థ మరో ప్రకటన చేసింది. అనుకున్న తేదీలో చిత్రాన్ని విడుదల చేయటం లేదంటూ తెలిపింది. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది. మైత్రీ మూవీస్ నుంచి తెరకెక్కిన 'పుష్ప 2' ఇంకా థియేటర్లలో రన్ అవుతూనే ఉంది. మరోవైపు మోహన్‌లాల్ 'బరోజ్' తెలుగు వెర్షన్‌ను ఇదే సంస్థ 25న విడుదల చేస్తుంది. క్రిస్మస్ రేసులో 10కిపైగా చిత్రాలు ఉన్నాయి. దీంతో థియేటర్లలో కొరత ఏర్పడే ఛాన్స్ ఉందని రాబిన్‌హుడ్‌ను వాయిదా వేశారు. ఈ సినిమాలో నితిన్ సరసన శ్రీలీల నటించారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు.

## ప్రభాస్‌కు గాయాలు..



రెబల్ స్టార్ ప్రభాస్ లైనప్ చేసిన సినిమాలు చూస్తే బుర్రపెలిపోతుంది. ఇదికదా రెబల్ స్టార్ రేంజ్ అంటూ ఫ్యాన్స్ తెగ పొంగిపోతున్నారు. సలార్ సినిమాతో దాదాపు ఆరేళ్ళ తర్వాత సక్సెస్ ట్రాక్ లోకి వచ్చిన ప్రభాస్.. ఆ వెంటనే కల్కి సినిమాతో భారీ హిట్ అందుకున్నారు. కల్కి దెబ్బకు బాక్సాఫీస్ షేక్ అయ్యింది. ఏకంగా ఈ సినిమా వెయ్యి కోట్లకు పైగా వసూల్ చేసింది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు ప్రభాస్. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా నుంచి ఇప్పటివే విడుదలైన ప్రభాస్ లుక్స్ ఫ్యాన్స్ కు పూనకాలు తెప్పించాయి. ఈసినిమాలతో పాటు సలార్ 2, కల్కి 2, హను రాఘవపూడి సినిమా, సందీప్ రెడ్డి వంగ స్పిరిట్ మూవీఇలా వరుసగా సినిమాలను లైన్ లో పెట్టాడు మన డార్లింగ్.ప్రస్తుతం ప్రభాస్ ఆయ సినిమాల షూటింగ్స్ లో తెగ బిజీగా మారిపోయాడు. ఈ క్రమంలోనే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఓ సినిమా షూటింగ్ లో గాయపడ్డారు. జపాన్ లో వచ్చే నెల 4వ తేదీన రిలీజ్ అయ్యే కల్కి ప్రమోషన్లకు తాను హాజరవ్వట్లేదని ప్రభాస్ వెల్లడించారు. ఓ సినిమా షూటింగ్ చిత్రీకరణలో భాగంగా తన చిలమండలం బెనికిందని, అందుకే వెళ్ళలేకపోతున్నానని ఆయన ప్రకటించారు డిస్ట్రిబ్యూటర్ల టీం ప్రమోషన్స్ లో పాల్గొంటుందని తెలిపారు దీంతో ప్రభాస్ త్వరగా కోలుకోవాలని ఫాన్స్ పోస్ట్ చేస్తున్నారు.ఇదిలావుండగా ప్రభాస్‌తో సందీప్ వంగ తీయబోతున్న సినిమా కోసం ఫ్యాన్స్ మాత్రమే కాకుండా ప్రేక్షకులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. యానిమల్ సినిమా దాదాపుగా రూ.1000 కోట్ల వసూళ్లు సొంతం చేసుకుంది. కనుక సందీప్ తదుపరి సినిమాపై హిందీ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రభాస్ సలార్, కల్కి సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాలను సొంతం చేసుకున్నాడు.



# క్రీడలు



## రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా స్టార్ స్పిన్నర్..



ఆఫ్ స్పిన్నర్ ఆర్ అశ్విన్ గబ్బా టెస్టు ముగిసిన వెంటనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 38 ఏళ్ల అశ్విన్ తన అంతర్జాతీయ కెరీర్‌లో 765 వికెట్లు పడగొట్టాడు. అలాగే, టెస్టు క్రికెట్‌లో 6 సెంచరీల సాయంతో 3503 పరుగులు చేశాడు. భారత ఆఫ్ స్పిన్నర్ ఆర్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గబ్బా టెస్టు ముగిసిన వెంటనే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పటి వరకు భారత టెస్టు చరిత్రలో అత్యంత విజయవంతమైన బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్ ఒకడిగా పేరుగాంచాడు. ఈ టూర్‌లో అతనికి ఇప్పటి వరకు ఒకే ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. అడిలైడ్ తర్వాత, అతను గబ్బా టెస్టుకు దూరమయ్యాడు. గబ్బా టెస్టు సందర్భంగా అశ్విన్ టీమిండియా ఆటగాళ్లను కౌగిలించుకుంటూ కనిపించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని కౌగిలించుకున్నాడు. అశ్విన్ కూడా హెడ్ కోచ్ గంభీర్‌తో చాలాసేపు మాట్లాడి, ఆపై విలేకరుల సమావేశానికి వచ్చి రిటైర్మెంట్ ప్రకటించి షాక్ ఇచ్చాడు. అశ్విన్ టెస్టు క్రికెట్‌లో 106 మ్యాచ్‌లు ఆడి 537 వికెట్లు తీశాడు. అతను తన పేరిట 37 ఐదు వికెట్లు సాధించాడు. మ్యాచ్‌లో 8 సార్లు 10 వికెట్లు తీసుకున్నాడు. అశ్విన్ వన్డేల్లో 156 వికెట్లు కూడా తీశాడు. టీ20లో అశ్విన్ 72 వికెట్లు తీశాడు. అతను తన అంతర్జాతీయ కెరీర్‌లో 765 వికెట్లు సాధించాడు. బ్యాట్స్‌మెన్‌గానూ అశ్విన్ తనదైన ముద్ర వేశాడు. టెస్ట్ క్రికెట్‌లో 3503 పరుగులు చేశాడు. అతను మొత్తం 6 టెస్ట్ సెంచరీలు చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మొత్తం 8 సెంచరీలు చేశాడు. ఆర్ అశ్విన్ తన కెరీర్‌లో ఎన్నో పెద్ద మైలురాళ్లను సాధించాడు. రికార్డులతో పాటు 2011లో వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులో భాగస్వామ్యం అయ్యాడు. అలాగే, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీతోపాటు ఆసియా కప్‌ను కూడా అశ్విన్ గెలుచుకున్నాడు. టెస్టుల్లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులను కూడా అశ్విన్ గెలుచుకున్నాడు. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టు డ్రాగా ముగిసింది. బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో చివరి రోజైన బుధవారం కేవలం 25 ఓవర్లు మాత్రమే వేయగలిగారు. ఆస్ట్రేలియా భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే వర్షం కారణంగా ఒక రోజు ఆట రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో టీమిండియా స్పిన్నర్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాడు.

## డ్రాగా ముగిసిన గబ్బా టెస్ట్



భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న గబ్బా టెస్టు డ్రా అయింది. ఐదో రోజు వర్షం కారణంగా పెద్దగా ఆట జరగకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. సిరీస్ 1-1తో సమంగా మారింది. ఇక నాలుగో టెస్ట్ మ్యాచ్ డిసెంబర్ 26 నుంచి మెల్‌బోర్న్‌లో జరుగుతుంది. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన గబ్బా టెస్టు డ్రా అయింది. ఐదో రోజు వర్షం కారణంగా పెద్దగా ఆట జరగకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆస్ట్రేలియా భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రతిస్పందనగా టీమ్ ఇండియా వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్రిస్బేన్‌లో భారీ వర్షం కురవగా, ప్రతికూల వాతావరణం కారణంగా మ్యాచ్ డ్రా అయింది. ప్రస్తుతం టెస్టు సిరీస్ 1-1తో సమంగా ఇరుజట్లు నిలిచాయి. తదుపరి మ్యాచ్ డిసెంబర్ 26 నుంచి మెల్‌బోర్న్‌లో జరగనుంది. మొత్తం మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఆధిపత్యం ప్రదర్శించినా నాలుగో, చివరి రోజు మాత్రం టీమిండియా అద్భుత ఆటతీరును ప్రదర్శించిందనడంలో సందేహం లేదు. ఆస్ట్రేలియా టీమిండియాకు కేవలం 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. గత పర్యటనలో ఆస్ట్రేలియాపై ఇదే మైదానంలో 328 పరుగుల స్కోరును ఛేదించిన టీమిండియా రికార్డు సృష్టించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి కూడా ఈ స్కోరును ఛేదించడం సాధ్యమనిపించింది. అయితే, వర్షం ఆస్ట్రేలియాను కాపాడినట్లు అంతా భావిస్తున్నారు. ఎందుకంటే గబ్బా మైదానంలో టీమిండియాకు అనుకూలమైన చరిత్ర ఉంది. గబ్బా టెస్టులో భారత జట్టు తరపున జస్ప్రీత్ బుమ్రా అద్భుత ప్రదర్శన చేశాడు. అతను మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతని పేరిట 9 వికెట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియా తరపున, ట్రావిస్ హెడ్ మొదటి ఇన్నింగ్స్‌లో 152 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. హెడ్ ?తర్వాత స్టీవ్ స్మిత్ తొలి ఇన్నింగ్స్‌లో 101 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు.

## టీమిండియా కొత్త జెర్సీ



ఇండియన్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జయ్ షా, మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కలిసి, శుక్రవారం, నవంబర్ 29న భారత మహిళల క్రికెట్ జట్టుకు కొత్త వన్డే జెర్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగింది. డిసెంబర్ 5 నుంచి ఆస్ట్రేలియాలో జరగనున్న మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు ఈ జెర్సీని ఆవిష్కరించారు. భారత మహిళా క్రికెట్ జట్టుకు కొత్త జెర్సీ, కొత్త లుక్ తెచ్చిపెట్టిందని ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. అదిరిపోయిందని అంటున్నారు. ఈ కొత్త జెర్సీలో భుజాలపై మూడు రంగుల తివర్ణ పతాకం ఉండటం ప్రత్యేకత. ముందు జెర్సీలో మూడు తెల్లటి చారలు మాత్రమే ఉండేవి. డిసెంబర్ 22 నుంచి 27 వరకు వడోదరలో జరగనున్న వెస్టిండీస్‌తో జరిగే మూడు వన్డే మ్యాచ్‌లలో భారత మహిళా జట్టు తొలిసారిగా ఈ కొత్త జెర్సీని ధరించనుంది. జెర్సీ ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడిన జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, "ఈ జెర్సీని ఆవిష్కరించడం చాలా గర్వంగా ఉంది. వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లో మేమే తొలిసారిగా దీన్ని ధరించడం చాలా ఆనందంగా ఉంది. ఈ జెర్సీ డిజైన్ నాకు చాలా నచ్చింది. ముఖ్యంగా భుజాలపై ఉన్న త్రివర్ణ పతాక రంగులు చాలా అందంగా ఉన్నాయి. ఇది చాలా ప్రత్యేకమైన వన్డే జెర్సీ" అని అన్నారు. మహిళా క్రికెట్ జట్టు వెస్టిండీస్‌తో ఆడే మ్యాచ్‌లకు ముందు ఆస్ట్రేలియాలో మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి వెస్టిండీస్‌తో మూడు టీ20లు, మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. 2023 నుంచి అడిడాస్ భారత క్రికెట్ జట్టుకు కిట్ స్పాన్సర్‌గా ఉంది. అప్పటి నుంచి జట్టు తరచూ తమ జెర్సీలను మార్చుకుంటూ వస్తోంది. గత ఏడాది పురుషుల వన్డే ప్రపంచ కప్‌కు, ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్‌కు ప్రత్యేక జెర్సీలను తీసుకొచ్చారు. అంతేకాకుండా, బ్లూ కలర్ కాలర్‌తో కూడిన తెల్లటి పోలో షర్టు వంటి భారత జట్టు ప్రాక్టీస్ కిట్‌లు కూడా చాలా ప్రాచుర్యం పొందాయి. నవంబర్ 28న, పురుషుల జట్టు ఆస్ట్రేలియా పార్లమెంట్ హౌస్‌కు వెళ్లినప్పుడు ఈ తెల్లటి పోలో షర్టు ధరించారు. అక్కడ వారిని ప్రధానమంత్రి ఆంథోని ఆల్బనీస్ ఆహ్వానించారు.

## సానియా మీర్జా  రెండో పెళ్లికి కూడా గ్రీన్ సిగ్నల్



సానియా మీర్జా, పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్ ప్రేమించుకొని వివాహం చేసుకున్నప్పటికీ 14 ఏళ్ల బంధానికి ఇద్దరు కూడా ఇటీవలే ఫుల్ స్టాప్ పెట్టారు.. దీంతో షోయబ్ మాత్రం సానియా మిర్జా నుంచి విడిపోయిన వెంటనే గ్యాప్ తీసుకోకుండా మరొక వివాహం చేసుకున్నారు.. అయితే సానియా మీర్జా మాత్రం ఇప్పటివరకు రెండో వివాహం గురించి ఎక్కడ ప్రస్తావించలేదు చేసుకోలేదు. తన కుమారుడితో కలిసి మాత్రమే జీవిస్తూ ఉన్నది. పెళ్లి చేసుకోవాలని కుటుంబ సభ్యులు సన్నిహితులు సైతం ఒత్తిడి తెస్తూ ఉన్న ఇప్పటివరకు అలాంటి అవకాశాన్ని తీసుకోలేదు సానియా మీర్జా. అయితే ఇలాంటి సమయంలోనే ఇండియన్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ రెండో వివాహం చేసుకోబోతున్నారని విధంగా ప్రచారం సాగింది. అయితే ఇదంతా కూడా ఫేక్ రూమర్స్ అంటే సానియా మీర్జా తండ్రి ఖండించారు.. ఇక సానియా మీర్జా కూడా ప్రస్తుతం ఒంటరిగా ఉండకూడదని కుటుంబ సభ్యులు భావించడమే కాకుండా పాకిస్తాన్ నటుడు నాబిల్ జాఫర్ కూడా ఈమెను మరొక వివాహం చేసుకోమని సలహా ఇచ్చారు. అయితే సానియా మీర్జా మాత్రం పెళ్లి అంటే తనకు చాలా విరక్తి కలిగిందని చెప్పినట్లు సమాచారం. ఇటీవలే సానియాకు ఒక ఇంటర్వ్యూలో జాఫర్ హితబోధ చేసినట్లుగా సమాచారం. విడాకులు తీసుకున్నంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదు.. అజ్ఞానంతో చాలామంది మంచి భవిష్యత్తును కోల్పోతూ ఉంటారు.. అలా ఆలోచించడం తప్పు అంటూ తెలిపారు విడాకులు అనేది ఒక దురదృష్టకరమని ఎవరి జీవితంలోనైనా ఇలాంటి చీకటి రోజు ఉండకూడదంటూ తెలియజేశారు. దీంతో తాజాగా సానియా మీర్జా కూడా ఒక కొత్త జీవితం ప్రారంభించాలి అంటూ ఒక పోస్ట్ ని షేర్ చేసింది.. దీంతో ఒక్కసారిగా ఆమె అభిమానులు సానియా మనసు మారినట్టు ఉంది రెండో వివాహానికి సిద్ధమయ్యింది అన్నట్లుగా అందుకే ఇలా హింట్ ఇచ్చింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి కొంతమంది ఈసారైనా ఆచితూచి అడుగు వెయ్యండి అంటూ సలహా ఇస్తున్నారు. ఒకవేళ రెండో పెళ్లి అయితే వరుడు గురించి ముందుగానే హింట్ ఇస్తుందేమో చూడాలి.మరి ఏంటన్నది తెలియాలి.

## ట్రావిస్ హెడ్ తల పొగరుదించిన ఆకాష్ దీప్



టీమిండియా ఫాస్ట్ బౌలర్ ఆకాశ్‌దీప్ కూడా బ్యాటింగ్‌లో తన ప్రతిభను కనబరిచి భారత్‌కు కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, అతను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు, ఒక ఫన్నీ సంఘటన చోటు చేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. గబ్బా వేదికగా జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో టీమ్ ఇండియా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఆకాశ్‌దీప్ చేసిన పని వ్యాఖ్యాతలను కూడా నవ్వించేలా చేసింది. బ్యాటింగ్ చేస్తున్న భారత ఫాస్ట్ బౌలర్ ఆకాశ్‌దీప్.. పక్కనే ఉన్న ట్రావిస్ హెడ్‌కి బంతి ఇవ్వకుండా మైదానంలో పడేశాడు. దీనికి ట్రావిస్ హెడ్ కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత, ఆకాష్ అలెక్స్ కారీకి సారీ చెప్పడం కనిపించింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న గబ్బా టెస్టు ఐదో రోజు తొలి సెషన్‌లో ఈ దృశ్యం కనిపించింది. టీమిండియా తొమ్మిది వికెట్లు కోల్పోయింది. జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్‌దీప్ చివరి వికెట్‌గా క్రీజులో ఉన్నారు. ఆకాష్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. ఓ బంతిని ఆడడం మిస్ అయ్యాడు. ఆ బంతి బ్యాట్‌కు తగిలి ప్యాడ్‌లో ఇరుక్కుపోయింది. సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న హెడ్ ఆకాష్ బంతిని తీసుకోవడానికి వచ్చాడు. ఆకాష్ ప్యాడ్ నుంచి బంతిని తీసివేస్తున్న సమయంలో.. ఆపై హెడ్ బంతిని అడిగాడు. కానీ, బంతిని హెడ్‌కి ఇవ్వకుండా, ఆకాష్ దానిని నేలపై విసిరాడు. ఆ తర్వాత, హెడ్ అతని వైపు చూస్తూ, బంతిని స్వయంగా తీయడం ప్రారంభించాడు. అప్పుడు ఆకాష్ వికెట్ కీపర్ అలెక్స్ కారీకి 'ఐ యామ్ సారీ' అని చెప్పుకొచ్చాడు. ఈ ఫన్నీ సంఘటన చూసి వ్యాఖ్యాతలు కూడా నవ్వడం మొదలుపెట్టారు. ఆ తర్వాత హెడ్ కూడా నవ్వుతూ కనిపించాడు. ఈ ఫన్నీ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా లైక్ అవుతోంది. అనంతరం ఆకాశ్‌దీప్ వికెట్‌ను ట్రావిస్ హెడ్ తీయడం గమనార్హం. 213 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయిన టీమ్ ఇండియా చివరి వికెట్‌కు అవసరమైన పరుగులను జోడిస్తోంది. క్రీజులో బుమ్రా, ఆకాష్ మధ్య మంచి భాగస్వామ్యం నెలకొని ఉంది. వీరిద్దరూ చివరి వికెట్‌కు 47 పరుగులు జోడించారు. కంగారూ జట్టు ప్రధాన బౌలర్లు బుమ్రా, ఆకాష్‌ల వికెట్లను తీయలేకపోయారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ బంతిని ట్రావిస్ హెడ్‌కి అప్పగించాడు. అతను తన రెండో ఓవర్ ఐదో బంతికి ఆకాష్‌ను అవుట్ చేసి భారత్‌ను 260 పరుగులకు తగ్గించాడు. ఆకాశ్ 44 బంతుల్లో 31 పరుగులతో ఇన్నింగ్స్ ఆడాడు.

## ఎమ్మార్పీఎస్ మండల సదస్సుకు మాదిగ జాతి తరలిరావాలి

### –రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ బుర్రి సతీష్ మాదిగ



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 18 :**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణం బలోపేతం చేయడంలో భాగంగా మందమర్రి మండల కేంద్రంలోని సారంగపల్లి గ్రామంలో గురువారం మండల సదస్సును

నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంఛార్జి బురి సతీష్ మాదిగ తెలిపారు. బుధవారం ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వ మీద జరగబోయే పోరాటానికి మాదిగ బిడ్డలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టడానికి సంసిద్ధం కావాలని కోరారు. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేసుకొని నూతన జెండా ఆవిష్కరణ చేసుకొని జాతిని పోరాటానికి సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకులు జీడి సారంగం మాదిగ, అసంపల్లి శివకుమార్ మాదిగ, చిలుముల రాజ్ కుమార్ మాదిగ, ఆసంపల్లి అఖిల్ మాదిగ, అసంపల్లి అనిల్ మాదిగ, అరికిల్ల ప్రసాద్ మాదిగ, చిప్పకుర్తి మురారి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి వినతి

### –ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి కలిసిన బండి సదానందం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్, డిసెంబర్ 18**మంచిర్యాల జిల్లాలో నెలకొన్న యాదవుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం హైదారాబాద్ లోని ముఖ్యమంత్రి ఛాంబర్ లో ఎనుముల రేవంత్ రెడ్డిని, బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్ వెంకటస్వామిలతో కలిసి జిల్లా యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బండి సదానందం వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా యాదవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ముఖ్యమంత్రికి బండి సదానందం వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తొందరలోనే సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.



ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం జనరల్ సెక్రెటరీ మల్లెతుల నరేష్ యాదవ్, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు బండి శివ కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరవేని కిట్టన్న యాదవ్, దండేపల్లి మండల అధ్యక్షుడు అల్లంలా సతేన్న యాదవ్, ఉపాధ్యక్షుడు అల్లంల మల్లేష్ యాదవ్, జిల్లా యూత్ నాయకులు మాచర్ల గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆహ్లాదకరంగా నిర్వహించాలి




**ప్రజా బలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసెంబర్ 18:**ప్రతి సంవత్సరం లాగానే శీతాకాల విడిదికి హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి తిరిగి వెళ్లిన అనంతరం రాష్ట్రపతి నిలయాన్ని సందర్శంచడానికి ప్రజలకు వీలు కల్పించడం జరుగుతుంది, కాని ఈసారి మాత్రం ఒక ప్రధాన ఉద్దేశంతో ఉద్యాన్ ఉత్సవ్ అనే కార్యక్రమంతో సందర్శకులకు ఎంతో ఆహ్లాదాన్ని అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసి హాల్ లో నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జల్లా కలెక్టరు గౌతం తో కలిసి జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రపతి శీతాకాల విడిది ముగించుకొని వెళ్లిన అనంతరం కొన్నిరోజులు రాష్ట్రపతి నిలయాన్ని ప్రజలు సందర్శించేందుకు అనుమతి ఉంటుంది. ఈ సారి ఆ సందర్శన కార్యక్రమానికి ఉద్యాన ఉత్సవ్ అనే పేరుతో మరింత ఆహ్లాదకర వాతావరణంతో పాటు స్టాల్స్, చిన్న చిన్న కుటీరాలను ఏర్పాటు చేయడంమే కాకుండా ఒక పిక్నిక్ స్పాట్ గా తయారు చేయడం జరుగుతుందని, అధిక సంఖ్యలు ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అగ్రికల్చర్ అథారిటీ ఇనిస్ట్యూట్ , సాంస్కృతిక, టూరిజం శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేక భౌగోళిక వ్యవసాయం, సమీకరణ వ్యవసాయం పై అవగాహన కల్పించేలా కుటీరాలను, స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. నిర్దేశిత ప్రాంతాలలో నిర్దేశిత పంటలు, వ్యర్థాలతో ఉపయోగాల తయారీ గురించి ప్రజలకు, విద్యార్థులకు తెలిసేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. తమ తమ ఇళ్లలో నర్సరీ, గార్డనింగ్ ఎలా చేసుకోవాలో తెలిపేలా చిన్న చిన్న మెళకువలతో స్టాల్స్ ను ఏర్పాటు చేస ప్రజలకు తెలపాలన్నారు. పిక్నిక్ స్పాట్ లా ఉండేలా పిల్లలకు ప్లే ఏరియా ఉండేలా చూడాలన్నారు. ఇంతే కాకుండా చిరుతిండ్లు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉద్యాన ఉత్సవ్ ను తిలకించేందుకు వసతి గృహాల విద్యార్థులను రాష్ట్రపతి నిలయానికి తీసుకువచ్చి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించి ఒక తీపి గుర్తుగా ఉండిపోయేలా వారి జ్ఞాపకాలలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ప్రచారం చేయాలన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన త్రాగునీరు, అంబులెన్స్, మొబైల్ టాయిలెట్లు, రవాణా , లైటింగ్ వంటి మౌళిక వసతులను సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. సందర్శనకు వచ్చిన ప్రతి ఒక్కరు మంచి అనుభవంతో పాటు మంచి అనుభూతితో తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అగ్రికల్చర్ సరవనన్ రాజ్, జాయింట్ సెక్రటరీ ఉదయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, డిఈఒ విజయ కుమారి, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## సి.ఈ.అర్ క్లబ్ లో మహిళలకు ఆటల పోటీలు



**ప్రజాబలం మందమర్రి డిసెంబర్ 18 :**మందమర్రి ఏరియాలోని సి.ఇ.ఆర్ క్లబ్ లో బుధవారం సింగరేణి దినోత్సవ వేడుకలు-2024 సందర్భంగా మహిళలకు బాల్ ఇన్ బాస్కెట్, బాంబ్ ఇన్ బ్లాస్ట్, దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి సేవ ప్రెసిడెంట్ జి.స్వరూపరాణి దేవేందర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలిచిన మహిళలకు డిసెంబర్ 23 న సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో నిర్వహించే సింగరేణి దినోత్సవ వేడుకలలో బహుమతులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. సింగరేణి సంస్థ స్వయం ఉపాధి పొందే విధంగా ఎన్నో




వృత్తి శిక్షణ కోర్సులు కూడా మహిళలకు అందజేస్తుంది కావున ప్రతి ఒక్కరూ ఇలాంటి సదావకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్, డి.వై పి.ఎం ఎం.డి ఆసిఫ్, లేడీస్ క్లబ్ మెంబర్స్ మహిళలు పాల్గొన్నారు.

## పర్లపల్లి నాగరాజును అభినందించిన కవ్వంపల్లి



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 18**ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికలలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పర్లపల్లి నాగరాజు ని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యువకుల సమస్యలు తెలుసుకొని పరిష్కారం దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే నాగరాజు కు సూచించారు ఈ సందర్భంగా పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైన తర్వాత మొట్ట మొదటిసారి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ను కలిసి ఆశీస్సులు తీసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కచ్చితంగా యువకుల సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవ్వడం మరింత బాధ్యతను పెంచిందని అన్నారు ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు టేకుల శ్రావణ్,చెంచల మణిదీప్, ఆకునూరి అజిత్,అన్వేష్ తదితరులు పాల్గొన్నారు

## స్థానిక" ఎన్నికల్లో యువతకు అవకాశం ఇవ్వాలి

### – కాంగ్రెస్ యువ నాయకుడు ప్రశాంత్ మద్దుల



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 18**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేయాలని, పోటీకి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ యువ నాయకుడు ప్రశాంత్ మద్దుల కోరారు. బుధవారం ఆయన వీణవంక మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పదికాలాలపాటు ప్రజా శ్రేయస్సుకు పనిచేయాలంటే గ్రామాల్లో యువతకు చాన్స్ ఇవ్వాలని కోరారు. యువ రక్తం హస్తం పార్టీలో ఉన్నంతగా మరే పార్టీలో లేదని చెప్పారు. హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలో యువతీ యువకులకు లోకల్ బాడీ ఎలక్షన్స్ లో అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పోటీకి అవకాశం కల్పించాలని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ప్రణవ్ నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో స్థానికంగా బలం కలిగిన కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వీణవంక మండల పరిధిలో కొమ్మిడి రాకేష్ రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు బలంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర స్థాయిలో ఏఐసీసీ అగ్రనేత లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గదర్శనంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ఫుల్ ప్రయారిటీ ఇవ్వాలని అభ్యర్థించారు. గత పాలకుల మాదిరిగా పాతవారికే మళ్లీ ప్రయారిటీ ఇస్తే గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఈ విషయాలన్నిటిని నిశితంగా గమనించి.. యువతకు లోకల్ బాడీ ఎలక్షన్స్ లో హైయెస్ట్ ప్రయారిటీ ఇచ్చి.. పోటీకి పెద్దపీట వేయాలని కోరారు. పార్టీ పెద్దల మార్గదర్శనంలో యువత చక్కగా పనిచేసే అవకాశాన్ని నాయకత్వం పరిశీలించాలని అభ్యర్థించారు.

## లేడీస్ క్లబ్ సభ్యులకు ఆటల పోటీలు.

గోదావరిఖని : సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రామగుండం ఏరియా-1 లేడీస్ క్లబ్ సభ్యులకు ఇల్లందు క్లబ్ నందు ఆటల పోటీలు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రామగుండం ఏరియా-1 లేడీస్ క్లబ్ సభ్యులకు .17.12.2024 రాత్రి ఇల్లందు క్లబ్ నందు వివిధ ఆటల పోటీలను నిర్వహించటం జరిగింది. ఇట్టి కార్యక్రమమానికి ఆర్జీ. 1 సేవా అధ్యక్షురాలు శ్రీమతి అనిత లలిత్ కుమార్ ముఖ్య అతిదిగా హాజరై పోటీలను ప్రారంభించటం జరిగింది. ఈ పోటీలకు లేడీస్ క్లబ్ సభ్యులకు. వివిధ ఆటల పోటీలలలో వాటర్ ఫిల్లింగ్ విత్ డస్టర్, క్రికెట్ మ్యాచ్ ఆటలను ఏంతో ఉత్సాహంగా పాల్గోన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ప్రధాన వేడుకలలో .23.12.2024 రోజున జవహర్ లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో ముఖ్య అతిథుల చేతుల మిధుగా బహుమతుల ప్రధానోత్సవం చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో జరుగు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రజలంరు అధిక సంఖ్యలో హాజరు కావాలని శ్రీమతి అనిత లలిత్ కుమార్ తెలిపారుఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలక లక్ష్మి శ్రీనివాస్, సేవా సెక్రటరి శిరీష, సేవా జాయింట్ సెక్రటరి బీన సింగ్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ రమేష్, సేవా సమితి కో ఆర్డినేటర్ మేడి తిరుపతి, లేడీస్ క్లబ్ సభ్యులు కవిత, రమ, తార, కళ్యాణి, శ్రీవాణి, హేమ, సుధా తదితరులు పాల్గోన్నారు.

# ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

## పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి తోనే సాధ్యం

## ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

## కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తేనె నాగరాజు

నందికొట్కూర్ ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే పూర్వ వైభవం వస్తుందని నందికొట్కూర్ నియోజకవర్గ సమన్వయకర్త తేనె నాగరాజు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పీసీసీ చీఫ్ వైయస్ షర్మిలారెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను ఎదుర్కొని పూర్వ వైభవం తెస్తారని ఆయన తెలిపారు. ప్రస్తుత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచిపోయినప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయన్నారు. ఎన్నికల హామీలో భాగంగా సూపర్ సిక్స్ పేరుతో పేదలకు వరాలు ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు పేరుతో ఓట్లు వేయించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇద్దరు కలిసి రాష్ట్రంలోని మహిళలను మోసం చేశారని అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సహాయం కింద రైతుల అకౌంట్లో 20,000 రూపాయలు వేయడం మరిచిపోయారని కూటమి ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. పేదలపై ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల పెంపును, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన టిడిపి ,జనసేన ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక జగన్ దారిలోనే ప్రవేశిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది ఎమ్మెల్యేలను గెలిపించినప్పటికీ జగన్ అసెంబ్లీకి వెళ్లకుండా కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించకపోవడం శోచనీయమన్నారు. టిడిపి ,జనసేన ,వైసిపి పార్టీలు ఒకే తాను లోని గుడ్డలేనని ఆయన విమర్శించారు. భవిష్యత్తులో అధికార కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమానికి వైయస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో మరియు నంద్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో సన్నద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు.



# అభరణాల షాపులో గన్ తో బెదిరించి బంగారం దోపిడి

కాకినాడ తనిస్క్ షో రూమ్ లో ఉద్యోగిని గన్ తో బెదిరించి ఒక దొంగ .. బంగారం దోచుకుని వెళ్లిపోయాడు. తక్షణమే స్పందించిన పోలీసులు వార్పు రోడ్డు ఫారెస్ట్ ఆపీస్ దగ్గర దొంగను పట్టుకున్నారు. దొంగ నుండి బంగారం, గన్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గన్ డమ్మీ గన్ గా గుర్తించారుర. దొంగను 1 టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమం...

## ఎంపీడీవో విశ్వమోహన్

## 19 నుండి 24 వరకు "ప్రశాసన్ గావో కి ఓర్" కార్యక్రమం.

తుగ్గలి: కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ తెలియజేశారు. బుధవారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 19 నుండి 24 వరకు "ప్రశాసన్ గావో కి ఓర్" కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.కావున ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఎంపీడీవో కార్యాలయం నందు ప్రజలు తమకు సంబంధించిన సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు అందజేయాలని ఎంపీడీవో తెలియజేశారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఓ మహబూబ్ భాష, జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేర్ని నాని మెడకు "రేషన్ బియ్యం మాయం" కేసు

## మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు...

మాజీ ఎమ్మెల్యే పేర్నినాని గోడౌన్‌లో మాయమైన రేషన్ బియ్యం వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 243 టన్నుల రేషన్ బియ్యాన్ని దారి మళ్లించేందుకు పేర్ని నాని యత్నించారని ఆరోపించారు. వ్యవస్థలను దారుణంగా ఖూనీ చేశారనేది ప్రజలు గ్రహించాలని మనోహర్ విజ్ఞప్తి చేశారు. తప్పు చేసిన వారిని వదలిపెట్టబోమన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణపై మరో గోడౌన్‌పైనా అనుమానం ఉందని, త్వరలోనే తనిఖీలు చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవని, నిజాయితీగా పని చేస్తామని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు.

# దోపిడికి యత్నం..యువకుడిని చితకబాదిన స్థానికులు

తిరుపతి నగరంలో బ్యాంక్‌లో దోపిడీకి ప్రయత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని చితక్కొట్టారు. తిరుపతి, రేణిగుంట రోడ్డులోని ఇండియన్ బ్యాంక్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. బ్యాంకు మూసివేసే సమయంలో ఓ యువకుడు ముఖానికి కర్చీఫ్ కట్టుకుని, బ్యాగ్‌లో కత్తి పెట్టుకుని బ్యాంక్‌కు వచ్చాడు. క్యాషియర్ పక్కన ఉన్న అకౌంటెంట్ మెడపై కత్తిపెట్టి డబ్బులు బ్యాగ్‌లో వేయాలని బెదిరించాడు. అదే సమయంలో బ్యాంక్‌కు వచ్చిన ఖాతాదారులు ఆ యువకుడిని మాటల్లో దింపి చాకచక్యంగా పట్టుకున్నారు. బయటకు తీసుకు వచ్చి.. గ్రిల్‌కు కట్టేసి చితకబాదారు. తాను రూ. 5 లక్షలు అప్పు చేశారని, ఆ బాధ తట్టుకోలేక చోరీకి వచ్చినట్లు నిందితుడు చెప్పాడు.

# టీడీపీ యూట్యూబ్ ఛానల్ హ్యాక్

తెలుగుదేశం పార్టీ అధికారిక యూట్యూబ్ ఛానల్ హ్యాక్ అయింది. బుధవారం ఉదయం నుంచి ఛానల్ ఓపెన్ కావడంలేదు. ఎర్రర్ మెసేజ్ వస్తోందని, స్ట్రక్ అయినట్లు చూపిస్తోందని టీడీపీ నేతలు తెలిపారు. యూట్యూబ్ ఛానల్ ను పునరుద్ధరించేందుకు పార్టీ టెక్నికల్ వింగ్ ప్రయత్నిస్తోందని వివరించారు. దీనిపై యూట్యూబ్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశామని, ఛానల్ ను పునరుద్ధరించేందుకు యూట్యూబ్ సాయం తీసుకుంటున్నామని టీడీపీ సాంకేతిక విభాగానికి చెందిన నిపుణులు తెలిపారు


# విజయ్ మాల్యా ఆస్తులు అమ్మి 14 వేల కోట్లు బ్యాంకులకు జమ

న్యూఢిల్లీ బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరస్థుల నుంచి ఈ ఏడాది రూ.22 వేల కోట్లు రాబట్టామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో వెల్లడించారు. పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యాకు దేశంలో ఉన్న ఆస్తులను వేలం వేసి రూ.14 వేల కోట్లు బ్యాంకుల్లో జమ చేసినట్లు వివరించారు. అదేవిధంగా గుజరాత్ కు చెందిన వజ్రాల వ్యాపారి, బ్యాంకు రుణాల ఎగవేతదారు నీరవ్ మోదీ ఆస్తులు అమ్మి వెయ్యి కోట్లు వసూలు చేశామన్నారు.

మిగతా ఎగవేతదారుల నుంచి ఏడు వేల కోట్లు వసూలు చేసి మొత్తంగా రూ.22,280 కోట్లు వివిధ బ్యాంకులకు జమ చేశామని చెప్పారు. ఇందుకోసం ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), బ్యాంకులు సంయుక్తంగా ముంబైలోని స్పెషల్ కోర్టును ఆశ్రయించాయని తెలిపారు. ఎగవేతదారులకు సంబంధించి ఈడీ అటాచ్ చేసిన ఆస్తులను స్పెషల్ కోర్టు ఆదేశాలతో బ్యాంకులు, ఈడీ అధికారులు విక్రయించారని వివరించారు.

మరో వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి చెందిన రూ.2,566 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిందని, ఈ ఆస్తులను కూడా వేలం వేసేందుకు స్పెషల్ కోర్టు అనుమతిచ్చిందని నిర్మలా సీతారామన్ చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి తీసుకున్న సుమారు 13 వేల కోట్లకు పైగా రుణాలను చోక్సీ చెల్లించలేదని తెలిపారు. దీంతో ఈడీ జప్తు చేసిన ఆస్తులను వేలం వేసి పంజాబ్ నేషనల్ బ్యాంకుతో పాటు ఇతర రుణదాతలకు చెల్లించాలని ముంబై స్పెషల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పీఎంఎల్ఏ చట్టం ఆధారంగా రుణాల ఎగవేతదారుల నుంచి సొమ్ము రాబడుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# ఏపీకి కేంద్రం శుభవార్త



ఏపీకి కేంద్రం మరో శుభవార్త చెప్పింది. ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కేంద్రం అంగీకరించింది. సాగరమాల 2 ప్రాజెక్టు కింద కొత్తపట్నం మండలంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని.. దీని నిర్మాణం కోసం అవసరమైన 40 ఎకరాల భూమిని గుర్తించాలని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రకాశం జిల్లా వాసుల కల త్వరలో సాకారం కానుంది..

# అండమాన్ నికోబార్ లోని దీవులకు మన వీరుల పేర్లు పెట్టడమంటే వారి సేవలు భవిష్యత్ తరాలకు గుర్తుండేలా చేయడమే: ప్రధానమంత్రి



అండమాన్ నికోబార్ ప్రాంతంలోని దీవులకు మన వీరుల పేర్లు పెట్టడమన్నది దేశానికి వారందించిన సేవలు భవిష్యత్ తరాలకు గుర్తుండేలా చూసే మార్గమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మూలాలతో అనుసంధానమై ఉన్న దేశాలు అభివృద్ధి, జాతి నిర్మాణంలో ముందున్నాయని ఆయన అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ లో శివ్ అరూర్ చేసిన ఓ పోస్టుపై స్పందిస్తూ ఆయన ఇలా వ్యాఖ్యానించారు:

"అండమాన్, నికోబార్‌లోని దీవులకు మన యోధుల పేర్లను పెట్టడమన్నది దేశానికి వారు చేసిన సేవలను రాబోయే తరాలు గుర్తుంచుకునే మార్గం. దేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మన స్వాతంత్ర్య సమరయోధులు, విశిష్ట వ్యక్తుల జ్ఞాపకాలను పదిలపరచి, వాటిని ఘనంగా చాటే మా విస్తృతమైన కృషిలోనూ ఇది భాగం.అన్నిటికీ మించి, మూలాలతో అనుసంధానమైన దేశాలే అభివృద్ధిలో, జాతి నిర్మాణంలో ముందుకు సాగుతాయి.

# బీసీ స్టడీ సర్కిల్ ను ప్రారంభించిన రాష్ట్ర మంత్రి సవిత..

గొల్లపూడి బీసీ సంక్షేమ శ్యాఖ మంత్రి సవిత మరియు స్థానిక మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్,తిరువూరు ఎమ్మెల్యే కోకిలగడ్డ.శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి స్టడీ సర్కిల్ ను ఘనంగా ప్రారంభించరు.ఈ కరిక్రమాన్ని ఉద్దేశించి జైహో బీసీ అంటూ ప్రసంగించిన మంత్రి సవిత మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను పెంపుందించుకోవాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం బీసీ స్టడీ సర్కిల్ ను ప్రారంభించటం శుభపరిణామం అని అన్నారు స్వర్గీయ నందమూరి తారకరామారావు బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి లాగా బీసీ లందరికీ మహిళలకు పెద్దపీఠ వేశారు మహిళా విశ్వవిద్యాలయం రారంభించారు అని గుర్తుచేశారు.గత ప్రభుత్వంలో జాబ్ లు లేక విద్యార్థుల జీవితాలు అస్తావేస్తాం అయింది అంటూ మండిపడ్డారు.రాష్ట్ర అభిరుద్ధికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా మెగా డిఎస్సీ కోచింగ్ సెంటర్లు అలాగే ఇప్పుడు ప్రారంభించిన బీసీ స్టడీ సివిల్ సర్వీసెస్ కోచింగ్ పొంది ఐఏఎస లుగా వారి సర్వీస్ రాష్ట్ర అభిరుద్ధి దోహదిస్తాయి అని ఆకాన్షించారు.తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కొందరు ఐఏఎస్ లు మొదటి ప్రయత్నంలోనే సఫలం అవుతున్నారు మరికొందరు కోచింగ్ లు లేకుండానే ఉత్తీర్ణత సాధిస్తున్నారు అలాంటిది మన రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు లక్షల్లో ఖర్చు అవుతున్న ఐఏఎస్ కోచింగ్ ను రాష్ట్రం ప్రభుత్వం వెనకబడిన తరగతులకు సంక్షేమ శ్యాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ స్టడీ సర్కిల్ ను ఉపయోగించుకోవాలని తను తరుచూ సందర్శిస్తానని అన్నారు.అనంతరం మైలవరం ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నిజ జీవితం లో జరిగిన ఒక సంఘటన ను సినిమా రూపంలో తీశారు అలానే స్ఫూర్తిదాయకంగా మీరు అందరూ ఉండాలని విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.పట్టుదల తో చేదివి మట్టిలోనే మాణిక్యాలు పుడతాయి అంతే కానీ ప్రసిద్ధి చెందిన నగరాలలోనే కాదు అంటూ అద్భుతమైన సందేశాన్ని ఇచ్చారు.ఈ కరిక్రమంలో వివిధ కార్పరేషన్ల చైర్మన్లు,శ్యాఖ డైరెక్టర్లు,సివిల్ సర్వీసెస్ కోచింగ్ పొందుతున్న విద్యార్థిని విద్యార్థులు మరియు తదితరులు పాల్గున్నారు.

## క్లినికల్ అప్రెంటిస్షిప్ శిక్షణ కొరకు డిసెంబర్ 23లోగా దరఖాస్తు చేసుకోవాలి...

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. రవిబాబు

ఖమ్మం : ఇంటర్మీడియట్ ఎం.పీ.హెచ్.డబ్ల్యూ. (ఫిమేల్ ) ఒకేషనల్ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థినిలకు ఒక సంవత్సరం క్లినికల్ షిప్ శిక్షణ సత్తుపల్లి, మధిర, తిరుమలాయపాలెం ఏరియా ఆసుపత్రులలో అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవి బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తిగల విద్యార్థినిలు తమ బయోడేటా ఫారంతో పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి సమీకృత జిల్లా కలెక్టర్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 23 లోగా అందజేయాలని రవిబాబు ఆ ప్రకటనలో తెలిపారు.

# విన్నపాలపై ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందిస్తాం..

## ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

## షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణ పై వివరణాత్మక అధ్యయనం కోసం కరీంనగర్లో బహిరంగ విచారణ




హైదరాబాద్ ఎస్సీ కులాల ఉప వర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలు, విన్నపాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో వివిధ ఎస్సీ కులాల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్నామని తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణ పై వివరణాత్మక ఆధ్యయనం కోసం కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్వీకరించారు.

ఈ సందర్భంగా ఏక సభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ వివిధ ఎస్సీ కుల సంఘాల నుంచి 128 వినతులు, అభ్యర్థనలు అందాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్ ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కుల సంఘాల అభ్యర్థనలు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు.

బహిరంగ విచారణ జరగకంటే ముందు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఏకసభ్యకమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. పలు అంశాలను చర్చించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ను ఘనంగా సన్మానించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల పెద్దపల్లి జిల్లాల నుంచి ఎస్సీ కుల సంఘాల నాయకులు ప్రతినిధులు పెద్ద సంఖ్యలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగులీశ్వరరావు, ఆర్డీఓ కే మహేశ్వర్, జగిత్యాల డిఎస్సి డివో రాజకుమార్, సిరిసిల్ల డీఎస్సీడీవో విజయలక్ష్మి, ఎస్ డబ్ల్యూ ఓ లు తిరుపతి, విజయపాల్ రెడ్డి, పలువురు అధికారులు, వివిధ ఎస్సీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోళ్లపాడులో చెక్ డ్యామ్ నిర్మాణానికి భూమి పూజ

## 20 లక్షల నిధులతో చెక్ డ్యాం నిర్మాణ పనులు ప్రారంభం.



తుగ్గలి మండల పరిధిలోని కడమకుంట్ల పంచాయతీలోని రోళ్లపాడు గ్రామంలోని గ్రామ ప్రజల సమక్షంలో ఆర్డీటి ఏకాలజీ డిపార్ట్మెంట్ అధికారుల నేతృత్వంలో గ్రామ ప్రజలు సాగు నీటి సౌకర్యం కొరకు గ్రామ పరిసర ప్రాంతాలలో ఉన్న పెద్ద వంక పరిసరాల్లో దాదాపు 20 లక్షల రూపాయలతో చెక్ డ్యామ్ నిర్మాణం కొరకు ఆర్థిటి సంస్థ,ఎకాలజీ డిపార్ట్మెంట్ అధికారులు రోళ్లపాడు గ్రామ ప్రజల ఆద్వర్యంలో భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిటి సంస్థ ఎకాలజీ డైరెక్టర్ మురళినాథ్,కో ఆర్డినేటర్ భీమ లింగప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల కుటుంబాల కోసం స్వచ్ఛంధ సంస్థలు ఆర్డిటి సంస్థ,జనరల్ ఎకాలజీ అధికారుల ఆద్వర్యంలో చెక్ డ్యామ్ నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉన్నదని, భూమిలో భూగర్భ జలాలు దాదాపు 300 మీటర్లు అడగంటి పోతున్నాయని, అందుకు భూగర్భ జలాలు అడుగంటిపోకుండా పల్లపు ప్రాంతాల నుంచి లోతట్టు ప్రాంతాల వైపు ప్రవహించే నీరు నిలువ ఉండేందుకు చెక్ డ్యామ్ లు ఉపయోగకరంగా ఉంటాయని,అదేవిధంగా ఆర్డిటి సంస్థ నుంచి గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ చేసుకునేందుకు సేంద్రియ పద్ధతుల్లో స్లింకర్ల్,డ్రిప్పు పైపులు,ఆర్గానిక్ దినుసులు,చిరు ధాన్యాలు,పప్పు దినుసులు మొదలైనవి అందిస్తారని ఇలాంటి మంచి అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటీ టెక్నికల్ డైరెక్టర్ మురళీ నాథ్,ప్రాజెక్టు కో ఆర్డినేటర్ భీరలింగప్ప,సెక్టార్ టీమ్ లీడర్ నరసింహులు,ఆర్డిటీ ఇంజినీర్ బాలాజీ నాయుడు,ఎస్టీఓ చంద్ర శేఖర్, గౌరవ సర్పంచ్ మస్తాన్ భీ,భర్త బొజ్జులు సాహెబ్,సుంకయ్య,రోళ్లపాడు వెంకటేశ్వర్లు,డ్రైవర్ వెంకటేష్, కోయిలకొండ నాగరాజు,రోళ్ళపాడు నారాయణ,ఓబన్న,రోళ్లపాడు గ్రామ రైతులు సురేంద్ర,శ్రీనివాసులు,పెద్ద దానమయ్య,గిరిబాబు,చంద్ర నాయక్ నాగరాజు,ఇమ్మనుయేలు,రాజు,నల్లన్న,ఈశ్వర్ నాయక్,తులసి నాయక్, మాంగ్య నాయక్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగురాళ్ల మండలంలో పొలం పిస్తుంది కార్యక్రమం




: పిడుగురాళ్ల మండలములోని కరాలపాడు మరియు చెన్నాయపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మిరప మరియు కంది పంటల క్షేత్ర సందర్శన చేయడం జరిగింది. మిరప పంటలో తామర పురుగులు ఆశించే అవకాశం ఉంది కాబట్టి, రైతులందరూ సామూహికంగా నీలి మరియు పసుపు రంగు అట్టలను పొలంలో అక్కడక్కడ అమర్చి పురుగు ఉధృతిని గమనించాలి. పొలములో అక్కడక్కడ ప్రొద్దు తిరుగుడు మొక్కలను ఎర పంటగా వేసుకోవాలి. అలాగే అజాడిరక్టిన్10000 పిపిఎం 2.0 మి.లీ మరియు 0.5 గ్రా సర్ఫ్ లేదా ట్రైటాన్ 100% ను లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి అని సూచించారు. కంది పంటలో మారుకా మచ్చల పురుగు ఉధృతిని గమనించుకొని, క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ 1 లీటర్ నీటికి లేదా ఫ్లూబెండమైడ్ 50గ్రా 1 లీటర్ నీటికి లేదా కొరాజెన్ 60 మి.లీ 1 లీటర్ నీటికి కలుపుకుని పిచికారి చేసుకోవాలి అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి, వై మోహన్, వ్యవసాయ అధికారి ఎన్ శ్రీనివాస్ రెడ్డి, వి ఏ ఏ , షేక్ రేష్మా, గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు లో ఎస్సి సంక్షేమ హాస్టల్స్ ను ఏర్పాటు చేయాలి

## ఆర్ పి ఎస్ ఎఫ్, ఆర్ యూ ఎస్ ఎఫ్



ఎమ్మిగనూరు లో ఎస్సి సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది, రాయలసీమ ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ లు డిమాండ్ చేశారు స్థానిక ఎమ్మిగనూరు జూనియర్ కళాశాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు లో గత కొన్ని సంవత్సరాలనుండి స్కూల్స్ ఎస్సి సంక్షేమ బాలురు, బాలికల హాస్టల్స్ లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారు అని ఎమ్మిగనూర్ మండల పరిధిలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు వలసలకు వెళ్లడం జరుగుతుంది. విద్యార్థులను హాస్టల్స్ లేనందువలన ఎక్కడ వదిలి వెళ్లాలో అర్థం కాక చదువును మాన్పించేసి విద్యార్థులను వలసలకు తీసుకెళ్లడం జరుగుతుందని విద్యార్థులు వలసలకు పోవడం వలన విద్యార్థుల అక్షరాస్యత పూర్తి దెబ్బ తింటుందని విద్యార్థులు బాల కార్మికులు గా తయారు కావడానికి ఇది ప్రధాన కారణమని ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాల మరియు ఇతర మండలాల విద్యార్థులు వచ్చి ఇక్కడే చదువుకోవడం జరుగుతుంది విద్యార్థులు రోజు వారి ఊర్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా జిల్లా కలెక్టర్ గారు విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకొని విద్యార్థుల ఇబ్బందుల ను గ్రహించి హాస్టల్స్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఉద్యమాలకు దారి తీస్తామని వారు హెచ్చరించారు

# పైసలు కొట్టు...స్ట్రెచర్ పట్టు.

## అనంతపురం టౌన్ ప్రభుత్వ ఆసుపత్రి

## పెద్ద ఆసుపత్రిలో పేదల రక్తం తాగుతున్న గద్దలు..?

అనంతపురం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో పైసలు కొట్టు స్ట్రెచర్ పట్టు అంటున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఉద్యోగులు. పైసలు లేనిదే పని జరగదు అంటున్న రోగులుపైసలు కోసం రాబందుల వలే ప్రజలను పీక్కు తింటున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఉద్యోగులు. అందులో పని చేసే కొంత మంది ఉద్యోగులు ఒక్క రోజు కలెక్షన్ సుమారు ముప్పై వేల రూపాయలు?యూరిన్ బ్యాగ్ మనిషికి అమర్చాలి అంటే ఐదు వందల రూపాయలు సమర్పించాల్సిందే?స్ట్రెచర్ రావాలంటే పైసలు ఇవాల్సిందే.మందులు కావాలంటే ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఉద్యోగులు.పైస లేనిదే పని జరగని పరిస్థితి లో పెద్ద ఆసుపత్రిఇదేంటి అని ప్రశ్నిస్తే వాళ్లకు వైద్యం అందించని డాక్టర్లు,ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఉద్యోగులు.మంత్రి కైన చెప్పుకో ముఖ్యమంత్రి కైన చెప్పుకో పో అంటు సవాళ్లు విసురుతున్న పరిస్థితి?ఈ విషయాలు బయటకు చెప్పుకో లేక బయటకు చెప్పితే వైద్యం అందించలేరు అని భయపడుతున్న రోగి బంధువులు.ఇప్పటికైనా వాళ్ళ పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోడి పందేలు

## పుంజుల కోసం పందెపురాయుళ్లు వేట ప్రారంభం



విజయవాడ సంక్రాంతి వచ్చేస్తుంది. ఇక కోడి పందెలకు పందెపురాయుళ్లు నడుం బిగించారు. పుంజులకోసం వేట ప్రారంభించారు. మరోవైపు, పందెపు కోళ్ల పెంపకం వృత్తిదారులూ కొనుగోలుదారులను ఆకట్టుకునే విధంగా కోళ్లను తయారు చేస్తున్నారు. లక్షల్లో పందెం కాచేవారు గోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతలకు వెళ్లి మేలు జాతి పుంజులను తెచ్చుకుంటారు. కొందరు ఔత్సాహికులు విదేశీ పుంజులను సైతం పందేలకు సిద్ధం చేస్తున్నారు, పల్లెటూర్లలో ఒక్కో పుంజు 10-20 వేలు, ప్రత్యేక శిక్షణ, పోషణ పొందిన పందెపుకోళ్ళు ఒక్కొక్కటి రూ.లక్ష వరకు పలుకుతున్నాయి.

# మాతాశిశు ఆరోగ్య కేంద్రంపై పట్టింపు కరువైంది

## -మంథని మాజీ జడ్పీటీసీ తగరం సుమలత

## -మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు




మంథని ప్ర మాతా శిశు ఆరోగ్య కేంద్రంపై పట్టింపు కరువైందని మాజీ జడ్పీటీసీ తగరం సుమలత ఆరోపించారు. మండలంలోని సూరయ్యపల్లి గ్రామ శివారులో ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె బుధవారం సందర్శించారు. అనంతరం మాజీ జడ్పీటీసీ తగరం సుమలత మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు ఆసుపత్రిని సందర్శించి వివరాలను తెలుసుకోవడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం కళకళలాడితే కాంగ్రెస్ ప్రభుత్వం వెలవెలబోతున్నదన్నారు. పెద్దపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజలు ఆసుపత్రిని నిరంతరం పర్యావేక్షిస్తూ మంచి వైద్య సేవలు అందేలా కృషి చేశారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గర్భిణీలు, బాలింతలు, శిశువులకు పెద్ద దిక్కుగా ఉన్న ఈ ఆసుపత్రిని ఎవరు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్టు డాక్టర్ లేక పోవడంతో ఆసుపత్రిలోని బెడ్లు ఖాళీగా ఉండి నిర్మానుషంగా మారిందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గ కేంద్రంలో ఇలాంటి పరిస్థితులు ఉండటం బాధకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మంథని మాతా శిశు ఆసుపత్రికి గైనకాలజిస్టు డాక్టర్ నియమించడంతో పాటు ఆసుపత్రి పర్యావేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమం లో బీఆరెస్ పార్టీ మహిళలు బీఆరెస్ మంథని టౌన్ అధ్యక్షురాలు బుద్దార్తి రాణి, ఆరెపల్లి తిరుమల, పుప్పాల భాగ్య,కొట్టె పద్మ బీఆరెస్ పార్టీ మంథని మండల అధ్యక్షులు ఏగోలపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్ , అసిఫ్, ఇర్ఫాన్ లు పాల్గొన్నారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com